



SARATH

దిట్టమైనది...
ఖచ్చితమైన —
నిర్మాణము...
విశిష్టమైన రచన



హెర్క్యులిస్

మీ కొరకే నిర్మించబడింది

హెర్క్యులిస్ 136 దేశాలలో ప్రసిద్ధిగా [illegible]

[illegible]

హెర్క్యులిస్

— సైకిలంటే జీవితకాలపు నేస్తము

[illegible]

తొలిమాట

క్రిందటి సంచిక ముద్రణ బాగాలేదని, అక్షరాలు అసలు కనపడ్డంలేదని చాలామంది పాఠకులు రాశారు. కొంతమంది వచ్చే సంచికనుండి ఒక భూతద్దంకూడా పంపుతారా? అని అడిగారు. భూతద్దమైతే పంపలేంగాని కొత్త టైపులు సమకూర్చుకొని ఈ సంచిక ముద్రణ ప్రారంభించాము.

ఈ సంచిక ఇంత లేటుగా మీ కందటానికి ఇదే కారణం. అందుకు క్షమార్హులం.

• • •

పాటల పోటీలో పాఠకులు చూపిస్తున్న ఆసక్తితో దాన్ని కొంతకాలం కంటిన్యూ చేద్దామనుకొంటున్నాం. చూ. పే. 127.

• • •

త్వరలో మరిన్ని కొత్త వెలుగులు చూ. పే. 88

• • •

వచ్చే సంచికలో శ్రీమతి మాదిరెడ్డి సులోచన, యం. రామకోటి, మజుందార్ మొదలైన వారి కథలు. మిగతా మామూలు ఆకర్షణలు.

సుచిత్ర మాసపత్రిక

మాచవరం

విజయవాడ-4

విడిప్రతి వెల

1 రూపాయి

ఏడాది చందా

12-00 రూపాయలు

సంపుటి 7

ఏప్రిల్ 1969

సంచిక 4

మేనేజింగ్ ఎడిటర్

వి. వి. రాఘవయ్య

ముఖచిత్రం

“ఆదర్శ కుటుంబం” చిత్రంలో దృశ్యాలు

కాజువల్ రేట్లు

	రు.
లోపలి పేజి	150
లోపలి పేజీ (సగ భాగం మాత్రమే)	80
లోపలి ఓపెనింగ్ పేజీ	200
2 వ 3 వ కవరు పేజీ	300
4 వ కవరు పేజి ఒకే రంగు	400
,, రెండు రంగులు	500
,, మూడు రంగులు	600

కాంట్రాక్టు రేట్లు

సంవత్సరములో 6 పేజీలకు మించి

లోపలి పూర్తి పేజీ	130
లోపలి నగం పేజీ	70

మెకానికల్ డేటా

పేజి ఏరియా 21 × 14 సెం. మీ

ముద్రణ ఏరియా 18 × 11 సెం. మీ

కాలమ్ సంఖ్య - 2

కాలమ్ సైజు 18 × 5 సెం. మీ

నగం పేజీ 18 × 5 సెం. మీ

9 × 10 సెం. మీ

హాఫ్ టోన్ స్క్రీన్ 65

వివరాలకు :

అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజరు

జ్యోతి

మాచవరం విజయవాడ - 4

ఉత్తరాలు

గౌరవనీయులయిన ఎడిటర్ గార్కి,

ఆంధ్రదేశానికి దూరంగా ఉన్న ఆంధ్రుడుకు, తెలుగు పుస్తకం చూసినా, క్రొత్తగా తెలుగు వ్యక్తిని చూసినా ఎంతో అంతులేని ఆనందం కలుగుతుంది. అలాగే అయింది, మా విషయంలోకూడా - "జ్యోతి"- మీరు ప్రేమతో మాకు పంపిన కానుక అందుకొని (మార్చి '69) ఎంతో సంతోషంతో జ్యోతిని చదివాము అందరమూ. ఎంతో ఎక్కువ వ్రాయ వలసిన అవసరంలేదు. జ్యోతి అంటే చక్కగా - ఆనందంగా కాలాన్ని గడిపే వస్తువని మేమిదివరలో నిర్ణయించుకున్నాము. ఆ అభిప్రాయము అలానే వుంది మా వద్ద.

మా తెలుగు మిత్రులందరి తరుపున మీకు మా కృతజ్ఞతలు తెలియపరుచు కుంటున్నాము. వీలునుబట్టి, మీకు కష్టమని పించకపోతే ప్రతినెలా మాకు "జ్యోతి" పంపగలరా !

కృతజ్ఞలతో.
బాలాజీ.
ఇండియన్ స్టూడెంట్స్
ఎసోసియేషన్-మాస్కో.

ఆర్యా,

జనవరి జ్యోతిలో "ఆంధ్రప్రియ" గారి లేఖచూచిన మీదట ఈ లేఖ వ్రాస్తున్నాను. "ఆంధ్రప్రియ" గారన్నట్లు "చెరబండరాజును" మళ్లీ [illegible] గారు అపార్థం చేసుకో లేదు. పైపెచ్చు "ఆంధ్రప్రియ"గారే అపార్థం చేసుకున్నారేమోననిపిస్తోంది నాకు. శ్రీ "చెరబండరాజు" దిగంబర కవుల కోవకు చెందినవారనీ, ప్రస్తుత వ్యవస్థలోని అసభ్యత ప్రజలకు తెలిపేందుకు వారలా వ్రాశారనీ సమర్థిస్తున్నారు. "ఆంధ్రప్రియ"గారు అసలు "జ్యోతి"దీపావళి సంచికలోని "చెరబండరాజు" కవితను చదివారో లేదోనని నాకు అనుమానంగా వుంది. మచ్చుకు వారి కవితలోని కొన్నిపదాలు వినండి :

"నమ్మకు ఈ మఠాల
సుఖ రోగుల్ని
వర్ణాశ్రమ ధర్మద్వేషాలు రేపే
అడ్డగాడిదల్ని
బహిరంగంగా సభల్లో వ్యభిచరించే
ఆబోతుల్ని

శంకూ బొంకూ పురాణాల
బంకను
వేదికలెక్కి దుక్కల్లా కక్కే
వెధవల్ని"

ఇది సంఘాన్ని మరమ్మతు చేసేం దుకు వ్రాయబడిందనటం కేవలం హాస్యాస్పదం. ఏ వ్యక్తికీ మరో వ్యక్తినో, వ్యక్తులనో తిట్టే అధికారం లేదన్నది మనం గుర్తుంచుకోవాలి. ప్రస్తుత వ్యవస్థలోని అసభ్యతను ప్రదర్శించేందుకు ఇలా కొందరు వ్యక్తులను దూషించ నవసరంలేదు. తిట్టు పదాలు ప్రయోగిస్తేనేగాని ప్రజ లకు కనువిప్పు కాదనుకోవడం రచ యిత మౌఢ్యానికి నిదర్శనం.

"జ్యోతి" దీపావళి సంచికలో మరికొందరు దిగంబరకవుల రచనలు కూడా వున్నాయి. కాని వారెవరూ తమ పరిధి దాటలేదు. "ఆంధ్రపిపాసు"గారు మహాకవి శ్రీ శ్రీ "సందులలో పందులవలె మనదీ ఒక బతుకేనా ?" అన్నారు కాబట్టి, "చెరబండరాజు" గారన్న దాంట్లో తప్పేమీ లేదనటం హాస్యాస్పదం. శ్రీశ్రీ మనం ఏమిటో మనకు చెప్పారు. "చెరబండరాజు" మూడో వ్యక్తి వెధవనీ, ఆ బోతనీ, అడ్డగాడిదనీ మన దగ్గర తిట్టారు. రెంటికీ వున్న వ్యత్యాసం హస్తిమ శకాంతరం.

ఇకముందైనా "చెరబండరాజు" గారు ఇలాంటి వ్యక్తి దూషణ మాన గలరని ఆశిస్తున్నాను.

సెలవు

గుడిసేవ వెంకటేశ్వరరావు

మంచి కథలతో వెలువడిన '69 మార్చి నెల "జ్యోతి" చాలా బాగుంది.

ప్రచురింపబడిన కథలన్నియును మెచ్చుకొనదగ్గవే. ముఖ్యంగా నాకు రామవరపు వేణుగోపాలరావుగారి "ఘూటెక్కిన గంధక ధూమం", భమి డిపాటి రామగోపాలంగారి "అంబోతు" ముద్దంశెట్టి హనుమంతరావుగారి "తీపి విషం" మొదలగు కథలు నచ్చినవి.

ప్రత్యేకించి చెప్పుకోతగ్గ కథ కె. వి. ఎస్. శర్మగారి "వటారం".

రచయిత లందరూ నిజంగా అభి నందనీయులు.

మల్లాది విఠల్ బాబు

నెల్లూరు

నమస్తే,

గత రెండు మూడు నెలలుగా జ్యోతి మాస పత్రికను మేము తప్ప కుండా చదువుతూ వస్తున్నాము. కాని ఒక విషయం మీకు గుర్తు చేయడానికి మాకు చాల విచారకరంగా వుంది. అదే మంటే, సినిమా శీర్షిక క్రింద మీరు వేస్తున్న చిత్రాలు, చిత్రాలులా గావుండా, ఏవో అలికేసినట్లు ఉంటు న్నాయి. దానివలన ప్రయోజనం

ఖూ న్యం. అందువలన ఇక నెనా ఆ ఫొటోలు కొంచెం బాగా కనిపించే టట్లు ప్రచురిస్తే బాగుంటుందని మా ఉ ద్దేశం. అలా వీలులేనప్పుడు ఆ ఫొటో లకు ప్రత్యేకించిన స్థలంలో ఇంకే దైనా శీర్షిక ప్రవేశపెట్టి కొంత మేలు చేకూ రుస్తారని ఆశిస్తున్నాము. రాబోయే పత్రికలో ఈ మా ఎ కనిపిస్తుందని మా ఆశ. ఉంటాను. మరి, సెలవు,

మూర్తి
రూర్కెలా

ఆర్యా,

మీ (మా) జ్యోతి మార్చి సంచిక అత్యంతాకర్షణీయంగా తయారై నూతన వధువులా వచ్చింది. ప్రణవి గారి "మేలుకొండి మిత్రులారా" గేయం పత్రికకే హైలైట్. కథలలో రామవరపు వేణుగోపాలరావుగారి "ఘాటెక్కిన గంధక ధూమం" రోషన్‌గారి "గీత", భమిడిపాటి రామ గోపాలంగారి "అంబోతు" కథలుచాలా బావున్నాయి. సీరియల్సు కూడా ఆసక్తి దాయకంగా ఉన్నాయి. కార్టూన్స్ మాత్రం మ్మమల్ని కడుపుబ్బ నవ్వి స్తున్నాయంటె నమ్మండి!

మేకా రామచంద్రరావు
(సికిందరాబాదు-25)

భావలహరి

పుస్తకాలవల్ల సంపాదించిన విజ్ఞానం మన చేతలవల్ల ఉపయోగించక పోతే అవినట్టి చెత్తకాగితాలన్నమాట.

— బల్వర్

ఒక్క సిరా చుక్క లక్షలాది మానవులలో ఆలోచనలు రేకెత్తించ వచ్చును.

— బైరన్

మంచి ప్రేమలేఖ వ్రాయడమంటే నీవేం చెప్పాలో నీకు తెలియకనే ఆరంభించాలి. నీవేం వ్రాశావో తెలియకుండానే ముగిసిపోవాలి.

— రూసో

ఎక్కడ వెలుగు అధికంగా ఉంటుందో అక్కడ నీడ దట్టంగా ఉంటుంది.

— గాథె

చిరునవ్వు, కన్నీళ్ళు ఒక్కసారి వస్తే ఎంత. వాన కలసినట్టువుంటుంది

— షేక్స్పియర్

పొరపాట్లు జొరబడతాయనే భయంతో తలుపులన్నీ మూసివేస్తే సత్యంకూడ బయటనే మిగిలిపోతుంది.

— రవీంద్రనాథ ఠాగూర్

మర్యాదవల్ల ఖర్చేమీకాదు కాని అందువల్ల ఎంత విలువయిన వస్తువయినా కొనుక్కోవచ్చును.

సజ్జనులకు స్నేహితుడు, విజ్ఞులకు మార్గదర్శకుడు, మూర్ఖుల పాలిటి యముడు, దుర్జనులకు శత్రువు - "అదృష్టం"

— డబ్ల్యు. ఆర్. అల్గర్

వయసు పెరిగే కొలది జీవితానుభవం తరుగుతుంది. కాని జీవించాలనే కోరిక పెరుగుతుంది.

— గోల్డ్ స్మిత్

మరుపు అనేది రెండవ స్మృతి. మహా మేధావులు మొదట స్మృతికన్న దీనికే భయపడతారు అధికంగా.

— డాబూష్లర్స్

●

తక్షణం నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని నిర్వహించండి. తరవాతి కర్తవ్యం ఏమిటో అప్పుడే స్పష్టమవుతుంది.

—థామస్ కార్లైల్

మీకు అవసరంలేనిది కొంటే అచిరకాలంలోనే మీకు అవసరం ఉన్నది అమ్మివేయవలసి వస్తుంది.

— ఫ్రాంక్లిన్

సేకరణ : ఎస్. జి. రాజా



తన్ను తాను తెగ పొగుడు కోవటం, వెటకారంగా మాట్లాడటం జార్జి బెర్నార్డ్ షాకి వంట బట్టిన విద్యలు. అతడు వ్రాసిన 'కాండిడ' అనే నాటకాన్ని ప్రదర్శించిన మిస్‌స్కిన్నర్ అనే ఆ డకుషా అద్భుతం, చాలా గొప్పగా ఉంది' అని టెలిగ్రామ్ ఇచ్చాడుట

మిస్ స్కిన్నర్ ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది.

వెంటనే ఇలా జవాబిచ్చింది" అంత పొగడ్తకు అర్హత లేదు."

అంతటితో షా ఊకోచ్చునా సంతోషించి ?

అబ్బే. తనకంటె ఇంకెవరు బాగా మాట్లాడ లేరనుకొనే రచయిత అసలే ఊరుకోలేదు కదా ! అతని మామూలు ధోరణిలో వెటకారంగా మళ్ళీ ఇలా జవాబిచ్చాడు :

"నేనన్నది నాటకం గురించి. ప్రదర్శన గురించి కాదు."

మిస్ స్కిన్నర్‌కు ఒళ్ళు మండింది. తప్పని ఇలా జవాబిచ్చింది :

"ఔను. నేన్నది కూడా నాటకం గురించే."

●●●

— సీరియల్ —



రేపటి మనుష్యులు

శ్రీసుధా

[గత సంచిక తరువాయి]

అటు రూమ్‌లో కూర్చుని కేశవ మూర్తికూడా అంతే యాతనఅనుభవిస్తున్నాడు. గంటక్రితం పార్కులో రాజశేఖరంగారితో మాట్లాడుతున్న సుందర్రావుని అతను చూశాడు. వెంటనే వెళ్ళి పలకరించాల్సింది. యెందుకో ఆగిపోయాడు. జరిగిన విషయాలన్నీ, మానుతున్న గాయాలన్నీ రేగడం, తద్వారా రేగే అశాంతిని భరించలేకా వెనక్కి తిరిగి వచ్చేశాడు.

సుందర్రావు రాజశేఖరంగారితో యేం మాట్లాడి వుంటాడో?

కిటికీ లోంచి డీలాపడ్డ మనిషిలా రాజశేఖరంగారు రావడం కన్పించింది. గదిలోంచి అడుగు బయట పెట్టాలన్నా పాదాలు కదల్లేదు. తను పొరబాటు చేశానేమో అన్పించసాగింది. అవును- తన చరిత్ర, ఆయన ముందు విప్పి చెప్పుకోవడానికి తనెందుకు సంశయిస్తున్నదీ తనకే తెలియదు. శేషు చెబుతాడనీ, తన పరిస్థితుల్ని రాజశేఖరంగారు అర్థంచేసుకుని ఆప్యాయంగా పలకరిస్తారనీ అనుకోవడం ఆ వూహలూ దూరంగా జరిగి- తనని తనే యేకాకిని చేసుకుంటోన్నట్టు భయంపుడుతోంది. వో నిర్ణయానికి వచ్చినట్లు గబగబా రాజశేఖరంగారి దగ్గరకు వెళ్ళి వెనకనుంచే "రాజశేఖరంగారూ" అన్నాడు.

ఆయన కళ్ళు మూసుకుని ఆలోచించుకుంటున్నాడు. ఆ పిలుపు ఆయనకు అసహ్యకరమైన మనిషిమాటలా, క్రూరుడి ఆత్మఘోషలా, ప్రళయం హోరులా విన్పించింది.

అప్పుడే లోపలినుంచి వచ్చిన

రాజలక్ష్మి కేశవమూర్తిని చూసి "మీరా" అంది.

"పడుకున్నారేం యెలా వుంది ఆయనకు...."

"ఆయనకేమయిందని" అని తిరిగి ప్రశ్నించింది రాజలక్ష్మి ఆశ్చర్యంగా.

కానీ కేశవమూర్తి అప్పటికే వో నిశ్చయంతో లోపలకు వచ్చిన మూలంగా రాజలక్ష్మి మాటల్లో వ్యంగ్యం,కటుకూ,అతన్నేంచెయ్యలేక పోయాయి. రాజశేఖరంగారి వైపు చూసి "యేమండీ నేను....కూర్చో వచ్చా" అన్నాడు ప్రాధేయ పూర్వకంగా.

రాజశేఖరంగారు వేడిమి అంతా లోపలే దాచుకుని, కళ్ళతో సౌంజ్ఞ చేశాడు....కూర్చో మన్నట్లుగా....

15


తలసి ఐదుగంటలకు ఆఫీసు నుంచి రాగానే వాకిట్లో తండ్రి మరెవరితోనో మాట్లాడ్డం చూసింది. మనిషి వెనుతిరిగివున్నమూలంగా యెవ్వరయిందీ తెలియలేదు. లోపలికి వెళ్ళ

జరిగిన కథ

భుజంగరావు, లలితమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కూతురు అరుంధతికి పెళ్ళయింది. రెండో కూతురు తులసి పెళ్ళి ఒక సమస్య అయింది. ఆమెకు చదువుకోవాలని వుంది. పెళ్ళి చేయాలని తల్లికి వుంది. రెండింటికి డబ్బులేదు. తండ్రి ఆమెను కాలేజీలో చేర్పించాడు. కాని కొడుకు శేషును కూడా కాలేజీలో చేర్పించవలసిరావడంతో ఆమె చదువు మధ్యలో ఆగిపోయింది. ఆమె పెళ్ళికి డబ్బుకోసం భుజంగరావు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు.

శేషు కాకినాడలో రాజశేఖరంగారి యింట్లో అద్దెకు వున్నాడు. కాలేజీలో చదువుకుంటున్న ఆయన కూతురు రాజలక్ష్మితో అతనికి పరిచయం వృద్ధి అవుతుంది.

యిక చదవండి.



గానే లలితమ్మగారు "వొసే తులసీ" అని పిలిచి "మా రెండో అమ్మాయి" అని చెప్పి "వీరికి మనపక్క వాటా కావాలిట, చూపించు" అంది.

తులసి తన యెదురుగా వున్న అపరిచిత యువతినిచూసి "ర ం డి" అంది, ముందుకు నడుస్తూ.

తలుపులూ, కి టి కీ లూ తె రి చి "యింతకు ముందు యెక్కడ వుండే వారు" అంది.

"ప్రస్తుతం గొల్లప్రోల్లో బంధువు లింట్లో వున్నాం. యీ ఊళ్ళో కాపరం పెట్టుకోవాలి" అంది.

తులసికి అప్పుడు గుర్తొచ్చింది - వాకిట్లో వున్న వ్యక్తి యీ అమ్మాయి తాలూకే అయ్యుంటాడని.

"మీరు వొక్కరే వచ్చారా".

"లేదండీ వారూ వచ్చారు. మీ నాన్నగారితో మాట్లాడుతున్నారు."

"వుద్యోగం యెక్కడండీ" ఆతృతగా అడిగింది.

"షుగర్ ఫ్యాక్టరీలో కేషియర్"

తను పనిచేసేదికూడా అక్కడేనని చెప్పాలా వొద్దా అని అనుకునేలోపున ఆ అమ్మాయే అడిగింది.

"మీరూ వుద్యోగం చేస్తున్నారుటగా"

"మా అమ్మ చెప్పిందా" అని అడిగి వీధి వైపున తమ వాకిట్లోకి వున్న తలుపు తెరిచింది. యెదురుగా తండ్రీ ఆ అపరిచిత వ్యక్తీ కన్పించారు.

"మనం వెడదామా" అంది భర్తను వుద్దేశించి, ఆ అమ్మాయి.

"నీ యిష్టం" అని వెనుతిరిగాడు అతను. ఆతనికి తులసి - తులసికి అతనూ కన్పించారు."

"బొట్టు పెడతానుండండి" లోపలికి వెళ్ళి కుంకుమ భరిణి తీసుకువచ్చి బొట్టుపెడుతూ "మీపేరు" అని అడిగింది.

"జానకి"

"నాపేరు తులసి"

"యేం వెడదామంటావా"

"యిల్లెలావుంది నీకు. వారికి యేదో వొకటి యిప్పుడే చెప్పేద్దాం" జానకిని ప్రశ్నిస్తూ అతను.

"నాకు నచ్చింది" అంది జానకి చిన్నగా నవ్వి.

"అయితే మంచి రోజుచూసి వచ్చేస్తామండీ" అన్నాడు భుజంగరావు గారితో అతను.

యిద్దరూ బయటకు వెళ్ళిపోతూంటే ఈడూ జోడూ అయిన జంట అనుకున్నాడు భుజంగరావు.

తులసి కూడా అలాగే అనుకుని వాళ్ళిద్దరి గురించీ ఆలోచించినా, అంతకుమించి ఆకేషియర్ గురించే ఆలోచిస్తోంది. అతన్ని తనెక్కడో చూసింది. పరిచయమైన మొహం. జానకి కూడా అలాగే వుంది. పాపిడి దగ్గరనుంచి సుడిని చీల్చుకుని పైకి దువ్వుకున్న నొక్కుల జుట్టు. కను రెప్పలు తలుపులు తెరుచుకున్నట్టుగా కదలడం. బ్రాకెట్ మధ్య "వి" అక్షరం అతికిన అందమైన ముక్కు. ప్రమిదమీద నారిలేని విల్లు నిలబెట్టి నట్టున్న నోరు అన్నీ గుర్తొచ్చాయి.

లలితమ్మగారు అన్నం వడ్డిస్తూ "అతని పేరేమిటండీ, గమత్తుగా వుంది" అంది భర్తతో.

"కైలాసరావు"

పక్కనే కూర్చుని భోజనంచేస్తున్న తులసి ఆ పేరు విని సంవత్సరాల చిన్నదయిపోయింది. అవును. కైలాస రావు తనతోపాటు కాలేజీలో చదివే వాడు. ఆర్ట్స్ సెక్రటరీ. హాస్టల్‌కువోట్లు గురించి వచ్చేవాడు. వుపన్యాసాలు యిచ్చేవాడు. ప్రతీ నాటకంలో వేసే వాడు. చాలామందిలోవున్నా కొందరిలో ప్రత్యేకత కొట్టొచ్చినట్టు కన్పిస్తూ

వుంటుంది. అదే విషయం గురించి తనూ కాంతం వాదించుకునేవారు. వాళ్ళు "గ్యాస్ట్రాలజీ" చదివిన కాంతం "యాట్రాక్టివ్ ఫిగర్స్" అంటారని చెప్పేది.

నిజమేనేమో. వందలాది రోజూ గేలిచేసి కూడా కూడా తిరిగినా అలజడి కలగదు. యీలలువేసి, వెక్కిరింపుగా మాట్లాడి చాలా కదిలించామని మగవాళ్ళు అనుకున్నా తమలో యే "రియాక్షనూ" వుండదు. వాళ్ళని వెనకే మర్చిపోవడం జరుగుతుంది. కొందరు పైకి మౌనంగా మహర్షులా వుంటా . యేదీ మాట్లాడరు. వొకవేళ యెప్పుడైనా మాట్లాడితే ఆ మాటలే మనసులో సవ్వడి చేస్తాయి. వొక్క "విట్" మాట్లాడితే కొన్నిరోజుల పాటు గుర్తుకొచ్చి నవ్వొస్తుంది. కైలాసరావు గురించి తమ హాస్టల్లో అదేవిధంగా మాట్లాడుకునేవారు....

"నేను గుర్తున్నానోలేదో" అనుకుంది పడుకుంటూ తులసి.

సరిగ్గా అదే సమయానికి గొల్లప్రోల్లో కైలాసరావు జానకితో అన్నాడు. "ఆ అమ్మాయి, మా కాలేజీలోనే చదివిందనుకుంటాను.... గ్రూప్ వేరు."

"మీ ఫ్యాక్టరీలోనే పని చేస్తోందిట."

"అలాగే, పేరు యెవరుట."

"తులసి...."

"యస్....తులసి—అవును" అతను గుర్తు చేసుకుంటున్నాడు.

* * *

నెల పరిచయంతోనే తులసికి - జానకి ఆప్తురాలిగా తన అభిప్రాయాలకు రూపంగా కన్పించింది. చాలామటుకు జానకి మాటల్లో, ప్రవర్తనలో మృదుత్వం, కలివిడితనం అన్నీ తను కోరుకునే, కలలుకనే వూహాలే రూపం పొందినట్టుగా వుండేవి. అటు ఆఫీసులో కూడా కైలాసరావు విద్యార్థి దశలోని హ్యూమర్ని మర్చిపోనట్టుగానే కన్పించేవాడు ...., తలొంచి పని చేస్తూకూడా చిరునవ్వు నవ్వుతూ చికు వ్యక్తపరచకుండా వుండడం ఆమెకు ఆశ్చర్యంగా వుండేది.

"ఏమండోయ్ యెకౌంటెంట్ గారూ, ఆఫీసు టైములో నిద్ర ఆపుకోలేక పోతున్నామని సర్టిఫికెట్ ప్రొడ్యూస్ చేసినవారికి అదనపు యింక్రిమెంట్లు యిమ్మంది గవర్నమెంటు. ధైర్యంగా నిద్రపోయి, ఆనక డాక్టరు సర్టిఫికెట్ సంపాదించండి...."

"ఆంజనేయులుగారూ ఫైల్లో తలదూర్చి ఆఫీసరుని తిట్టుకోకండి, ఫైళ్ళకి వరకాల ప్రవేశం వొచ్చు. ఆగదిలోకి వెళ్ళి నిజం చెప్పేస్తాయి జాగ్రత్త" అనేవాడు. తులసిమీదకూడా నవ్వుతూ విట్లు వేస్తూండేవాడు.

"పాపం ఆ టైప్రైటర్ని అలా చితక్కొట్టకండి, పూర్వ జన్మలో

మీలా అదికూడా వో లేడీ టైపిస్టే" అంటూ కావేరిని వో రోజు సీరియస్‌గా అడిగాడు. "మీ టైప్‌రైటర్ గాని యిన్షూర్ చేశారేమిటండీ" అని.

కావేరి తన పొరబాటు తెలుసుకుని నవ్వకుందుకు పావుగంట పట్టింది.

వొక్కొక్కసారి లీజర్ టైములో మరీ వింత విషయాలు చెప్పేవాడు.... వందరూపాయల జీతగాడి కుర్చీకూడా



ప్రమోషన్, యింక్రిమెంట్లకోసం విసిగి నిరాశతో చేతులూ, కాళ్ళూ విరగ్గొట్టుకుంటుంది. అందుకే ఆఫీసులో కుర్చీలకు కాళ్ళు తెటికలు పడుతూ చేతుల్లేకుండా వుంటాయి.... వాటికి మరీ కోపం వచ్చినప్పుడు గుమాస్తాలను పడగొట్టి మేకులతో చొక్కాలనీ పంచెల్నీ చింపేస్తాయిట.

"మరి ఆఫీసరిగారి కుర్చీ, మాటో" అడిగారు కొందరు.

"హోదాతో విసిగి, వొంటిగా అలంకారాల మధ్య, పేపర్ వెయిట్ కింద కాగితంలా రెపరెపలాడుతూ ప్రబంధనాయికలా విరహోత్కంఠితయై పక్కగదిలో గుమాస్తా కుర్చీతో "యెలోప్" అవుదామని ఆశపడుతూ వుంటుంది...."

భుజంగరావుగారికీ, దక్షిణామూర్తిగారికీ కైలాసరావు నడివేసవిలో చలివేంద్రంలా, తులసికి జానకి పిల్లతెమ్మెరలా కన్పించారు. తులసికి కైలాసరావుతో అప్పటికే చనువు యేర్పడింది. తరచు జానకీ వాళ్ళ వాటాలోకి వెడుతూ వుండేది.

"మా అమ్మమ్మ పెళ్ళిచేసుకోమని వొకటే వుత్తరాలు వ్రాస్తోంది జానకి" అంది తులసి.

కాఫీతాగుతున్న కైలాసరావు వెంటనే అన్నాడు .... "ఏమిటీ మీ అమ్మమ్మగారు మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటారా ?"

వాళ్ళక్కా-సారిబాధగా అనేది "మీకేముండీ అన్నీ అమరినవాళ్ళు. ఏమైనా అంటారు. నా సంగతి చూడండి. యిప్పుడు నేనెంతమందికి బరువు... నాకునేనే బరువు."

"మీ ఒరిజినల్ వెయిట్ ఎంతట?"

"అది కాదండీ" నవ్వు ఆపుకుంటూ అంది తులసి.... "జీవితం నాకేం ప్రసాదించిందని...."

"తులసిగారూ మీరనుకున్నట్టు అందరూ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ లాంటి జీవితమే కావాలనుకున్నా, మూడో తరగతి పెట్టెల్ని తిట్టుకున్నా ఏదీ స్థిరంకాదు.... మనవెనుక మహాప్రయాణానికి అలలుగా యెందరో వస్తూనే వుంటారు. యిక రైలు ప్రయాణం అన్నది నిత్యంకాదు. అంతరూ దిగాల్సినవారే. క్రిందకు దిగిన తర్వాత అందరి సమస్యలూ వాకచే అనుకున్నప్పుడు ప్రయాణం గురించి కాకుండా చేరవల్సినచోటు గురించి ఆలోచించాలి. అలా ఆలోచించడం చేతకానివాళ్ళే యిలా తాత్కాలికమైన ప్రస్థానం గురించి తలపోస్తారు. అదే తప్పు" అన్నాడు.

"అయితే నాబాధ తాత్కాలికమా" అంది తులసి.

"అవును తులసీ" అంది జానకి.

తులసికి ఆ భార్యాభర్తల అన్యోన్యత సందడి యెంతో రిలీఫ్ యివ్వడం కాకుండా ఆమె నరనరాల్లోనూ వాళ్ళ దరూ రసాయనిక పదార్థాల్లా కలిసిపోయారు. భవిష్యత్‌పట్ల ప్రతీ ఆలోచనకూ ఆ దంపతుల్నే సాదృశ్యంగా తీసుకునేది. వాళ్ళ అనుభవాలకూ, ఆశయాలకూ బంగారు మలామా పూలిమి తను వాటిని పొందబోతోన్నట్టు కలలు కనేది.

మరో నెల గడిచేసరికి జానక్కి ఐదోనెల వచ్చింది. అంతవరకూ జానకే వంటా, చాకిరీ చేసుకునేది. అప్పుడప్పుడు లలితమ్మగారు సాయపడేది. రాత్రిపూట వంటపనిలో తులసి చెయ్యి కలిపినా పగలు జానక్కి అవస్థ తప్పేదికాదు. కైలాసరావు వంట మనిషిని పెడతానన్నా జానకి వొప్పుకోలేదు.

తులసికి - జానకి పుట్టింటి వాళ్ళెవరూ రాకపోవడం అటు కైలాసరావు తరపు వాళ్ళుకూడా వచ్చి చూడకపోవడం ఆశ్చర్యంగానే కన్పించింది. అక్కయ్య మొదటి కాన్పుకి తల్లెంత హడావిడిచేసిందో గుర్తుకు వస్తూండేది. అందుకే అడిగింది.

"జానకీ మీ అమ్మగారికి వుత్తరం వ్రాయలేకపోయావా?" అని.

"అమ్మ" అందిజానకి పేలవంగా. తులసి భయంగా చూసింది.

"నా కెవరూ లేరు తులసీ. వుహూ. వున్నారు. నేనే యెవరికీ కాను."

"అదేమిటి" అంది ఆశ్చర్యంగా

తులసి". జానకి యెప్పుడూ అంత బరువుగా మాట్లాడ్డం చూడలేదు.

జానకి చెప్పింది. "తులసీ, యే మనిషి అంతర్యంలో అగ్నిపర్వతాలు నిద్రపోతూ వుంటాయో, వాళ్ళే అతి శీతలంగా కన్పిస్తారు. లోపల బాధలనేవి గోల చేస్తూంటేనే పెదవులమీద నవ్వులు పూస్తాయి. మా బ్రతుకులు కూడా అంతే."

"అంతే" అంది తులసి.

"యేం చెప్పను, తులసీ. నేను మా నాన్నని యెరగను. నాకు తెలిసినంత వరకూ అమ్మా, ఆ అమ్మకు నేనూ- మా యిద్దరికీ తలదాల్చుకుందుకు యిల్లూ, ఆ యింటి యజమాని మా చిన్నాన్న శేషాద్రిగారూ, ఆయన కుటుంబం యివే నాకు తెలుసు. మా నాన్న, చిన్నాన్న ఆస్తులు పంచుకునే సరికి మేం చాలా డబ్బున్న వాళ్ళం. "పువ్వులమీద పడుకునే అర్హతగల రోజులు" అనేది అమ్మ వాటిని.

కానీ నాన్నకు చాలా రకాల దురలవాట్లు వుండేవట. అవి చెబితే సభ్య ప్రపంచం ముక్కు మీద వేలేసుకుంటుంది. ఆత్మ పరీక్ష చేసుకుని కర్మ సిద్ధాంతంమీద నమ్మకం వున్న వాళ్ళు "దురదృష్టం" అంటారు.

మా నాన్నకు రేసులు కావాలి. క్లబ్‌లు కావాలి. పానీయం, పడతీ కావాలి. యివన్నీ ఆయనకు ప్రాణం కన్న తీపి. ఆ తీపిముందు అమ్మా నేనూ చేదుగా కన్పించాం. ఆయన బ్రతికుండగానే ఆస్తి హరించుకు పోయింది. మిగిలింది, వుద్యోగం. వుద్యోగం విధిగా నిర్వహించాల్సి వచ్చినరోజు, ఆదాయం తగ్గిపోవడం మూలంగా, అటు వూహల్లో పిలిచే అందమైన బ్రతుకుతో, ఆయన రోజుల్ని యుగాలుగా చూసేవాడు. అలవాట్లు పట్టుతప్పిన గుర్రాల్లా రంకెలు వేసి గోలచేసేవి. అలాగే అమ్మ కన్నీళ్ళమీద, నా పసి చూపులమీద, కాళ్ళాని వెళ్ళిపోయేవాడు. జీతంలో

మూడొంకులు నిప్పుల విడిగా ఖర్చయి ఆయన శరీరాన్ని నల్యం చేసింది. వో రోజునాన్న పోనూమ. అప్పుడు మాకు మిగిలిన ఆస్తి, అమ్మ పుస్తె ఒక్కటే. చూడు - పదేళ్ళ నేనూ నలభై యేళ్ళ అమ్మా మేం యిద్దరం కార్చిన కన్నీరు అనుభవించిన చీకటి యీరోజు వరకూ చాలా కుటుంబాలకు తెలియదు ...అన్నీ పోయిన్నాడు కూడా మనిషికి ఆశ అనేది చావదు. బ్రతుకు సమస్యగా, సశేషంగానే వుంటుంది. యేమనుకు న్నాడో మా చిన్నాన్న వచ్చి మమ్మల్ని తీసుకు వెళ్ళాడు. వాళ్ళింట్లోనే నేను పెరిగాను - చదువుకున్నాను.

నా గురించే అమ్మ వాళ్ళింట్లో చాలారకాల చాకిరీలు చేస్తోందనీ' అందరిచేతా మాటలు పడుతోందనీ నేను స్కూల్ ఫైనల్ పాస్ అయ్యేంత వరకూ తెలుసుకోలేక పోయాను. అందుకేనేమో బాబాయ్య నాకు వాళ్ళ పిల్లలతో పాటు కాలేజీ చదువు యివ్వ లేదు. టైపూ, షార్ట్ హేండూ పాస య్యాను. నా తోటి పిల్లలు నా ముందే "మెడిసన్" "డిగ్రీ" కోర్సులు చదువు కునేవారు.

వాళ్ళందరికీ నేను - వంటయ్యిందీ లేందీ చూడ్డానికీ; నాగాలు తీసివేసి పాల బాకీలు తేల్చడానికీ, చాకలివాణ్ణీ, దాసీ దాన్నీ గదమాయించడానికీ వుపయోగపడుతూ వచ్చాను. వాళ్ళంత స్వేచ్ఛగా బ్రతకడం చూస్తూండడం మూలంగా, నాలో యీర్ష్యను మించి, ఆ యింట్లో నేను బ్రతికే బానిస బ్రతుకు జమా ఖర్చు లతో నాకు కన్పించేది .... నాకు వోదార్పు యిచ్చేది నా కన్నీరు మాత్రమే.... "నాదీ యీ ప్రపంచం, నాకోసం కూడా యీ లోకం" అనే నిర్ధారణకు వచ్చేశాను. అప్పటికి నేను ఉద్యోగంలో జేరి ఆర్నెళ్ళయ్యింది. మా ఆఫీసులో నాతోపాటు ఒకతను పనిచేసేవాడు. అతను నాకు తలదాల్చు కునే కుటీరంలా, అతని గుండెల్లో ఏ యుగాల క్రితమో, నేను చోటు చేసుకుని బ్రతికి వుంటాననీ అన్పిస్తూ వుండేది. అతని చూపులు, నడకతీరు, మాటలు అన్నీ యింట్లో కలతల్ని మర్చిపోయేటట్టు చేసేవి. అతనితో మాట్లాడుతూ, ఆ తరువాత గుర్తు చేసు కుంటే నేనేం మాట్లాడానో తెలిసేది కాదు. అతనే ఓ రోజు అన్నాడు. "మీ చరిత్ర అంతా నాకు తెలుసు. మనం పెళ్ళిచేసుకుందాం, మీ కిష్ట మేనా" అని.

"ఎలా తెలుసు."

"కొద్దిగా మీరు చెప్పారు. చాలా నేను వూహించాను...."

నేను వొప్పుకున్నాను. యేనుగంత బలం వచ్చింది. ఆ బలంతోనే యింట్లో అందరూ కలిసిన సమయం చూసి చెప్పేను. అందరూ చెల్లాచెద రయిపోయారు. కూడదన్నారు.

తిట్టాను. అయినా నేను వొప్పుకోలేదు. చిన్నాన్న మరీనూ. నా గురించిన ఆయన వూహలూ, వుపకారాలూ, అన్నీ పెద్దగా చూపించడం మొదలు పెట్టాడు.

"వద్దు బాబాయ్, చేసింది చాలు" అన్నాను.

"అదేమిటే బాబాయ్‌మాట కాదంటావు" అంది అమ్మ. నాకు తెలుసు. అమ్మ అప్పటికే ఆ బానిస బ్రతుకుతో పోరి, అలిసిపోయి అలవాటు పడి పోయింది. అమ్మ నన్ను బ్రతిమలాడింది. నేను వాదించాను. ఫలితం లేకపోయింది.

మరునాడు అతనితో జరిగింది చెప్పాను. ఆ సాయంకాలం అతను నన్ను బాస్ దగ్గరకు తీసుకువెళ్ళి "మేం పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాం. మీ హార్టులీకో ఆపరేషన్ కావాలి" అంటూ జరిగిందంతా చెప్పేశాడు. కో స్టాఫ్‌తో చెప్పాం. 'చాలామంది ఆశ్చర్యపోయినా ఆనందం ప్రకటించారు. మా బాస్‌కూడా హెల్ప్ చేస్తామన్నారు.

మూడో రోజు సాయంకాలం రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి జరిగింది.... మా బాస్ పెళ్ళిపెద్ద. ఆఫీసు వాళ్ళు బంధువులు. అలాగే యింటికివెళ్ళి నమస్కరిస్తే ఆశీర్వదించినవాళ్ళూ, ఆనందించినవాళ్ళూ లేకపోయారు. నేనంతగా తెగించడం వాళ్ళెవరికీ యిష్టంలేదు.

నిజానికి - ఆయనకూ నా అన్న వాళ్ళెవరూ లేరు. యెక్కడో అన్నగారు వుండి డబ్బు పంపిస్తూంటే, జీతం కట్టి ఆ పైన వారాలు చేసుకునితింటూ కష్టపడి చదువుకున్నారట.

ఆఖరికి మేం తప్ప మరెవ్వరూ మా అనేవాళ్ళులేరు. అమ్మను నాతో పంపకుండా బాబయ్య నా మీద కక్ష తీర్చుకున్నాడు. అదే వాళ్ళు నా మీద ప్రయోగించిన ఆఖరి అస్త్రం. ఎవరి కోసం ఎంత తెగింపుగా ప్రవర్తించానో, ముందు దారిలో సుఖపెడదామని అనుకున్నానో అటువంటి అమ్మ నోటివెంట బాబాయ్ "నేను నీతో వచ్చినట్లయితే ఏం బాగుంటుంది చెప్పు జానకీ. అప్పుడప్పుడు వచ్చి చూస్తానమ్మా" అన్పించాడు.... మేం సంసారం పెట్టుకున్న తర్వాత అమ్మ వచ్చి పది రోజులు మాత్రం నాదగ్గర వుంది. నిరుటి సంవత్సరం అమ్మకు ఎక్కువగా వుందనీ రమ్మనమనీ బాబాయ్ టెలిగ్రాం యిచ్చాడు. వెంటనే విశాఖపట్టణం వెళ్ళగలిగినా అమ్మ శవాన్నికూడా నాకు దక్కకుండా చేశారు....యిదీ మా బ్రతుకు. మాకు ఎవరున్నారు చెప్పు, తులసీ" అంది జానకి కన్నీరు కారుస్తూ....

తులసికి అదంతా సినిమా కథలా తోచింది. ఓ రకం మనుష్యుల్లోనే కొన్ని కన్పించని లోతులు వుంటాయి. మనం వూహించలేం. తీరా ఆ లోతు తెల్సిన రోజు స్వంతం గురించి ఆలోచించుకోవాలన్న ధ్యాసే వుండదు.

పాతిక సంవత్సరాలు నిండకుండా యిన్ని అనుభవాలు గణించి బ్రతుకుతో పోరాడిన జానకి తనకన్నా యెత్తైనదిగా అన్పించింది తులసికి.

అటు కైలాసరావుకూడా ఆమెకు దేవుడి అంశంలా కన్పించాడు. అసలు మామూలు మనిషిగా అతను జానకి పట్ల ప్రవర్తిస్తే ఆమె బ్రతుకేమయ్యేది?? యేం మిగిలేది?? ఆ రాత్రి కైలాసరావులాంటి వ్యక్తితో తనకు పరిచయం అయినట్టు, ఆ దంపతుల అనుభవం తనూ చవిచూసినట్టూ ఓ వున్నత శిఖరం అందుకున్నట్టూ కలొచ్చింది తులసికి.

16

శేషు తెల్లవారిలేకాలేచి తెరుస్తారనగా కాకినాడ ప్రయాణం అయ్యాడు. అప్పటికే శేషుకు కైలాసరావుతో పరిచయం అయ్యింది. శని, ఆదివారాల్లో వచ్చినప్పుడు ఆ పరిచయం మరింత పెరిగ

సాగింది. శేషు కైలాసరావునుచూసి "అదృష్టవంతుడు" అనుకున్నాడు.

తండ్రితో "నేను వెడుతున్నానండీ నాన్నగారూ" అన్నాడు.

"జాగ్రత్తగా చదువుతున్నావా, పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి."

"ఆ" అన్నాడు శేషు.

"అనవసరంగా యెవరితో నూ గొడవలు పడకు. వొకసారి చెడ్డపేరు వస్తే అది చెరుపు కుందుకు చాలా కాలం పడుతుంది" అన్నాడు గంభీరంగా.

శేషు ఆశ్చర్య పోయాడు. తండ్రి నోటినుంచి అటువంటి హెచ్చరిక వినడం అతనికదే మొదటిసారి.

అక్కడేవున్న దక్షిణామూర్తిగారు "వూరుకోవయ్యా, యెవరో కిట్టని వాళ్ళు చేసిందానికీ" అన్నాడు, సమర్ధిస్తోన్నట్టుగా.

"అసలు కిట్టని మనుష్యులు యెందుకు వుండాలి...."

"మనకు లేరేమిటి. నువ్వెళ్ళవోయ్ శేషూ."

శేషు అక్కడినుంచి లోపలకు వెళ్ళినా, తండ్రిచెప్పిన మాటల వెనుక హెచ్చరిక తన్నంటి వచ్చినట్టే బాధ పడ్డాడు. తులసిని "యేం జరిగింద"ని అడిగాడు....తులసి కొంత దాచిపెట్టి-యెవరో అతని ప్రవర్తనా, స్నేహాలూ బాగుండలేదని కాకినాడనుంచి తండ్రి పేర వుత్తరం వ్రాశారని చెప్పింది....

శేషుకి తలకొట్టినంత పనైంది....తన నిజాయితీని వ్యక్తపరుచుకుందుకు మార్గమేమిటో తెలియలేదు....ఆ తికమకతోనే వెంటనే కాకినాడ ప్రయాణం అయ్యాడు.

కానీ కాకినాడ చేరుకుని, రూమ్‌కు వెడుతూంటే తిరిగి-నేరంచేసి పారిపోయివచ్చిన మనిషిలా అయిపోయాడు. రూమ్‌కు వెళ్ళేసరికి తాళం వేసి వుంది. కేశవమూర్తి యెక్కడికి వెళ్ళుంటాడు. ఆయన గురించి ఆలోచనలు చెడుగా ముసురుకోవడం మొదలు పెట్టాయి. తొందరపడి యెక్కడికయినా పారిపోయాడేమో? రాజశేఖరం గారింట్లో కూడా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. సరాసరి కాలేజీకి వెళ్ళాడు. క్లాసులో అడుగు పెడుతూనే లేడీస్ బెంచీమీదవున్న రాజలక్ష్మిని వెదికాయి, అతని కళ్ళు. రాజలక్ష్మి తనవైపు యేమాత్రం ఆత్రుత కనబరుస్తూ చూడలేదనిపించింది-అతనికి.

యిలా రకరకాల అర్ధంలేని భావ సంచలనం అతనికి తలపోటు ప్రసాదించింది. క్లాసునుంచి లేచి బయటకు వచ్చేశాడు.

"వారేయ్ పంతులూ-" అన్న పిలుపుతో శేషు వెనక్కి తిరిగి చూచాడు, గోవిందరావు రూమ్‌లోంచి పిలుస్తున్నాడు.

"అదేమిటిరా, అరణ్యంలోంచి సరాసరి వచ్చి మనుష్యుల్లో పడ్డట్టు ఆ

చూపేమిటి ?" అన్నాడు, మంచం చూపిస్తూ.

శేషు కూర్చుంటూ "యేం లేదురా" అన్నాడు భారంగా.

గోవిందరావు నవ్వేస్తూ- "చెప్ప కూడనిది యేదో వుంటేనే చాలామంది "యేం లేదు" అనే మాట వుపయోగిస్తారు. రహస్యం కాకపోతే "ఫలానా" అంటూ పురాణం మొదలు పెడతారు. దేర్‌ఫోర్ నీలో కూడా యేదో వుండితీరాలి" అన్నాడు.

"కేశవమూర్తి కన్పించాడా ?"

"యివాళ కాలేజీకి రాలేదు. మొన్న రాత్రిమాత్రం మెయిల్ డూప్లికేట్‌లో కన్పించాడు "

"యెక్కడికి వెళ్ళాడంటావ్ ?"

"మనకు తెలియదురా, పోతే మద్రాసుపైపు అనుకుంటాను."

శేషు తీవ్రంగా ఆలోచించడం చూసి, గోవిందరావు "వారేవ్, శేషూ నువ్వేమనుకోనంటే వొక్క విషయం చెప్పేదా" అన్నాడు.

"అనుకునేదేముంది, చెప్పు."

"మొదట, ఆ కేశవమూర్తితో నీ స్నేహం, యిత్యాదులు నాకు నచ్చ లేదురా...."

తను చేసిన పొరబాటేమిటో, వేసిన తప్పటడుగు యెక్కడో తెలియ చెప్పకుండా యిలాఅందరూ విమర్శించ డంతో అంతవరకూ నొక్కిపెట్టుకున్న కోపం, ఆవేశం రేగాయి శేషులో.

"యేం చేశానని యింతకీ నేను - నీ యేడుపేమిటి ? ఆయనతో నా స్నేహా నికి కారణం నువ్వు కాదేమిటి ?" అన్నాడు.

గోవిందరావు శేషుకోపం పసిగట్టిన వాడిలా, వో క్షణం నిశ్శబ్దంగా వూరు కున్నాడు.

"అందరూ యిదేమాట" అను కుంటున్నాడు శేషు స్వగతంగా.

"నాకు చలపతి చెబితే యీ విష యాలు తెలిసాయిరా. కేశవమూర్తి ఫాదర్‌వచ్చి అతనిమీదా, రాజశేఖరం గారిమీదా తారాజువ్వల్లా లేచార్ట - నీ గురించి కూడా స్కేండల్స్‌వేసి అదో రకంగా మాట్లాడి...." ఆగిపోయాడు.

"నిజమా...."

"నిజంరా బ్రదర్ - అదలా వొది లెయ్యి - అంతకుమించిన, నాకు తోచిన నిజం చెబుతున్నాను, విను. డబ్బున్న మనిషితో అమితంగా స్నేహంచేస్తే, తిరిగితే, మామూలు మనిషి తన అర్హ తలూ, ఆదర్శాలూ చాలా వాటిని ఆ డబ్బుకు బలిపెట్టాల్సి వుంటుంది - నువ్వు వొప్పుకుంటా వనుకుంటాను. నీలో మంచితనం కేశవమూర్తిని ఆక ర్షించినా, మేం అందరం మిమ్మల్ని ద్దర్నీ అతని డబ్బుదగ్గర చేసిం దంటాం - అదే వాళ్ళ నాన్నగారూ అనుకున్నారు...."

శేషు రూమ్‌కువెళ్ళి భారంతో నిద్ర

పోయాడు - సాయంకాలం ఐదు తరువాత కుమారి వచ్చి లేపింది—

"నువ్వా పాపా"

"యెప్పు డొచ్చావు- మామయ్యా?"

"ప్రొద్దున్నమ్మా.... నాన్నగారు వున్నారా ??"

"ఆ" అంది -

శేషు వీధిలోకి వెళ్ళేసరికి అరుగు మీదనుంచున్న రాజశేఖరంగారు - "యెప్పు డొచ్చావు శేషూ" అన్నారు - శేషు చెప్పాడు. యిద్దరిమధ్యా తెలియని నిశ్శబ్దం ప్రయాణం చేసింది చాలాసేపు. కేశవమూర్తి గురించీ, తన గురించీ యెలా చెప్పాలో తెలియక శేషూ - కేశవమూర్తికీ తనకూ జరిగిన సంభాషణా, అతని నిష్క్రమణా యే విధంగా చెప్పాలో అర్థం కాక రాజశేఖరంగారూ మౌనంగానే వుండిపోయారు....

రాజశేఖరంగారికి గుర్తొచ్చింది.... ఆ రోజు రాత్రి తన మంచం పక్కన కూర్చొని, తను ప్రశ్నించకుండానే కేశవమూర్తి, తన జీవితం: అందులోని పరిచయాలూ, తను వాటిద్వారా పొందిన అనుభవాలూ, తద్వారా లభించిన యెదురు దెబ్బలూ - అన్నిటినీ బాధపడుతూనే చెప్పి ఆఖర్నే అన్నాడు-

"నేనేం నీతిమంతుణ్ణని మిమ్మల్ని నమ్మమనడం లేదు. పరిస్థితులు కొందర్ని నిజాయితీగా బ్రతకనివ్వకుండా యిలా అగ్ని పరీక్షలపేరిట విషాదంలోకి నెట్టుతాయని నాసమ్మకం. శేషుగారికి నేనేం అపకారం చెయ్యలేదు - చెయ్యను - అలాగే మంచి కూడా చెయ్యలేదు - నా మంచి ప్రతిధ్వనిస్తే వచ్చేశబ్దం యెలా వుంటుందో నాకు అనుభవం అయ్యింది - యింకా ఆయననుంచి నేను చాలా రకాల ఉపకారాలు పొందాను - మీకు సాయంకాలం పార్కులో కన్పించిన సుందరావు నాకు మిత్రుడు - అతని గురించి నేను చెప్పడం మొదలు పెడితే-అతను

మీకు చెప్పిందీ, రెండూ కూడా విరుద్ధంగానే వుంటాయి. నేను రేపు వుదయం వెళ్ళిపోవాలనుకుంటున్నాను...."

"పోనీ మీనాన్నగారి మాటప్రకారం చదువాపి పెళ్ళి చేసుకోవచ్చుగా."

కేశవమూర్తి పేలవంగా నవ్వాడు. "నేరం చెయ్యని మనిషి శిక్ష అనుభవించడానికీ, దానికి తలొగ్గడానికీ ముందు, కొంత మానసిక అలజడిని యెదుర్కోవల్సి వుంటుందేమో...."

కేశవమూర్తి వెళ్ళిపోయాడు.

రాజశేఖరంగారు ఆలోచించకముందే మసకగా కేశవమూర్తి నిజాయితీ కన్పించకుండా పోలేదు - కానీ శేషు గురించి కొంత తనముందు దాచిపెట్టాడేమో అనుకున్నాడు. మంచివాళ్ళెప్పుడూ మరొకరిని యితరుల ముందు చెడుగా చిత్రించరు. ఆయనలో యెన్నో భావాలు, రకరకాల మిశ్రమ ద్రవ్యాలుగా కలిసి కలిసీ కలవక తిరుగుతూనే వుండిపోయాయి....

"యింటి దగ్గర అంతా కులాసా" తేరుకుని అడిగాడు శేషుని....

"ఆ" అని తిరిగి 'కేశవమూర్తి మీకు కన్పించాడాండీ" అని అడిగాడు.

"అతను వెళ్ళిపోయాడు - బహుశా స్వగ్రామం అనుకుంటాను...."

"అది నాకూ తెలిసిందండీ - శ్రీమన్నారాయణగారు మనింటికి వచ్చి మిమ్మల్ని చూటలన్నట్టు గోవిందరావు చెప్పాడు - అతని గురించి ముందే మీకు చెప్పి వుండాల్సింది"

రాజశేఖరంగారు యేమీ అనలేదు -

"మీరైనా అతని పరిస్థితులు అర్థం చేసుకుంటే చాలు...."

"అర్థం చేసుకున్నాను - కానీ నీ గురించే నా ఆలోచన - యీ వలయంలో నువ్వు-కాదు, మన మధ్య దూరం పెరిగిపోకూడదు" అనాలనుకున్నాడు.

ఆ "దూరం" వెనుక సుందర్రావు చెప్పిన విషయాలు హృదయాన్ని కలతతో నింపిన సాదృశ్యాలు కళ్ళముందు కన్పించసాగాయి -

శేషు - సంభాషణ యే విధంగా పొడిగించాలో తెలియక "వస్తానండీ" అని చెప్పి లోపలకు వెళ్ళిపోయాడు.

• • •

మార్చినెల ప్రవేశించి అప్పటికి వారం రోజులయ్యింది - తరుముకొస్తున్న పరీక్షల్ని చూసి శేషు కంగారు పడ్డాడు. నెల రోజుల్లో తన చదువు ముగుస్తుంది - పరీక్షలు జరుగుతాయి. ఆ ఫలితాన్ని అంటిపెట్టుకునే తన భవిష్యత్ నిర్ణయమవుతుంది - అందుకే అన్నీ మరిచి దీక్షగా చదవడం మొదలు పెట్టాడు.

ఆ రోజు కుమారి పుట్టిన రోజు .. ఆ విషయం తెల్లవారిన తరువాతగానీ శేషుకు గుర్తు రాలేదు. వెంటనే బజారుకువెళ్ళి రెడీమేడ్ బట్టలూ, బొమ్మల భారతంకొని తెచ్చాడు - గుమ్మం యెక్కుతూంటే "భోజనాలు తయార్" అన్నమాటలూ, ఆ తరువాత "రాజూ" అంటూ వాకిట్లోకి తన కెదురుగా వచ్చిన దుర్గా కన్పించారు శేషుకి.

క్షణం నిశ్చేష్టులై వొకరి నొకరు చూసుకున్నారు - దుర్గముందు తేరుకుని....

"బావా, యిదేమిటి, యిక్కడున్నావ్?? యెప్పుడొచ్చావ్" అంది.

"నే వుండేది యిక్కడే దుర్గా, వీధి గదిలో" అన్నాడు అప్పటికే రాజలక్ష్మి వచ్చి అర్థంకాక యిద్దర్నీ చూస్తూ నుంచుంది....

"రాజూ - శేషు మా బావ తెలుసా? వాళ్ళక్కయ్యను మా అన్నయ్యకే యిచ్చింది...."

"అక్కయ్యొచ్చిందా...."

"మీ అక్కయ్యా మా అన్నయ్యా యిద్దరూ విజయవాడ వదిలి రామన్నారు - మాకు తప్పదు కాబట్టి యిలా యీ వూరు వచ్చాం...."

"యేం అల్లుడా, కులాసా.... యిక్కడే నేమిటి నీమకాం" అంటూ లోపలనుంచి వెంకాయమ్మగారు వచ్చింది....

"అవునండీ"

"మా మేనత్త కొడుకు పెళ్ళి. అందుకే దుర్గా నేనూ వచ్చాం" అంది, తమ రాకవెనుక వున్న కారణం చెబుతూ.

రాజలక్ష్మి తండ్రిని చూసి "నాన్నా భోజనానికిలే" అంది -

శేషుకు యీ చుట్టరికం యేమిటో అర్థంకాలేదు - రాజశేఖరంగారు చెప్పేవరకూ. రాజశేఖరంగారు, వెంకాయమ్మగారికి భర్తవైపు బంధువవుతారుట. ఆ మధ్యాహ్నంనుంచీ వెంకాయమ్మగారు తన కష్టసుఖాలన్నీ శేషుతో చెప్పడం మొదలు పెట్టింది.

"మీ వూరునుంచి వెళ్ళామా నాయనా, కాళ్ళవాపులు. మీ నాన్నగారికి రెండు వుత్తరాలు వ్రాయించాను. తులసికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా !! అవునులే వో పట్టాన అయ్యే రోజులు కావు. అవునుగాని అల్లుడా, సంక్రాంతి శెలవలకు మా వూరు రాకపోయావా"?

"కుదరలేదండీ...."

దుర్గ చొరవగావెళ్ళి శేషు గదంతా చూసివచ్చి రాజలక్ష్మితో అంది - "బావ రూమ్ బాగానే వుంది, యేమో అనుకున్నాను"

"వుహూ...."

"యింకా చదువుతావా రాజూ"

"నాన్నిష్టం...."

"మరి నీ యిష్టం...."

"కాలానికి వదిలేస్తున్నాను"

దుర్గ ధైర్యం చెబుతోన్నట్టుగా అంది "జాగ్రత్త.... బోర్లాపడగలవు.... నీకో నిర్ణయం అంటూ వుండాలి. బావ చిన్నక్కయ్యలేదూ తులసి - ఆవిడగారూ అంతే. సినికల్‌గా జావకారినట్టు వుంటుంది - నువ్వా అదే పద్ధతేం" అంది.

రాజలక్ష్మికి ద్రాక్షారామంలో చూసిన తులసి గుర్తొచ్చింది.

దుర్గ యేవేవో చెబుతూనే వుంది - అలాగే.

(స శే షం)

మనియార్డరు వచ్చింది!

కొమరవోలు నాగభూషణరావు ***

"పోస్టుమాన్ - పోస్టు"

భోజనంచేసి వంటింట్లో కడుక్కుంటూ ఉన్న రుక్మిణమ్మకు ఆ కేక వినిపించగానే గబగబావచ్చి ముందరి వసారాలో నిల్చొని ఉత్తరాల కోసం చేయి జాపింది.

"రాఘవరావుగారున్నారా?"

"ఆఫీసుకు వెళ్ళారు."

"మనియార్డరు వచ్చింది. రేపు ఉదయం పోస్టాఫీసుకువచ్చి సంతకం చేసి తీసికొని వెళ్ళమని చెప్పండి"

మనియార్డరు మాట చెవినిబడగానే రుక్మిణమ్మ మనస్సులో ఉన్న బరువు తగ్గి సంతోషంతో నిండుకొన్నది. అప్పటికి రెండు నెలల నుంచి జీతం చాలక నానాయిబ్బందులు పడుతున్నారు. జంటనగరాల్లో అప్పర్ డివిజను గుమాస్తాకు ఆఫీసులో మినహాయింపులు పోగా వచ్చే నెల జీతంలో రు 80-లు ఇంటి అద్దె పోతుంది. ఏపూట కాపూట పాలకేంద్రంలోను, ఎప్పటి కప్పుడు రేషను షాపులోను తక్కిన దుకాణాలలోను నగదుచెల్లించి సరుకులు కూరగాయలు నగదా తీసుకోవాలి. ధరలు చూడబోతే అందకుండా పైకిపోయి వెక్కిరిస్తున్నాయి. ఆలుమగలు - ఇద్దరు పిల్లలుగల సంసారం. వచ్చేది చాలక యితర ఆదాయమేమీలేక అతి కష్టంతో కాలప్రవాహంలో సంసార నౌకను ఈడ్చుకొని వస్తున్నారు. ఇట్లా ఉండగా ఒక రోజున పట్టలేక భర్తతో అన్నది.

"ఏమండీ! ఉగాది పండుగ వస్తున్నది. నాకు లేకపోతే మానె. పిల్లలకైనా చెరొక జతగుడ్డలు కుట్టించండి."

రాఘవరావు మాట్లాడలేదు. అతని మనసు కలచివేసినట్లయింది. తన భార్య ఎన్నడూ పోరు పెట్టదు. సామాన్యంగా నోరు తెరచి ఏదైనా కావాలని అడగదు. చెప్పకుండా డబ్బు ఖర్చు పెట్టదు. చాలా జాగ్రత్తగా వాడుతుంది.

తన స్థితిగతులు సంపూర్ణంగా అర్థం చేసుకొని సానుభూతితో నడచుకొంటుంది. ఆమె సానుభూతివల్ల కలిగే మనఃస్థైర్యంతోనే అతడు సంసార యాత్ర సాగిస్తున్నాడు. డబ్బు ఉన్నప్పుడు వీలైనంత వరకు ఆమె కోరికలు మాటల సందర్భంలో కనిపెట్టి తీరుస్తూనే వుండేవాడు. కాని ఇటీవల మనిషి ఆర్థికంగా చాలా ఇరుకున బడ్డాడు. ఈ పరిస్థితుల్లోనే ఎన్నడూ ఏమీ అడగని భార్య పసిపిల్లలకు పండుగ గుడ్డలు తెమ్మని కోరింది. అతని కడుపులో చుమ్మలు చుట్టుకొన్నట్లు బాధపడ్డాడు. ఆ బాధతో వెంటనే ఏమీ జవాబు చప్పలేక నిలబడి పోయాడు.

ఆమె "ఏమండీ! మాట్లాడరేం?" అన్నది.



అతడు కొంచెం తేరుకొని "ఏమిటీ" అన్నాడు.

"ఏమిటేమిటి? నేను అడిగింది వినబడలేదూ?"

"వినబడింది" అన్నాడు నీరసంగా.

"మరి-జవాబు చెప్పరేం?"

"ఏముంది చెప్పడానికి. నీకు తెలియక పోతేగా"

అడ్వాన్సుల జాబితా అంతా ఖాళీ అయింది. వాటి తాలూకు మినహాయింపులతో అర్థజీతంకూడా చేతికి రావడంలేదు."

"కరువు భత్యము పెంచారు గదండీ?"

"పిచ్చిదానా! పేపరులో పడగానే చేతులో పడుతుందనుకొన్నావా? చాలా తంతు జరగాలి.

"ఎప్పటికైనా వస్తుంది గదా?"

"ఆ రావచ్చు."

"అయితే ఒక పని చేయండి. మా అన్నయ్యకు రాసి రు 150-లు తెప్పించండి. కరువుభత్యమూ ఇంక్రిమెంటు జీతమూ రాగానే ఇచ్చేద్దాం"

ఈ ఆలోచన రాఘవరావుకు నచ్చింది. తన పెద్ద బావమరది కృష్ణా జిల్లాలో డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తున్నాడు. వాళ్ళిద్దరు హైస్కూలు చదువులనాటి నుంచీ మంచిస్నేహితులు. వారి స్నేహమే బంధుత్వానికి కూడా దారితీసింది. పైగా తనమాట కాదనడు.

"మంచిది. నీఆలోచన ఒకరకంగా బాగానే ఉన్నది"

"అయితే ఈ వేళే అన్నయ్యకు రాయండి"

"నేను రాయను. నీ వే రా యి" అన్నాడు.

ఆరోజే రుక్మిణమ్మ వాళ్ళ అన్నయ్యకు ఉత్తరం రాసిపడేసింది.

2

వారం గడిచిందో లేదో అప్పుడే మనియార్డరు వచ్చింది. వాళ్ళ అన్నయ్య ఎంత ఆపేక్షకలవాడు! తన కెన్ని అవసరాలున్నాయో అవన్నీ పక్కకునెట్టి సమయానికి చేతులో డబ్బుందో, లేదో. ఏమో! ఎన్ని తంటాలు పడ్డాడో. వెంటనే మనియార్డరు పంపించాడు. ఇక పిల్లలకే కాకుండా తన కొక మంచిచీర - దాని మీదకు మంచి రవిక - తన భర్తకు ఒక బుష్ షర్టు - ఒక పాంటు - ఇంకా తువాళ్ళు నగైరా కొనుక్కో వచ్చు. ఆమె మనసులో ఉన్న బరువు దించినట్లయింది. సంతోషంతో పొంగి పోయింది. ఎప్పుడు భర్త యింటికి వస్తాడా అని సాయంకాలం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నది.

ఆరుగంటలకు రాఘవరావు ఇంటికి వచ్చాడు. రాగానే కాళ్ళూ చేతులూ మొహమూ కడుక్కోడానికి నీళ్ళు నబ్బుబిళ్ళ, తుండుగుడ్డ ఇచ్చింది. తరువాత మంచినీళ్ళూ, ఫలహారమూ టీ తెచ్చి ముసిముసి నవ్వుతో ముందర నిలబడ్డది. ఆమెవైపు ఖరి కనిపెట్టి అతడు

"ఏమో హుషారుగా ఉన్నావే!" అన్నాడు.

"ఈవేళ మా అన్నయ్య పంపిన మనియార్డరు వచ్చింది. మీరు ఆఫీసుకు వెళ్ళిన తరువాత పోస్టుమన్ పట్టుకొని వచ్చాడు."

"ఓహో!"

"మిమ్మల్ని రేపు పొద్దున పోస్టాఫీసుకు వచ్చి తీసుకోమన్నాడు."

రాఘవరావు మనస్సుకూడా మనియార్డరు వచ్చిందనగానే కొంచెం తేలిక పడ్డది. కాని దానికై పనికట్టుకొని రేపు పోవాలంటే సెలవుపెట్ట వలసిందే. ఆఫీసులో ఉండగానే యీ సంగతి తెలిసినట్లయితే సెలవుకాగితం చేతికిచ్చి మేనేజరుగారితో చెప్పుకొని వచ్చి ఉండేవాడు. తీరా యింటికి వచ్చిన తరువాత యీ అవసరం ... గింది. వాళ్ళు కాపురం ఉన్నది నాంపల్లిగుండు. తన ఆఫీసు బేగమ్ పేట. సెలవు కాగితం తీసికొనిపోయే తోటి గుమాస్తాలు ఎవ్వరూ దగ్గరలో లేరు. సెలవు పెట్టితేనేగాని యీ పని అయ్యేటట్లు లేదు. ఎట్లాగా అని ఆలోచనలో పడ్డాడు.

"మనియార్డరు వచ్చినా మాట్లాడరేమండీ?"


జి-11 గల సింథాల్
ఇప్పుడు
ఎక్కువ సువాసన
సమృద్ధియైన నురుగను ఇస్తుంది
CINTHOL
CINTHOL
మీకు లాభసాటిగా ఉండేలా
రెండు సైజులలో లభిస్తోంది
CINTHOL

"ఏమిచేయమంటావు? గంతులు వేయమంటావా?"

"బజారుపోయి గుడ్డలు తెచ్చుకొందాము."

"డబ్బు రానిదే!"

"ఇంటిదాకా వచ్చిన మనియార్డరు రాక ఎక్కడికి పోతుంది?"

"అయితే?"

"మీ స్నేహితుడి మామగారి కొట్లో పద్దు రాయించి తీసుకొందాము. రేపు పోస్టాఫీసునుంచి డబ్బు తీసికొని చెల్లువేయండి."

"ఏమంత తొందర? ఒక్క రోజులో ఏమి ముంచుకొని పోయింది?"

"ఆ తొందర మొగవాళ్ళకేం తెలుస్తుంది? నాకా యిబ్బంది రోజులు. ఈ రోజు తప్పితే మళ్ళీ నాకు తీరిక దొరకదు. పండుగ తాకిడికి పదిరోజులు ముందుగానే దర్జీచేత గుడ్డలు పట్టించి కుట్టించుకోవాలి. లేకపోతే పండుగకు కొత్త గుడ్డలందవు. పైగా పండుగకు ముందు బయటికి కదలడానికి నాకు తీరుబడి వుండదు."


రాఘవరావు మారు మాటాడలేక పోయాడు. తనకు ఆలోచన చెప్పి డబ్బు తెప్పించి ఎంతో ఉత్సాహంగా పండుగ చేసుకొందామని ఉవ్విళ్ళూరుతున్న భార్యను నిష్కారణంగా చిన్న బుచ్చడం ఇష్టంలేక పోయింది. వెంటనే వారుభయులు పిల్లలను తీసికొని సికింద్రాబాదు వెళ్ళి కావలసిన గుడ్డలు మరికొన్ని వస్తువులు తీసికొని రాత్రి 8 గంటలకు ఇల్లు చేరారు.

3

రాఘవరావు మరునాడు ఉదయమే 8 గంటలకు ఇంట్లోనుంచి బయలు దేరాడు. అతను నామాలగుంట నుంచి బేగమ్‌పేటలోవున్న ఆఫీసుకు వెళ్ళి సెలవు కాగితం ఇచ్చి సికింద్రాబాదు స్టేషను సమీపంలో రైల్వే ఆఫీసులకు పక్కన ఉన్న హిమ్మత్‌నగరు పోస్టాఫీసుకు వచ్చి పోస్టుమన్‌ను కలుసుకొని మనియార్డరు తీసుకొని ఇంటికి రావాలి. ఇంతదూరము బస్సుల్లో తిరగాలి. నిత్యం బస్సులో ఆఫీసుకు పోవడానికి సీజను టిక్కెట్టు ఉందికాబట్టి బస్సు చార్జీల ఖర్చు తప్పిందిగదా అనుకొన్నాడు.

ప్రయాణము చేస్తూండగా మధ్య దోవలో పారడైజుటాకీసు దగ్గర బస్సు ఆపి చెకింగు చేశారు. రాఘవరావు సీజను టిక్కెట్టు చూపించాడు. దాన్ని చూసి చెకింగు ఇన్‌స్పెక్టర్ "దీనితో ఇంకా ఎన్నాళ్ళు ప్రయాణం చేయాలని అనుకొంటున్నారు?" అని అడిగాడు.

రాఘవరావు నివ్వెరపోయాడు. ఇన్‌స్పెక్టర్ "సీజను టిక్కెట్టు" మీద ఉన్న గడువుతేదీ చూపించాడు. గడువు ముగిసి పదిరోజులైంది. రాఘవరావుకు ఆ సంగతి దృష్టిలోనే లేదు. పెనాల్టీతో



సహోడబ్బుకట్టిసీజనుటిక్కెటురెన్యూవల్ చేయించుకొనమని చెప్పి అతన్ని కిందికి దించేశారు. అదృష్టవశాత్తు అతని జేబులో చిల్లర రెండు రూపాయల దాకా ఉన్నది. ఇంకొక బస్సు వచ్చేవరకు అక్కడే ఉండి టిక్కెటు కొనుక్కొని ఆఫీసుకు చేరాడు.

అప్పటికి పది గంటలయింది. అప్పుడే మేనేజరుగారు వచ్చారు. ఆయన ఈవేళ చాలా పెందలకడనే వచ్చారు కాబట్టి వెంటనే సెలవు కాగితము ఇచ్చి వెళ్ళవచ్చునని సంతోషపడ్డాడు. లోపలికివెళ్ళి ఆయనకు నమస్కారంచేసి కాగితం చేతికిచ్చాడు.

మేనేజరుగారు కాగితాన్ని ఒకసారి పైనుంచి కిందికి చూశారు. తరువాత రాఘవరావు నిచూస్తూ....

"ఏమిటయ్యా! అంత మించిపోయే అర్జంటు పని?" అని అడిగాడు.

రాఘవరావు అసలు సంగతి చెప్పాడు.

"సరే! వెళ్ళుదువుగాని - ఇదిగో చూడు ఈ కాన్ఫిడెన్షల్ ఫైళ్ళలో గవర్నమెంటుకు పోవలసి అర్జంటు లెటర్స్, కొన్ని డి. ఓ. లు ఉన్నవి. మిషను తెప్పించుకొని నా ముందరే కూర్చొని అవి టైపు చేసి వెళ్లు" అన్నాడు.

గత్యంతరంలేక మారు మాట్లాడకుండా జవానుచేత పక్కనున్న బల్లమీద మిషను పెట్టించుకొని కావలసిన కాగితాలు తీసికొని అవన్నీ కావలసిన తీరుగా టైపుచేసిపెట్టి మేనేజరుగారి సెలవుతీసుకొని బయలుదేరాడు. పావుగంటకుగాని బస్సురాలేదు. సికింద్రాబాదు స్టేషను దగ్గర బస్సు దిగి హిమ్మతు నగరు పోస్టు ఆఫీసుకు పరుగెత్తాడు.


4

అప్పటికే పోస్టుమనులందరూ ఎవరి టపాలు వారు సార్టు చేసుకొని రిజిష్టరు ఉత్తరాలు, మనియార్డరులు తీసుకొని బట్వాడా నిమిత్తం వారివారి డివిజన్లకు సైకిళ్ళమీద వెళ్ళిపోయారు. ఒక్కడుకూడా అక్కడ లేడు. ఇనకు దారిలోనో, తమ పేటలోనో తప్పకుండా పోస్టుమన్ కనపడగలడు. మించిపోయింది ఏమీలేదు. అని తనకు కలిగిన ఆశాభంగానికి తనకుతానే

ధైర్యం చెప్పుకొని తన బస్తీవైపు దారితీశాడు.

ఆ పోస్టుమన్ బీటు ఎక్కడి నుండి ఎక్కడి వరకో తనకు తెలియదు. ఇంకొకరిని అడిగితే మాత్రం వారికేం తెలుస్తుంది? వారందరు సైకిళ్ళమీద వెళ్లి నిముషాలమీద ఉత్తరాలు వగైరా ఇండ్లల్లో బట్వాడాచేసి ఒక వీధిలోంచి ఇంకో వీధిలోకి - మరో సందులోకి యింకా గొందులలోకి అదృశ్యమై ఎక్కడో మునిగి ఎక్కడో తేలి పనులు ముగించుకొని బయట పడతారు. వాళ్ళను వెంటాడి పట్టుకోవలెనంటే నలుగురైదుగురు కీలక స్థానాల్లో ఓపికతో కాపలా వేయాలి. పాపం! రాఘవరావు ఒక్కడు కాలినడకతో ఏం పట్టుకోగలుగుతాడు?

తన బస్తీచేరి వీధులలో ఒకరిద్దరు తెలిసిన వారిని పోస్టుమన్ గురించి అడిగాడు. కొందరు తమకు తెలియదన్నారు. కొందరు వచ్చి వెళ్ళాడన్నారు. అలా అడుగుతూ తిరిగి తిరిగి ఒక సందులోకి వచ్చేసరికి అతనికి ఆ సందుచివర సైకిలెక్కి బయలు దేరుతూ పోస్టుమన్ కనబడ్డాడు. కేకలు పెట్టుకొంటూ రాఘవరావు అతని వెంబడి పరుగెత్తడం సాగించాడు.



"పోస్టుమాన్! ఓ పోస్టుమాన్" అని అరుస్తూ పరుగెత్తి ఆ సందుచివర మలుపు తిరిగి చూశాడు. పోస్టుమన్ కనబడలేదు. మనిషి కనబడక పోయినప్పటికీ అతను ఎక్కడ ఉన్నదీ నిరారణగా తెలియక పోయినప్పటికీ అలాగే వెర్రికేకలు వేసుకొంటూ ఆ వీధి వెంబడే పరుగెత్తాడు. ఏమూల నుంచైనా "ఓయ్" అని పలుకుతాడేమో అని ఆశ.


ఒళ్లు చెమటలు పట్టిపోయింది. ఆయాసం వచ్చింది. ఆకలి మండిపోతూన్నది. అక్కడవున్న సందుల గొందులలో కూడా వెదికాడు. పోస్టుమన్ కనబడలేదు. అంతటితో అప్పటికి ఆశ వదలుకొని యింటికి వెళ్ళి భోజనంచేసి కొంత విశ్రాంతి తీసికొని మూడు గంటలకు మళ్ళీ పోస్టుమన్‌కోసం కాపలా వేసి పట్టుకొందామను కొన్నాడు.

5

ఎండలో తిరిగి ఆకలితో భోజనం చేసిన తర్వాత కలిగిన ఆయాసంతో రాఘవరావు వెంటనే బయలు దేరలేక

పోయాడు. అదిగాక బట్వాడా పూర్తి చేసుకొని రెండు గంటలు కొట్టిన తర్వాతగాని పోస్టుమను లందరూ ఆఫీసుకు చేరరు. తాను మూడు గంటలకు పోచ్చుకొని మంచం మీద నడుం వాల్చాడు. వెంటనే మంచి నిద్రపట్టింది.

అతనికి మెలకువ వచ్చేసరికి మూడు గంటలు దాటింది. పోస్టుమన్ ఆఫీసులో దొరకడేమో అన్న ఆదుర్దా కొద్దీ గబగబా కాళ్ళూ చేతులు మొహమూ కడుక్కొని గుడ్డలు వేసుకొని పర్సు తీసికొని బయలుదేరాడు. తాను బస్సు మీద వెళితే యింకా ఆలస్యమౌతుంది. సైకిలుమీద అయితే త్వరగా పోవచ్చు. తనకైతే సైకిలులేదు. కాని పక్కనున్న వారింట్లో చూశాడు. దానికోసం ఆ యింట్లోకి వెళ్ళాడు. పెద్దవారెవరూ లేరు. సైకిలు మాత్రం పంచలోఉన్నది. బెల్లు, బ్రేకులు, మడ్ గార్డులు, క్యారేజి, స్టాండు, వగైరాలు ఏవీలేకుండా వంపులు సొంపులు లేని స్తంభాకారపు, కర్కశగాత్ర అయిన పూర్వసువాసిని దిగంబర దేహాన్ని స్ఫురింప జేస్తూన్నది. దేహానికి మెత్తగా తగిలే భాగం ఎక్కడాలేదు. సీటుకున్న తోలుకూడా వాడుకలో లేని కారణాన లోహమై వున్నది. అదిఎట్లా ఉన్నా తన అవసరానికి దానినిప్పుడు వాడుకోవడం తప్పడంలేదు. అతనిని చూసి ఆ యింటివారి అబ్బాయి లోపలి నుంచి వాకిట్లోకి వచ్చాడు. ఆ అబ్బాయిని చూడగానే "ఏమోయ్! అర్జెంటు పనిమీద పోస్టాఫీసుకెళ్ళాలి. చాలా లేటయిందిప్పటికే. మీ సైకిలు తీసికొనివెడుతున్నాను" అంటూనే సైకిలు తీసికొని వీధిలోకివచ్చి సైకిలెక్కాడు. ఆ అబ్బాయి ఏదో చెప్పబోయాడు. కానీ ఆ తొందరలో రాఘవరావు వినిపించుకోలేదు. అతడు కొంతదూరం పోయినాడు. త్రిశూలాలా మధ్య పాతరవేసినట్లుగా ఉంది కాని సైకిలు సీటుమీద కూర్చున్నట్లు లేదు. పైగా చక్రాలలో చాలినంత గాలిలేదు. వాటి అంచులు తారు రోడ్డుకి ఆనుకొని మధ్య మధ్య గుంటలలో గతుక్కుమన్నప్పుడల్లా త్రిశూలాలు బ్రహ్మరంధ్రం దాకా పొడుచుకుంటున్నాయి. అంతబాధను ఓర్చుకొని శరీరమంతా ముచ్చెమటలు పోయగా మెయిన్‌రోడ్డు చేరుకొని సైకిలు షాపులో గాలి కొట్టించుకొన్నాడు. ఎంత కొట్టినా వెనక చక్రంలో గాలి నిలవడంలేదు. తానెంత తొందర పడుతూంటే అంత ఆలస్యమవుతున్నది. కారణమేమిటో చూస్తే దాని వాల్వుట్యూబు రెండు ముక్కలు కావడానికి సిద్ధంగాఉన్నది. దానిని తీసేసి కొత్తది వేయించి గాలి కొట్టించుకొని మళ్ళీ వెనక్కు తిరిగి చూడకుండా రయ్‌మంటూ వెళ్ళాడు. అతనిదృష్టి యావత్తు పోస్టుమను మీదనే ఉన్నది. అందీపాటికి బట్వాడా చేయని మనిఆర్డర్లు రిజిస్టరు ఉత్తరాలు ఆఫీసులో అప్పగించి ఇం



టికి వెళ్ళిపోయి ఉంటాడేమో. త్వరగా వెళ్ళాలి - అతణ్ణి యీ పూటైనా పట్టుకోవాలి.

రైలు వంతెన దగ్గరకు రాగానే నలుగురు కార్పొరేషను ఉద్యోగులు ఇద్దరు పోలీసులు రాఘవరావును అట్టుకొని సైకిలు పట్టుకున్నారు. ఆ సైకిలుకు లైసెన్సులేదు. లైసెన్సుఫీజు చెల్లించి సైకిలు తీసికొని వెళ్ళమన్నారు. ఆ సైకిలు తనదికాదని అర్జంటుపనిమీదపక్కింటివాళ్ళ సైకిలు తీసుకుని వచ్చాననీ తనగోడు చాలాసేపు చెప్పుకొన్నాడు.

అప్పటికి సాయంకాలం నాలుగు గంటలు దాటిపోయింది. తనకు కావలసిన పోస్టుమను ఆఫీసు వదలి ఎప్పుడో వెళ్ళిపోయి ఉంటాడు. తన పని యీ రోజుకు పాడయినట్లె - కాని యీసైకిలుమూలాన దారినబోయే శనేశ్వరాన్ని తన నెత్తిన వేసుకున్నట్లయింది. అతడు కొయ్యబారి అట్లాగే నిలువబడ్డాడు. కొంతసేపటికి ఒకఆలోచన తోచి పర్సుతీసి చూసుకుంటే ఒక ఐదు రూపాయలనోటు ఉన్నది. వెంటనే ధైర్యం వచ్చింది. లైసెన్సుఫీజు చెల్లిస్తాను. సైకిలు వదలిపెట్టండి అన్నాడు. వాళ్లు దానికి సరేఅని వెనకటి లైసెన్సు ఫీజు తాలూకు బిళ్ళ

చూపించమని కోరాడు. దానినిఎప్పుడు చెల్లిచారో తనకు తెలియదన్నాడు. అప్పుడు వాళ్ళు అన్నారు గదా-

మీకు తెలియకపోతే దీని సొంత దారుని కనుక్కొని అప్పటి నుంచి యిప్పటివరకూ అయిన బకాయీలే వైనా ఉంటే వాటితోసహా యీ అర్ధ సంవత్సరం అఖరువరకు బేబాకీగా చెల్లిసేనేగాని సైకిలు స్వాధీనం చేయం.

ఈ మాటలు విని రాఘవరావు చతికిల బడ్డాడు. అటువంటి బకాయీలంటూ వుంటే ఈ సైకిలు ఖరీదును మించుతాయేమో! ఆ సైకిలు స్వంతగాడైతే యీ బకాయీలు చెల్లించేబదులు సైకిలే వదలుకునే వాడేమో! లేని పోనిది తాను పోయి చిక్కులో యిరుక్కున్నాడే! ఏమిపీడ పట్టుకొన్నది కరువురోజుల్లో అన్యాయంగా ఉత్త పుణ్యానికి దండగ పెట్టుకోవడమే కాకుండ తానుమాటలుకూడా పడవలసి వస్తుంది. హారి! భగవంతుడా! ఏమి దారుణమురా! చేసేది ఏమీలేక చేతిలో ఉన్న సైకిలుపోయి చెవులు రూడించుకుంటూ గోడుమంటూ రాత్రికి యిల్లు చేరుకున్నాడు.

రాఘవరావు మనస్సులో నిరుత్సాహం ఏర్పడింది. ఆఫీసుకి వెళ్ళి పని చేయడానికి బుద్ధి పుట్టలేదు. మూడు రోజులకు సెలవు రాసి పోస్టులో వేశాడు. ఆ సైకిలు గొడవ తన్నుదెయ్యంలాగా పీడిస్తున్నది. పక్కింటి ఆయన సతాయింపు జాస్తీ అయింది. ఆయనకు లైసెన్సు ఫీజు కట్టడం యిష్టం లేక దాన్ని బయట పెట్టకుండా వాడుకుంటున్నాడు. ఇప్పుడు దానిని బయటపెట్టి దాని బకాయీలన్నీ నెత్తిన వేసుకున్నాడు. ఆ మొత్తమంతా చెల్లించి సైకిల్ను ఇంటికి తీసికొని వచ్చి ఆ పొరుగింటిపోరు వదిలించుకోవాలి. ఆ యింటిలో పెద్ద వాళ్ళను అడక్కుండా వాళ్ళ పిల్లాడు చెప్పబోయేదివినిపించుకోకుండా సైకిలు తీసికొని వెళ్ళినందుకు తనకు బాగా శాస్తి అయింది. ఆ సెలవు మూడు రోజులూ కార్పొరేషను చుట్టూ తిరిగి చెల్లించవలసిన మొత్తాన్ని తేల్చుకొన్నాడు. డబ్బు చెల్లించటానికి ముందుగా తను మనియార్డరు తీసికోవాలి. డబ్బుచేతిలో పడితే అన్ని సంకటాలు నివారణ అవుతవి. మరునాడు ఉదయమే పెందలకడనే పోస్టాఫీసుకి వెళ్ళాడు. తన పేటకు వచ్చే పోస్టుమనుకోసం వెదికాడు. కాని అతడు కనబడలేదు. తక్కినవాళ్ళంతా టపాలు తీసికొని బట్వాడా నిమిత్తం ఊళ్ళోకి బయలుదేరారు. కాని తనకు కావలసిన మనిషి దొరకలేదు. ఎంక్వయిరీ దగ్గర విచారిస్తే నామాలగుండ బీటు పోస్టుమను టపాలు తీసికొని వెళ్ళి

పోయినట్లు తెలిసింది. రాఘవరావు నిర్ఘాంతపోయి నిల్చున్నాడు. ఎక్కడికిపోయినా పొద్దు ఎదురవుతున్నది.

అంతట్లో తాను వెదుకుతూఉన్న పోస్టుమన్ టే డ్రెస్సులో అక్కడికి వచ్చాడు. రాఘవరావు పరుగెత్తుకొంటూ వెళ్ళి తన మనియార్డరు సంగతి అడిగాడు.


"నాకు సెలవుమంజూరై వచ్చింది. నిన్న సాయంకాలమే చార్జియిచ్చాను. నాకు బదులు వచ్చిన అతణ్ని అడగండి" అని జవాబు చెప్పాడు.

"ఈ సాయంకాలం వచ్చి అడగనా?"

"మూడు గంటలకు రండి. అప్పుడతను బీటు నుంచి తిరిగి వస్తాడు."

కాళ్ళీడ్చుకొంటూ రాఘవరావు ఇంటికి చేరాడు. భోజనం సహించలేదు. కొంచెం విశ్రాంతి తీసుకొని మళ్ళీ ఆలస్యంచేస్తే ఏమి మూడుతుందోనని వెంటనే బయలుదేరి పోస్టు ఆఫీసుకు కాలినడకనే చేరుకున్నాడు. దాని ముందర రోడ్డుమీద కాపలావేసి వచ్చే పోస్టుమన్‌లందరిలో ప్రతివాడినీ నామాలగుండు బీటు నీదేనా అని అడుగుతూ నిలబడ్డాడు.

గంటన్నరయిన తర్వాత నామాలగుండు ఆయన వచ్చాడు. వెంటనే వెళ్ళి తన మనియార్డరు సంగతి అడిగాడు.



"మీరు రాఘవరావుగారవునో కాదో నాకు తెలియదు. మీ కిక్కడ తెలిసినవారున్నారా? ఐడింటిఫికేషను సంతకం చేసే వాళ్ళుంటేనేగాని మీకు మనియార్డరు ఇవ్వడానికి వీల్లేదు" అన్నాడతడు.

రాఘవరావు అంతటా వెదికాడు. తన కటువంటి సంతకం చేయగల వాళ్ళు ఎవ్వరూ కనబడలేదు. ఆ పాత పోస్టుమన్ వచ్చినా బాగుండును అనుకొన్నాడు. కాని సెలవుమీద పోయినవాడు ఎందుకు వస్తాడు! అతనికి ఏమీ తోచడంలేదు. తన వ్యవహారంపోయిన పొడుగునా పేచీగానే ఉంది. ఇతని వాలకంచూసి ఆ పోస్టుమన్ చిన్న సలహా చెప్పాడు.

"రేపు పొద్దున్నే మీరు మీ పేటలో ఉన్న కోటయ్యగారిని తీసుకుని ఇక్కడికి రండి. నాకు మీ మనియార్డరు

ఫారం మీద ఐడింటిఫికేషను సంతకం చేస్తే డబ్బిస్తాను"

అదృష్టవశాత్తు రాఘవరావుకు కోటయ్యనాయుడుగారితో కొంచెం పరిచయం ఏర్పడి ఉన్నది. అందుకని ధైర్యంగా ఇంటికి వచ్చాడు.

నాయుడుగారిని బతిమలాడి 'క్వాలో ఎక్కించుకొని మరునాడు ఉదయమే రాఘవరావు పోస్టు ఆఫీసుకు చేరుకొన్నాడు. అమ్మయ్య! ఇన్నాళ్ళకు మనియార్డరు చేతిలో పడబోతూ న్నది. లక్ష్మీదేవి కటాక్షించింది. అతనుపడ్డ బాధలన్నీ మరచిపోయాడు. జగమంతా ఆనందమయమనిపించింది.

రాఘవరావును కిటికీ దగ్గర చూడగానే పోస్టుమన్ మనియార్డరు ఫారం తీసికొని వచ్చాడు. సంతకాలు కాగానే 15 నయాపైసలు తీసి రాఘవరావు చేతిలో పెట్టాడు.

"15 నయాపైసాలేమిటి? 150 రూపాయలు!" అన్నాడుగుడ్లుతేలవేస్తూ నోరుతెరచి —

"ఇదిగో! ఈ మనియార్డరు ఫారం మీద ఉన్న డబ్బు మొత్తం చూచు కోండి" అన్నాడు పోస్టుమన్.

తన కాళ్ళకింద భూమి కుంగిపోతు న్నట్లు తోచింది. తల తిరిగిపోతు న్నది. కొంచెం తెప్పరిల్లుకొని మని యార్డరు కూపను అందుకొని దానిమీది వైనం చదువుకొన్నాడు. అది గుంటూరు ఎ. పి. ఆర్. టి. సి. బస్సు డిపోనుంచి వచ్చింది.

"అయ్యా! గత సంవత్సరం మీ దగ్గర పోర్టబుల్ టైపురైటరు లగేజి కింద 30 పైసలు అదనంగా వసూలు చేసినందుకు మీ పిటీషనుమీద విచారణ జరిపి దానిని వాపసు చేయడానికి మంజూరు పొంది మనియార్డరు కమీ షను మినహాయించి మిగిలిన 15 పైసలు మీకు ఇందుతో పంపడమైనది. ఈ మొత్తము ముట్టినట్లు పేరే రశీదు రాసి వెంటనే హెడ్ ఆఫీసు వారికి పంపేది."

రాఘవరావుకు పిచ్చెత్తినట్లయింది. ఆ పిచ్చిలోనే రశీదు రాసి ఆ 15 పైస లతో కవరు కొని దానిలో రశీదుపెట్టి అడ్రసు రాసి అప్పుడే పోస్టులో వేశాడు.

***

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరించబడిన పక్షంలో వాటిని త్రిప్పి పంపగోరితే రచనతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతోపాటు కాక తరువాత స్టాంపులు పంపరాదని, అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలని మా విజ్ఞప్తి.

చిత్ర విచిత్రాలు

✻ స్వామి చిత్రానంద

చిత్రం ప్రారంభించిన మొదటి నెల లోనే మూడు రీళ్ళు పూర్తి చేశారు. ఆ తర్వాత నెల నుంచీ హీరోయిన్‌తో పని ప్రారంభించవలసింది. కాని, అలా జరగలేదు. మూడేళ్ళు జరిగిపోయాయి.

హీరోయిన్ పెళ్ళి చూపులకు లండన్ వెళ్ళడం, స్వదేశం తిరిగి వచ్చి, భారత సాంప్రదాయ ప్రకారం వివాహం. హనీమూన్‌కు భూప్రదక్షిణాలు, ఆ తర్వాత పురిటికి స్విట్జర్లండ్ వెళ్ళడం వగైరాలన్నీ సినీమాలో స్వప్న దృశ్యాల్లాగా గిరగిరా తిరిగిపోయాయి.

హీరోయిన్ మళ్ళీ సినీమారంగంలో ప్రవేశించి కళాసేవ చేయడం ప్రారంభిస్తోంది.

ఈ రోజే చిత్రం పునఃప్రారంభం! సెట్ అంతా విలేకర్లతోనూ, విజిటర్స్‌తోనూ కిటకిటలాడుతోంది. నిర్మాతను శ్రేయోభిలాషులు — "ఎన్నాళ్ళకు ఒడ్డెక్కినట్లే!" అని అభినందిస్తున్నారు.

హీరోయిన్ సెట్‌లోకి వచ్చింది. అంతవరకూ ఆమెకు బదులుగా ఆమె కూచోవలసిన చోట కూచున్న సహదర్శకుడు లేచి, ఆమెను కూచోమన్నాడు. ఆ షాట్‌కు పూర్వాపరాలు విశదీకరించాడు. డైలాగు చెప్పాడు.

"అవును మోహన్! నేనే — నీ శశిశ్రీని" అని కళ్ళు ఇలా చికిలించాలి. ఆ తర్వాత తల దించేసుకోండి"

"కళ్ళు చికిలించాలా? యిదేం ఏక్షన్ డైరెక్టర్ సాబ్" అంది హీరోయిన్.

"ఆ ఏక్షన్ అన్నమాట లేదు. మనం మార్చుకోవచ్చు" అన్నాడు డైరెక్టర్.

"అదికాదు సాబ్. చిన్న హీరో



యిన్ ప్రతి మాట అన్న తరువాత కళ్ళు చిట్లించేరండి - అదే హీరోయిన్ పెద్దదయిన తర్వాత అలవాటుగా పెడదాం అన్నారుగా మీరు?" అన్నాడు సహదర్శకుడు.

"ఏమన్నావ్ ఏమో - మూడేళ్ళ యింది పిక్చర్ తీసి - చిన్న హీరోయిన్ కళ్ళు చిట్లించింది?" అన్నాడు దర్శకుడు.

"ఏం ఫర్వాలేదు సార్ - మా అక్కయ్య కూతురుంది. జ్యోతిశ్రీ- చాలా చక్కటిపేప. అచ్చం నాలాగే వుంటుంది. దానితో షూట్ చెయ్యండి సెట్ కూడా రెడీగానేవుంది—" అని సలహా యిచ్చింది హీరోయిన్.

"అయితే అయిన మూడు లక్షలు పెట్టి, మూడేళ్ళనించీ నేనేం పిక్చరు తీసినట్టు?" అని కూలబడిపోయాడు నిర్మాత.

"అదేం మాటండీ! చిత్రపరిశ్రమ లోని అనుపానులూ, లోతుపాతులూ, అన్నీ సమగ్రంగా తెల్సుకున్నారు గదండీ?" అన్నాడొక పాత్రికేయుడు.

"అవున్లె - ఎనకటికి నాలాటోడే - ఆస్తిపోతేనేం కోర్టు 'లా' అంతా తెల్సిందన్నాట్ట!" అన్నాడు నిర్మాత.

***

దేవత

జంపన పెద్దిరాజు

అయాన్స్ పార్టికల్స్ దొరికే సరికి వెధవ ఎక్స్‌పెరిమెంట్ ఐదు గంటలు పట్టింది. చిరాగ్గా చేతులు కడుక్కొని సిగరెట్ వెలిగించి న్యూక్లియర్ లాబ్‌లోంచి బయటపడ్డాను. మసక మసగ్గా వున్న వెన్నెల్లో ఎదురుగా వున్న వెంకటేశ్వరా ప్రేయర్ హాల్ గోతులోపడ్డ ఏనుగులా వుంది. మబ్బుచాటున పరుగెత్తున్న చంద్రుణ్ణి చూసేసరికి న్యూక్లియర్ ఫిజిక్స్‌లాబ్ వైపు సగర్వంగా చూశాను. అణుయుగంలో మనిషికి సర్వసుఖాలు అందించే అమృతమూర్తిలా కన్పించింది.

టక్ సరిచేసుకొని నెమ్మదిగా ప్రేయర్ హాలును, లాన్‌ను చీలుస్తున్న రోడ్డుమీదికివచ్చి నిలబడి వాచ్ చూసుకొనే సరికి సరిగ్గా ఒంటిగంట.

రీసెర్చిలోచేరిన తర్వాత ఆ టైములో ఆ కార్నర్‌లో ఆడమనిషిని చూట్టం అదే మొదటిసారి. యూనివర్సిటీ కాంపస్‌లో రాత్రుళ్ళు అలా తిరుగుతారని వినటంచేత, ఆమె అక్కడ ఎందుకు నిలబడిందన్న అనుమానం నాకు రాలేదు. ఆమె ఆ కార్నర్‌లో నిలబడి నావైపే చూస్తోంది. నాకాళ్ళు నెమ్మదిగా ఆ కార్నర్‌కు చేరాయి.

"టైమేటయింది" -ఆమె నవ్వింది. ఆ గొంతులో అనాగరికత, ఆ నవ్వులో ఏవో ఎండిపోయిన పువ్వులు.

"ఒంటి గంట" - అంటూ నెమ్మదిగా ఆమె ముందుకుంచే అడుగు వేశాను. టైము చెప్పేటప్పుడు నాకు తెలియకుండానే నవ్వాను.

"టైమువేస్టయిపోతన్నాది-ఒత్తావేటి" ఆ మాటకు నవ్వొచ్చింది. తెలియకుండా నా నడకలో మార్పొచ్చింది. అటూ ఇటూ తచ్చాడుతున్నాను. చేప పడబోతున్న గాలం చేతిలోవున్న జాల

రిలా ఆమెకళ్ళల్లో ఓ రకమైనఆతృత - నిండుకుండలా అంది.

"పన్నెండు-పదినిమసాలేగా - అలా చెట్లల్లోకి పోదాం - మళ్లా ఏరన్నా ఒత్తారు" ఆమె అందంగా ఒళ్ళు విరుచుకుంది.

చెట్లు. చీకటి. పసిరిగ పాములుండొచ్చు. అయినా నాకు భయమనిపించలేదు. కాని జేబు గుర్తు చేసుకొనేసరికి చిన్న సమస్య తగిలింది. చిల్లర లేదు. బాక్‌పాకెట్‌లో పొద్దున్నే నాన్న పంపించిన రెండూ వందరూపాయలనోట్లే. చిల్లర సరుకుతో సరదా తీర్చుకోటానికి చిల్లర లేదు. కొంచెం తటపటాయిస్తున్నాను.

"ఆలోసించకు, మీ ఆడోళ్ళకు తీసిపోను" అంది. అవకాశం జారిపోతుందన్న భయంతో. ఆకాశంవంక నా వంక గోముగా చూసింది.

కొంచెం లోపల సిగ్గుపడినా పైకి నవ్వుతూ నిర్మొహమాటంగా చెప్ప గలిగాను. "డబ్బుల్లేవు" అని.

"బలే సరసమాడతన్నావే" చెట్లసందునుంచి పడుతున్న వెన్నెల కిరణంతో ఆమె నాకంటె చాల పెద్దదిగా కన్పించింది.

"సరసంకాదు. నిజం చెబుతున్నా. లేవు. కావాలంటే రేపి దె టైముకు ఇక్కడకు రా. తప్పకుండా ఇస్తాను."

"సరె పట్టాది." అంటూ మూతి విరిచి మెయిను రోడ్డుకేసి నడవబోయింది. నాలో క్యూరియాసిటీ హెచ్చింది. ఆమె కౌగిలిలో ఇమిడి పోలంత విషయసేకరణ చేయాలన్న ఉత్సాహం. ఆమెపై సహజంగా అందరికీ ఉండేలాటి తక్కువ అభిప్రాయం (అదే జంతుతత్వం) నా చే ఆపని చేయించింది.

ఒక్క వుదుటన వెళ్ళి ఆమె పక్షం మీద చెయ్యివేసి ఆపాను. చెయ్యి అలాగేవుంచి నవ్వాను. ఆమె వెంటనే విసిరి కొట్టింది.

"నీలాటోల్ని సాలామందిని చూశా. రూముకు తీస్కెల్లి ఎగ్గొట్టి ఏడిపించిన మా బాబుల్నికూడ ఎరుగుదును — ఏటనుకుంటున్నావో! అనుకోని సమాధానికి ఆశ్చర్యపడి అవమానపడుతూ పలకలేని గొంతుకుతో అన్నాను. "పో వే నువ్వు నాకక్కరలేదు — జస్ట్ నీతో మాట్లాడాలి."

"మా రాజుకదా మా రాజు. మాటాడ తాడట మాటాడతాడు.

రూపాయి డబ్బులిచ్చుకోలేని మా రాజుక్కూడా ముచ్చటే. సొంత పెళ్ళాం నుకున్నావా నాకేం పనిల్లేదనుకున్నావా- ఏటి - నీతో కూకుంటానికి" చెప్పుతో కొట్టినట్టు మాటాడి వెళ్ళి పోతోంది.

నేను తేరుకొనీ తేరుకొనటంలో "సరే. రేపు ఇదే టైముకిరా. డబ్బులిస్తాను" అన్నాను ఏమీఅనలేక.



"అలాగను. అందం వున్నాది. క్రైమ్ పేష్టవుతున్నాది. ఎళ్ళిపోతునా ఏటవి ఆ కోతోక ఎళ్తాత్తాలే" అంది వెళ్ళిపోతూ.

చెల్లిమధ్య నిద్రపోతున్న చీకటిలా మనసంతా మొద్దుబారిపోయింది. లేక్ ఎయిర్ కూలర్ చేసే చప్పుడులా గుండె దడదడ లాడుతోంది. నాగార్జునహౌస్లు తెరుపుగా ఉన్నట్లైటు దూరంగా నవ్వుతోంది.

తర్వాత ఇరవై నాలుగు గంటలు ఇరవై నాలుగు జన్మలెత్తినట్లనిపించింది. మర్నాడు అదే కౌన్టర్‌లో ఆమె నిల్చుంది.

చేతులు వెనక్కి పెట్టుకొని మామూలుగా ఆమె దగ్గరకు వెళ్ళాను. రెండు చీరెలు, వంద రూపాయల కాగితం ఆమె చేతిలో పెట్టాను. రెప్ప వాల్చకుండా ఒక్క క్షణం నా వంక అలా చూసి—ఏటిది? నిన్న రాలేదని ఇయ్యాల అవమానిత్తన్నావా" అంది.

"కాదు. నేనే నిన్న అవమానించాను." నా మాటకు ఆమె తెల్లబోయి చూసింది. ఆ చూపులో నాకు కావలసింది దొరికింది. నా మనసు తుడిచిన అద్దంలా అనిపించింది. గబుక్కున ఆమెను చేతుల్లోకి తీసుకొని వొంగి పెదవులపై ముద్దుపెట్టుకొని వెనక్కి తిరిగి చూడకుండా రూముకొచ్చి తలుపు వేసుకొన్నాను. వచ్చేటప్పుడు ఆమె కళ్ళల్లో ఆదోరకమైన ఆర్ద్రత కనిపించింది. కొంచెం కొంచెం [illegible] స్తున్న కన్నీళ్ళు కూడా కనిపించాయి. వాటితో మనస్సుపై మాలిన్యం కడిగేసినట్టయింది.

* * *

మర్నాడు డిపార్టుమెంటు కెళ్ళేసరికి వాచ్‌మన్ గురించి ఘనంగా చెప్పుకొంటున్నారు. ఆ కార్నర్‌లో ఎవరో చీర, డబ్బు వదిలేస్తే వాచ్‌మన్ జాగ్రత్తగా డిపార్టుమెంటు కందించాడట. అదే కార్నర్ ప్రేయర్ హాల్‌కి ఫిజిక్స్‌లాబ్‌కి మధ్య.

చంద్రుణ్ణి, దేవుణ్ణీ చూపిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రెండుశక్తుల మధ్య (ఫిజిక్స్ లాబ్, ప్రేయర్ హాల్) ఈ ఇరవయ్యో శతాబ్దంలో ఆమె ఇంకా అలా కూటి కోసం నిలబడటం చూస్తే ఎవరికైనా కథ వ్రాయాలనిపించదూ?

—రచయిత.

* * *

---

* షష్టిపూర్తి చేసుకున్న రాజగారు పదహారేళ్ళ మనవడి బలవంతంమీద సినిమాకని బస్తీకి వచ్చారు. బస్సు దిగగానే శనివారం కావటం చేత, హోటల్లోనే మంచి మాట చేసేసుకుని బయట నిలబడి, నగరంలోని సినిమాలు ఏమిటీ?— దేన్ని ప్రోత్సహించాలి, అని వున్న బోర్డులన్నీ పరిశీలనగా చూస్తున్నాడు. మూడు నాలుగింటిని పరీక్షించిన తాతగారు —

"ఎవ్రా ఈపద్మశ్రీ రామారావు పక్కనా, నాగేశ్వరరావు పక్కనా కూడా నటిస్తోంది?" అని ఆశ్చర్యపోయాడు.

స్కూల్ ఫైనల్ పరీక్షలు వ్రాసిన దగ్గర్నుంచీ, అంటే దాదాపు పదహారో ఏడు వచ్చిన దగ్గర్నుంచీ మా వెంకటేశ్వర్లు తన కూతురు జానకికి పెళ్ళి సంబంధాలు చూస్తూనే వచ్చాడు.

జానకి చాలా మంచి పిల్ల. చామనఛాయైన రంగుతో కనుముక్కు తీరుగా ఉండే జానకిని అందగత్తెలలోకి జమ కట్టవచ్చు. సత్స్వభావురాలు. స్కూల్ ఫైనల్లో స్కూల్ మొత్తంమీద ఫస్టు రావటాన్నిబట్టి సాటివారికంటే తెలివైనదనే చెప్పవచ్చు.

మేట్లు చాలామంది బి.యస్సీ ఫస్టియర్ లోనో ఒకటి రెండు పెళ్ళిచూపులలో పాల్గొనటం, పెళ్ళి గురించి ఆలోచిస్తూ వాళ్ళు పరీక్షలు తప్పటం, అక్కడితో చదువు మానేయటం, ఆతర్వాత రెండు మూడేళ్ళదాకా వారికి పెళ్ళిళ్ళు కాకపోవటం జరిగాయి. వాటి చదువుకుని ఉంటే పెళ్ళయేసరికి శుభ్రంగా డిగ్రీ చేతిలోకి వచ్చివుండేది.

జానకి పెళ్ళి గురించి బి. యస్సీ ఫైనల్లోకి వచ్చేదాకా గట్టిగా ఆలోచించకపోవటానికి కారణం ఆమె పెరిగిన వాతావరణం. సాధారణంగా మన

★ ఏనుగులవేట ★

స్కూల్ ఫైనల్ ప్యాసవగానే జానకి పి. యు. సి.లో చేరి బైలాజికల్ సైన్సెస్ గ్రూపు తీసుకుంది. పెళ్ళి ఎప్పుడు కుదురుతుందో తెలియదు. తొందర లేనివాడేం కాదు. దాగా ఉన్నవాడే. పెళ్ళి కుదిరినప్పుడు అప్పుడే చదువు మానిపించెయ్యొచ్చులెమ్మని వెంకటేశ్వర్లు ఆలోచన.

ఈ పెళ్ళి విషయాల గురించి జానకి అంతగా పట్టించుకోలేదు. పట్టించుకుంటే ఆ పిల్ల మనసు పెళ్ళి మీదనే పోయి చాలా మంది ఆమె క్లాస్‌మేట్లలాగే తప్పికూర్చుండేది. ఆమె క్లాస్

దేశంలో ఆడపిల్ల అనగానే పుట్టినదగ్గర్నుంచీ చుట్టూ ఉన్నవాళ్ళంతా పెళ్ళి గురించి తప్ప మరో విషయం మాట్లాడరు. అంచేత మన బాలికలకు పెళ్ళయ్యేదాకా పెళ్ళి గురించి తప్ప మరే విషయాన్ని గురించీ ఆలోచనలు రావు.

ఈ విషయంలో మాత్రం జానకి మరో రకం వాతావరణంలోనే పెరిగింది. మామూలుగా అందరూ చూసే సంబంధాలు అంగీకరించే మనస్తత్వం వెంకటేశ్వర్లులో లేదు. నిస్సి

అదో రకం ఆలోచనలు మామూలు మనుషులు ఎగబడే సంబంధాలన్నీ అని దృష్టిలో సామాన్యమైన లేక చచ్చు సంబంధాలు. అని దృష్టి ఎప్పుడూ పై అంతస్తువారిమీదే ఉండేది. తన అంతస్తులోనే ఉన్న ఎంతోమంది మంచి ఆలోచనా శక్తి, కార్యదీక్ష ఉండి పైకి వెళ్ళే నేర్పుగల యువకులను అతను గుర్తించలేకపోయాడు. గుర్తించటానికి ఇష్టంలేకపోవటం కూడా అందుకొక కారణం కావచ్చు. అతను ఆలోచించి తనకు పనికిరాని సంబంధాలని నిశ్చయించుకున్న కొందరు యువకులకు తన బంధువులే తమ కూతుళ్ళనిచ్చి పెళ్ళిచేయటమూ, తర్వాత వారు పైకి వెళ్ళటమూ జరిగాయి. పైకి వెళ్ళటమంటే వెంకటేశ్వర్లు దృష్టిలో దాదాపుగా ఆస్తి సంపాయించటమే గాని నా దృష్టిలో కాదు. తెలివితేటలతో ఆస్తీ, మంచిపేరు కూడా తమంతగానే సంపాయించారు. సుఖంగా, ఆదర్శప్రాయంగా సంసారాలు చేసుకుంటున్నారు. వారికి అప్పుడే ఒకటీ అరా సంతానం.

అసలు లోపం ఎక్కడున్నదంటే వెంకటేశ్వర్లు తనకంటే ఒకరు తక్కువ స్థాయిలో ఉన్నారనిగనక అనుకుంటే ఇక అతనిలో ఎన్ని గొప్ప గుణాలున్నా వాటిని సంగీకరించలేడు. స్థాయి అంటే వెంకటేశ్వర్లు దృష్టిలో ఆస్తి, హోదా మాత్రమే. వెంకటేశ్వర్లు కంటే తక్కువ ఆదాయమే ఉన్న వెంకట్రామయ్య గారింట్లో వెంకటేశ్వర్లు ఇంట్లోలేని రేడియోగ్రాం, ఎయిర్ కూలర్ ఉన్నాయి. వెంకట్రామయ్యకు జీవితాన్ని అనుభవించటం తెలుసు. ఎప్పుడూ సరదాగా ఉంటాడు. అయినా వెంకటేశ్వర్లు వెంకట్రామయ్యను తనకంటే తక్కువస్థాయివాడిగా పరిగణించడం నేను స్వయంగా ఎరుగుదును. వెంకటేశ్వర్లును గూర్చి ఊళ్ళో మంచి అభిప్రాయం కంటే చెడ్డఅభిప్రాయమే ఎక్కువగా ఉంది. అంతెందుకు. నాకు చుట్టమైనా నాకు అతనంటే సదభిప్రాయం మాత్రం లేదు.

వెంకటేశ్వర్లు కూతురు వినేటప్పుడు తన బంధువులు చూసే ఈ "అడ్డమైన" సంబంధాల గురించీ మాట్లాడకపోవడంవల్ల, వాళ్ళమ్మ తప్ప ఇంట్లో పెళ్ళి గురించి గొడవ చేసే ముసలివాళ్ళెవరూ లేకపోవటంవల్ల జానకి మరో రకం వాతావరణంలో, అంటే సాధారణ తెలుగుదేశ వాతావరణానికి భిన్నమైన వాతావరణంలో పెరిగిందని చెప్పొచ్చు.

2

వెంకటేశ్వర్లు జానక్కి మొట్టమొదటగా చూసిన సంబంధం రాజశేఖరం మా కుల

జి. యస్. ఆర్.



స్తుడే. క్రొత్తగా ఐ. ఏ. యస్. పాసై బి.డి.వో.గా మా వూరు వచ్చాడు. చక్కగా అందంగా ఉంటాడు. ఎవరితోనైనా నవ్వుతూ మాట్లాడతాడు. వెనక పెద్ద బాదర బందీ ఉన్నట్లుగా కూడా లేదు. బి. డి. వో తన అల్లుడంటే తనూ తన పలుకుబడి పెంచుకోవచ్చు. అదీ రాజశేఖరాన్ని సెలక్టు చేసుకోవటంలో వెంకటేశ్వర్లు ఉద్దేశ్యం.

వెంకటేశ్వర్లుకూడా మంచి పొజిషన్‌లోనే ఉన్నాడు కాబట్టి రాజశేఖరంతో పరిచయం పెంచుకోవటానికి అట్టే కష్టపడనవసరం లేకపోయింది. రాజశేఖరం ఈ పరిచయం మూలంగా వెంకటేశ్వర్లు బలవంతంమీద చాలాసార్లు వెంకటేశ్వర్లు ఇంట్లోనే భోంచేసేవాడు. మామూలుగా అతను ఒక వంటవాడిని పెట్టుకున్నాడు.

ఇక్కడ మా వూరు గురించి మీకు కొద్దిగా చెప్పాలి. మా వూరు చాలా

పెద్దఊరు. ట్రంక్ రోడ్డుమీద, టౌన్‌కు దగ్గర్లో ఉండటంచేత బస్తీ కళలుచాలా వచ్చాయి. రెండు సినిమా హాళ్ళున్నాయి. ఆఖరికి డిటెక్టివ్ పుస్తకాలు అద్దెకిచ్చే షాపులున్నాయికూడా.

బి. ఏ. సెస్ ఫస్టుక్లాస్ లో చదివి సెలవల్లో ఇంటికి తిరిగి వచ్చాక జానకికి, రాజశేఖరానికీ స్నేహమయింది. రాజశేఖరం చాలా మంచి స్నేహితుడు. జానకికి కావలసిన పుస్తకాలన్నీ లైబ్రరీ నుంచి తెచ్చిపెట్టటమే కాకుండా ఎలాంటి పుస్తకాలు చదవాలో ఏ పుస్తకాలు చదవాలో సలహా కూడా ఇచ్చేవాడు. ఇద్దరూ కలిసి రాజశేఖరం కారులోనే ఎప్పుడన్నా సినిమాలకు కూడా వెళుతుండేవారు. రాజశేఖరం స్నేహం వల్లనే జానకిలో ఆలోచనాత్మకమైన దృష్టికి బీజం పడిందని చెప్పొచ్చు.

రాజశేఖరం గురించిన పూర్తి వివరాలు వెంకటేశ్వర్లు పూర్తిగా సేకరించలేకపోయాడనే చెప్పొచ్చు. రాజశేఖరం మాటల్ని వెంకటేశ్వర్లు చాలా సార్లు సూటిగా తీసుకొనక తనకు కావలసిన విధంగా అన్వయించుకొనేవాడు.

ఒకసారి వెంకటేశ్వర్లు రాజశేఖరంతో "మా జానకి గురించి నీ అభిప్రాయమేమిటో చెప్పు" అని అడిగాడు.

చిరునవ్వుతో సమాధానమిచ్చాడు శేఖరం. "జానకికేం తక్కువండీ. చాలా తెలివైన పిల్ల. జానకిని చేపట్టేవాడెవడో గాని చాలా అదృష్టవంతుడు."

"జానకికి ఈ సంవత్సరం పెళ్ళి చేద్దామని నా అభిప్రాయం" ఏమంటావన్నట్లుగా చూశాడు వెంకటేశ్వర్లు.

శేఖరం మరేం మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

దీన్ని వెంకటేశ్వర్లు తన కనుకూలంగా ఎలా వ్యాఖ్యానించుకున్నాడో వేరే చెప్పనవసరం లేదనుకుంటాను.


వెంకటేశ్వర్లు సమక్షంలోనే ఒకరోజు జానకి, బహుశా శేఖరానికి పెళ్ళయిందని భావించిందేమో "మీ శ్రీమతిని ఎప్పుడు తీసుకొస్తారండి శేఖరం గారూ" అని అడిగింది.

వినోదంగా చూస్తూ అన్నాడు శేఖరం. "నా భార్య ఇప్పుడు పుట్టింట్లోనే పెరుగుతోందండీ. ప్రస్తుతానికి క్షమించాలి."

అతని సమాధానానికి జానకికి నవ్వు వచ్చింది. "భలే తమాషాగా మాట్లాడతారేమిటి. మరయితే అసలు ఎప్పుడు పెళ్ళి చేసుకుంటారు?" అంది.

"నాకు మాత్రం మరో సంవత్సరం పోయాక చేసుకుందామని ఉందండీ. మా అమ్మ మాత్రం ఈ సంవత్సరమే చేసుకోమని బలవంతం చేస్తున్నదనుకోండి. ముసలి వాళ్ళకెప్పుడూ పెళ్ళి గొడవే కదా" అన్నాడు.

ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు.



ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది. ఈ సంభాషణ విని వెంకటేశ్వర్లు చాలా విషయాలు తెలిసినాయనుకుని అమితంగా సంతోషించాడు. త్వరలో అతనితో వెళ్ళి విషయం కదపాలని అనుకున్నాడు. తన ఆలోచనను సూచనప్రాయంగా శేఖరానికి తెలియజేశాడు కూడా. కాని శేఖరం ఎక్కడికో క్యాంప్ కెళ్తూ హడావుడిలో ఆ మాటల్ని పట్టించుకున్నట్లు లేదు.

మరో నాలుగైదు రోజుల తర్వాత ఈసారి శేఖర్ని గట్టిగా జానకి పెళ్ళి గురించి అడగాలని అతని ఇంటికి బయలుదేరాడు వెంకటేశ్వర్లు. తన తండ్రి శేఖరంతో తన పెళ్ళి గురించి ప్రయత్నిస్తున్నాడని జానకికి తెలీదు.

దాంట్లో ప్యూన్ కన్పించి, క్యాంప్ నుంచి రాగానే శేఖరం వాళ్ళమ్మగారికి సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వస్తే ఇంటికి వెళ్ళిపోయాడని చెప్పాడు. ఉసూరుమంటూ వెనుదిరిగాడు వెంకటేశ్వర్లు.

3

అలా ఇంటికి వెళ్ళిన శేఖరం మళ్ళా దాదాపు ఇరవై రోజులవరకూ రాలేదు. రాజశేఖరం ఊళ్ళోకి వచ్చి వెంకటేశ్వర్లుగారింటికి వెళ్ళినప్పుడు ఇంట్లో వెంకటేశ్వర్లు లేడు. పొరుగూరెళ్ళాడు. జానకిమాత్రం ఉంది. జానకికి తన పెళ్ళి ఇన్విటేషన్ ఇచ్చాడు రాజశేఖరం.

ఇన్విటేషన్ చూసి ఆశ్చర్యపోయింది జానకి. "ఈ సంవత్సరం పెళ్ళి చేసుకోనన్నారే" అనడిగింది.

చిరునవ్వుతోనే సమాధానమిచ్చాడు శేఖరం. "మా అమ్మకు జబ్బుచేసి చాలా సీరియస్ అయిందండీ. పెద్ద

వయసు కదా. ఇంకెంతో కాలం బ్రతకనని ఆవిడకు గట్టి నమ్మకం మేర్పడి పోయింది. పెళ్ళి చేసుకోమని గట్టిగా పట్టుబట్టింది. ఇక తప్పలేదు."

ఒక క్షణం ఆగి మళ్ళా మొదలు పెట్టాడు శేఖరం. "ఒకో విషయం చెప్పనా, మనిద్దరికీ వివాహం చెయ్యాలని మీ నాన్నగారి ఉద్దేశ్యం. చాలా ఆశ ఉంది. ఏదో బి.డి.వో గా పని చేస్తున్నాను. ఈ రకంగా అయితే తన ఇన్‌ఫ్లూయెన్స్ ఉపయోగించుకోవచ్చుని మీ నాన్నగారు ఆశపడ్డారు. కాని నా గురించి ఆయనకు పూర్తి విషయాలు తెలీవు. స్టేట్ ఇండస్ట్రీస్ మినిష్టర్ గారు లేరూ, ఆయన నా మేనమామ. ఆయన కూతుర్నే నే నిప్పుడు చేసుకో బోతున్నది. ఇన్విటేషన్లలో చూసే ఉంటారు."

జానకి నిస్తేజంగా శేఖరం వంక చూస్తుండిపోయింది. శేఖరం చెప్పుకు పోయాడు.

"మన సంభాషణలు మీ నాన్నగారు మరో రకంగా అర్థం చేసుకున్నారు. మీ రొకసారి నా పెళ్ళి గురించి అడిగితే నా భార్య ఎక్కడో పుట్టింట్లో పెరుగుతున్నదని చెప్పాను. గుర్తుందా. అది అతను జోక్‌గా తీసుకున్నారు. అది మా మామయ్య కూతురు గురించే చెప్పాను."

కొంచెం నొచ్చుకుంటున్నట్లుగా అన్నది జానకి. "క్షమించండి. మా నాన్న అలా ఆలోచిస్తున్నట్లుగా నాకు తెలీదు."

స్నేహపూర్వకంగా అన్నాడు శేఖరం. "నే నెప్పుడో గ్రహించాను మీ కీ విషయం తెలియదని. ఇక ఆ విషయం పోనివ్వండి. మీరు లోకాన్ని అర్థం చేసుకోవటానికి ఉపకరిస్తుందని చెప్పాను. నాకు ట్రాన్స్‌ఫరైంది. మా మామయ్యే చేయించాడు మా వూరు దగ్గరలోకి. ఇవ్వాళే వెళ్ళిపోతున్నాను. మీ నాన్నగారు ఊళ్ళో లేరటగా, ఆయన రాగానే చెప్పండి."

"ఇక్కడి నుంచి వెళ్ళిపోతున్నారు గదా. ఆఖరుసారిగా భోజనం చేసి వెళ్ళండి" అనడిగింది జానకి.

జానకి కోరిక ప్రకారం భోజనం చేసి, ఒక పార్కర్ పెన్నును జానకికి ప్రెజెంట్ చేసి వెళ్ళిపోయాడు శేఖరం.

జానకికి మొదటిసారిగా తన తండ్రిపై అసంతృప్తి కలిగింది.

• • •

తర్వాత రాజశేఖరం వివాహానికి గ్రీటింగ్స్ టెలిగ్రామూ, ప్రెజంటేషన్నూ పంపింది జానకి.

4

అదివరకు రాజశేఖరం గురించి ఎంతో మంచిగాచెప్పిన వెంకటేశ్వర్లు, తర్వాత అతన్ని గురించి నాతో చెడ్డగా చెప్పి తన స్వభావాన్ని రుజువు చేసు

కున్నాడు. రాజశేఖరం గూర్చి నాకు మొదటినుంచీ మంచి అభిప్రాయమే ఉంది. వెంకటేశ్వర్లు చెడ్డ ప్రచారం ద్వారా అదేమీ తగ్గలేదు.

వెంకటేశ్వర్లు తర్వాత చేటాడిన ఏనుగు రామగోపాలరావు. రామగోపాలరావు జమీందారు కొడుకు. జల్సాపురుషుడు. ఎప్పుడూ విలాసంగా కన్పించేవాడు. మా వూరు వచ్చి ఉప్పుడు బిస్కెట్ ఫ్యాక్టరీ ఒకటి క్రొత్తగా కట్టించడం మొదలు పెట్టాడు.

తన మామూలు పద్ధతి ప్రకారం అతనితో స్నేహం చేసుకున్నాక, ఇంటికి ఆహ్వానించడం మొదలుపెట్టిన తర్వాత, జానకి బి.యస్సీ. రెండవ సంవత్సరం పరీక్షలు వ్రాసి వచ్చిన వేసవి శెలవులలో జానకిని పరిచయం చేశాడు రామగోపాలరావుని.

రాజశేఖరం స్నేహ ప్రభావం, జానకి బి.యస్సి. రెండవ సంవత్సరం చదువుతూ చదివిన ఇతర లైబ్రరీ పుస్తకాలూ జానకిని ఎలా మార్చేయో వెంకటేశ్వర్లుకి తెలీదు. జానకిలోని మార్పును అతను కలలో కూడా ఊహించలేదు. ఈ మధ్యలో జానకి చాలా ఎదిగింది. చాలా విషయాలపై స్వంత అభిప్రాయాలేర్పరచుకుంది. మనస్తత్వాల్ని పరిశీలించడం నేర్చుకుంది. తన తండ్రి ప్రవర్తనా, ఆశలూ, రామగోపాలరావు ఉద్దేశాలూ చాలా తేలిగ్గా గ్రహించగలిగింది.

ఆ క్షణంనించే రామగోపాలరావుని వీలయినంత దూరంగా ఉంచటానికి ప్రయత్నించింది.


రామగోపాలం జానకితో స్నేహం చేయటానికి చాలా ప్రయాసపడ్డాడు. అసలతను స్త్రీలతో స్నేహం చేయడానికే చాలా ప్రయాసపడతాడేమో! అతను జానకికి చిన్న చిన్న బహుమతులు తీసుకురావటంలాంటి పనులే కాకుండా తన శేలికరకం వ్యక్తిత్వం కన్పించే పనులుకూడా చేశాడు. ఉదాహరణకు తన గురించిన గొప్పలు చెప్పటం, క్రికెట్ గురించీ, కవిత్వం గురించీ జానకికేమీ అసలు తెలియదనే దృష్టిలో తను వినికిడి జ్ఞానంవల్ల మాత్రం గ్రహించిన పైపై విషయాల్ని చెప్పటం మొదలైనవి.

స్కూల్ ఫైనల్ మాత్రం పాసై వారపత్రికా ప్రపంచంలోని పెటీ మెంటలలోను, అర్థంలేని ఆదర్శాలలోను జీవించే నేటి సాధారణ యువతి అతని మాటల్లో పడేదేగాని, జానకి ప్రపంచం అంతకంటే ఉన్నతమైనది. అందుచేత అతని కబుర్లు విని మౌనంగా ఊరుకునేది. వీలయినంతవరకూ అతన్ని తప్పించుకోవటానికే ప్రయత్నించేది.

జానకి స్నేహం కోసం రామగోపాలరావు వెంపర్లాడటం చూసి వెంకటేశ్వర్లు చాలా సంతోషించాడు మనసులోనే. ఒకానొక శుభ ముహూర్తాన జానకితో అతని పెళ్ళి విషయం గురించి చర్చించడానికి చిరునవ్వులు

ఉండేలా

చేస్తోంది...



పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్క్!

నవ్వుకుంటూ అతని గదిలోకి అడుగు పెట్టాడు వెంకటేశ్వర్లు. చిరునవ్వు లతో వెళ్ళిన వెంకటేశ్వర్లు, ఉక్రోషంతో జుట్టు పీక్కుంటూ ఏడుపు ముఖంతో ఉండేలు దెబ్బదిన్న కాకిలా బయటకొచ్చాడు.

5

రామగోపాలరావు రూములో ఏం జరిగిందో అతనే తనకు తెలిసిన వాళ్ళందరికీ పిల్చి సిగరెట్లిచ్చి మరీ చెప్పటంవల్ల ఊరందరికీ తెలిసిపోయింది. అతనే స్వయంగా చెప్పటం వల్ల పూర్తిగా ప్రతి డిటెయిలుగా చాలా మందికి కంఠతా వచ్చేసింది. పైగా అతని గొప్పలు చెప్పుకునే స్వభావం వల్ల జరిగిందానికి మరి నాలుగు కల్పించి చెప్పాడు.

వెంకటేశ్వర్లు రామగోపాలంతో జానకి పెళ్ళి విషయం గురించి మాట్లాడా లనగానే పెద్దగా నవ్వాడు రామగోపాలం. "జానకి పెళ్ళి గురించి నాతో మాట్లాడటమేమిటి" అని.

"అదే జానకిని నీ కిచ్చి పెళ్ళి చేద్దామని" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నాకా" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు రామగోపాలం. "నా కింత వరకూ పెళ్ళ కాలేదని ఎందు కను కున్నారు ?"

"నీ కిదివరకే పెళ్ళయిందా ?" అనుమానంగా ప్రశ్నించాడు వెంకటేశ్వర్లు.

"అవును. పెళ్ళయి ఏడాది దాటి పోయింది. ఏం ?"

దెబ్బతిన్నట్లుగా దిమ్మరపోయి చూశాడు వెంకటేశ్వర్లు,

"మరి జానకితో అంతగా స్నేహ మెందుకు చేసినట్లు ?"

"ఎందుకేమిటి? ఆడపిల్లలతో స్నేహం చేయడమంటే నాకు సరదా."

"హుం! ఆడపిల్లలతో స్నేహంచేసి ఆశలు కల్పించట మెందుకు?"

"ఎవరు కల్పించుకోమన్నారు ఆశలు? అయినా పెద్దలు మీకామాత్రం జ్ఞానం ఉండనక్కరలా. అసలు మీ అంతస్థేమిటి, నా అంతస్థేమిటి ? ఏ ఉద్దేశంతో మీరు నామీద ఆశలు పెట్టు కున్నారు. మీ అమ్మాయిని ఎరగా వాడి జమీందార్లను వలలో వేసుకోవట మేనా మీ ఆలోచనా, ఆశా? అయినా నాకు మీ అమ్మాయినే చేసుకోవలసిన అవసరమేమిటో ఎప్పుడన్నా ఆలో చించారా. మీ అజ్ఞానానికి నన్నేం చెయ్యమంటారు ?"

వెంకటేశ్వర్లు మరేం మాటాడక, బహుశా మాటాడలేక తిరిగొచ్చాడు మొహం కందగడ్డ చేసుకుని.

ఈ రకంగా వెంకటేశ్వర్లు ఈ ఏనుగును వేటాడటంలో ఎదురుదెబ్బ తిన్నాడు పాపం మొదటి ఏనుగు చాలా మంచిది. దెబ్బ కొట్టకుండానే వది

లేసింది. ఈ ఏనుగుమాత్రం దిమ్మ దిరిగేలా దెబ్బకొట్టి మరీ వదిలింది. అయినా వెంకటేశ్వర్లుకీ శాస్తి కావలసిందే. మరి అతనీ ఏనుగును వేటాడి పట్టగలిగితే తనంత తెలివైనవాడు లేడని ముసుకుని ఆకాశాని కెక్కేవాడే గదా!

6

జానకి బి. యస్సీ. ఫైనల్ చదువు పూర్తి జేసింది. వెంకటేశ్వర్లింకా ఏనుగున్ని వేటాడుతోనే ఉన్నాడు.

జానకి ఫైనల్ పరీక్షలు వ్రాసి ఇంటికి వచ్చిన వారం పదిరోజులకు వెంకటేశ్వర్లు మేనల్లుడు సత్యనారాయణ వచ్చాడు. (సత్యనారాయణ వెంకటేశ్వర్లుకు స్వయానా మేనల్లుడు కాదు. అల్లుడి వరస) సత్యనారాయణ తల్లిదండ్రులు బీదవారవటంతో వెంకటేశ్వర్లు వాళ్ళతో మొదటినుంచీ అంతగా రాకపోకలు జరపటానికి ఇష్టపడలేదు.

సరిగ్గా సత్యనారాయణ వచ్చే సమయానికే వెంకటేశ్వర్లు జానకితో ఆమె పెళ్ళిగురించి ప్రస్తావిస్తున్నాడు.

"ఈ సంవత్సరం నీ పెళ్ళి చేద్దామనుకుంటున్నానమ్మా" అన్నాడు.

జానకి తలెత్తి చూసింది. ఆ పిల్ల కళ్ళలో వెంకటేశ్వర్లుకు ఏ భావమూ కన్పించలేదు.

ఒక సంబంధం చూశాను. మంచి లక్షాధికారుల సంబంధం. మనకంటే చాలా పై అంతస్థులో వాళ్ళే. కుర్రాడి నాన్నకూ నాకూ ఉన్న స్నేహాన్నిబట్టి ఒప్పుకున్నారు. రెండుమూడు రోజుల్లో నిన్ను చూసుకోవటానికి వస్తారు."

సరిగ్గా ఆ సమయంలోనే సత్యనారాయణ రిక్షా దిగి ఇంట్లో అడుగు బెట్టాడు. అతన్ని చూడగానే ఉద్యోగం చూపించమని అడగటానికే వచ్చాడని నిర్ణయించుకుని వెంకటేశ్వర్లు మనసులోనే చిరాకుపడి మొహం చిట్లించాడు.

సత్యనారాయణను చూడగానే జానకి మొహం విప్పారింది. "నాన్నా, నేనూ వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాం నాన్నా" అంది జానకి.

వెంకటేశ్వర్లు దిగ్భ్రాంతిచెందాడు. జానకేనా తన కడుపున బుట్టిన తన కూతురేనా "వీణ్ణి, తమకంటే తక్కువ అంతస్థులో ఉన్నవాణ్ణి" చేసుకుంటానంటున్నదీ అని. నిజమే మరి. సత్యనారాయణ అ దృష్టిలో ఏనుగుకాదు. కనీసం దోమకంటే గూడా చిన్న.

"మీరిద్దరూనా" తన చెవులను తను నమ్మలేనట్లుగా ప్రశ్నించాడు. అసలు సరిగ్గా ఈ సమయానికే వీడెక్కడ ఊడిపడ్డాడూ, ఇంతకుముందు వీరిద్దరూ ఎప్పుడు కలుసుకున్నారు, ఏం జేశారూ అని దీర్ఘంగా ఆలోచిస్తూ.

"అవును మామయ్యా" సత్యనారా



యణ నోరు విప్పాడు. "రిజిస్టర్ మ్యారేజీకి అప్లికేషన్ పెట్టి వచ్చాం. మంత్రాల పెళ్ళి అయితే వృధాగా డబ్బు నాశనమవుతుందని. మా అమ్మా, నాన్నా మీకోసం ఎదురు చూస్తున్నారు. మిమ్మల్నందర్నీ తీసుకెళదామని వచ్చాను. రేపు సాయంకాలం బయలుదేరదామా" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

"జానకి నీతో పెళ్ళా, వీల్లేదు. ఈ పెళ్ళి ఎంతమాత్రం జరగటానికి వీల్లేదు. ఎలా జరుగుతుందో నేను చూస్తాను" అసహనంగా అరిచాడు వెంకటేశ్వర్లు.

ఆ రోజంతా వెంకటేశ్వర్లు చేసిన గొడవ ఊహించుకోవలసిందే.

* * *

మరుసటి రోజున జానకీ, సత్యనారాయణా బయల్దేరారు. వెంకటేశ్వర్లు అఖండపారిగా రంకెలు బెట్టాడు.

"నా కసలు కూతురే లేదనుకుంటాను. నా ఆస్తంతా ఏ మఠానికో రాసి పారేస్తాను. ఫో, నా ఇంట్లోకి మళ్ళా అడుగుబెట్టకు. ఇక జన్మలో నీ ముఖం చూడను" అని రంకెలేశాడు. ఏమన్నా పేచీ పెడదామంటే జానకి మైనార్టీ దాటిపోయింది.

జానకి కట్టుబట్టలతోనే ఇంట్లోంచి బయటకు వచ్చేసింది. తల్లి ఏడుపును గూడా లెక్కచెయ్యకుండా. తల్లి బ్రతిమాలినా కూడా వినకుండా నగలన్నీ ఇంట్లోనే వదిలేసింది.

వెళ్ళబోయే ముందు వాళ్ళిద్దరూ మా యింటికి వచ్చారు. సత్యనారాయణ యమ్మెస్సీ పాసై ఆ సంవత్సరమే జానకి వాళ్ళ కాలేజీలో లెక్చరర్‌గా వచ్చాడట. జానకి అతన్ని గుర్తించలేదు గాని అతనే మొదట జానకిని గుర్తించి మాటాడాడట. వారిద్దరి స్నేహమూ అలా ప్రారంభమై ఇప్పుడీ వివాహానికి దారితీసింది.

వాళ్ళ పెళ్ళికి నన్ను తప్పకుండా రమ్మని మరీ మరీ అడిగి వస్తానని ఒప్పుకున్న మీదటనే వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. వెంకటేశ్వర్లు తెచ్చే సంబంధాలకోసం ఎదురు చూడకుండా జానకి తనంతట తనే స్వయంగా వరుణ్ణి ఎన్నుకున్నందుకు నాకు చాలా సంతోషం వేసింది. సత్యనారాయణకు మాత్రం తక్కువ. అతను నాకు చాలా ఉత్తముడుగా, సంస్కారవంతుడుగా కన్పించాడు. జానకి వెళ్ళిపోతూ అన్న మాటలు నా కింకా గుర్తున్నాయి.

"సత్యనారాయణను నేను యీ సంవత్సరమంతా పరిశీలించి బాగా అర్థం చేసుకున్నాను బాబాయ్! నా ఉద్దేశాలను, ఆలోచనలను అతను గౌరవిస్తాడు. నా జీవితంలో నాకేంకావాలో నాకు బాగా తెలుసు. మాకు డబ్బు లేకపోయినా ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటూ జీవించగలం గదా ఒకరిమీద ఆధారపడకుండా. జీవితంలో సహచరుడిగా, స్నేహితుడిగా ఉండే భర్త నాకు కావాలి గాని డబ్బుతో నన్ను కొనేసే భర్తా, నన్ను బొమ్మలా ఆరాధించే భర్తా నా కక్కరలేదు. మనిషికి జీవితంలో కావాల్సింది డబ్బే కాదు. డబ్బుకంటే కూడా ముఖ్యమయినవి చాలా ఉన్నాయి."

వెంకటేశ్వర్లు వయసులో సగం వయసు లేకపోయినా ఈ సత్యాన్నే, వెంకటేశ్వర్లు గ్రహించలేని సత్యాన్ని

జానకి గుర్తించినందుకు నాకు చాలా సంతోషం వేసింది.

"వాడా నాకు అల్లుడు? ఆ బోడి పంతులా నాకు అడ్డుడు. అది నా కూతురే కాదసలు. నా కసలు కూతురే పుట్టలేదు" అని అరిచాట్ట వెంకటేశ్వర్లు పెళ్ళాంమీద. పెళ్ళికి వెళదామని ఆవిడ కంటనీరు పెట్టుకుంటే. పెళ్ళికి నేనూ, నా భార్యా వెళ్ళాము. రాజశేఖరం కూడా వచ్చాడు. పెళ్ళి సింపుల్‌గా, బాగా జరిగింది.

పెళ్ళి కాగానే వాళ్ళిద్దర్నీ నేను మా యింటికి తీసుకువచ్చి బట్టలు పెట్టాను. (ఈ విధంగా వెంకటేశ్వర్లుమీద నాకున్న "కసి"ని తీర్చుకున్నాను.) వాళ్ళిద్దర్నీ ఇంట్లోకి రానివ్వకుండా తలుపు లేసుకున్నాడు వెంకటేశ్వర్లు. వెంకటేశ్వర్లు స్వభావం తెలిసిన వాళ్ళెవరూ చిన్నబుచ్చుకోకుండా తిరిగొచ్చారు. వాళ్ళను తీసుకొచ్చినందుకు నా మీద కాలూ మిరియాలూ నూరాడుగాని నేనేం మాటాడలేదు.

జానకి అమ్మ మాత్రం వెంకటేశ్వర్లుకు తెలియకుండా మా యింటికొచ్చి, కూతుర్నీ అల్లుడినీ పలకరించింది. తాను భర్తకు తెలియకుండా దాచుకున్న డబ్బు అయిదువందలు ఏదన్నా చిన్న నగ చేయించుకోమని జానక్కి ఇచ్చింది. జానకి తీసుకోవటానికి ఒప్పుకోలేదు. వాళ్ళమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకునేసరికి, నేను నచ్చచెప్పాక తీసుకుంది. ఈ పెళ్ళి మొత్తంమీద వాళ్ళమ్మకు ఇష్టంగానే వుంది.

జానక్కి మొన్ననే కొడుకు పుట్టాడు. ఎర్రగా, బొద్దుగా వున్నాడు. వెంకటేశ్వర్లు పొరుగూరు వెళ్ళిన సమయంలో నేను జానకి తల్లిని తీసుకుని జానకి దగ్గరకు బయలుదేరాను. మేము రిక్షా దిగబోతున్నప్పుడే వెంకటేశ్వర్లు దొంగలాగా జానకి ఇంటి గుమ్మందిగి వెళ్ళిపోతూ కన్పించాడు! అతను మమ్మల్ని గమనించలేదు.

ఎలాగయినా వెంకటేశ్వర్లుగారు సత్యసంధులు. ఆయన జానకినీ, సత్యనారాయణనీ పలకరించకుండా (వాళ్ళు ఎదురుగానే ఉండటం మూలాన వాళ్ళ మొహాలు మాత్రం చూడక తప్పలేదనుకుంటాను) మనవణ్ణి మాత్రం ఎత్తుకుని ముద్దాడి బంగారుమురుగులు చేతులకు పెట్టి వెళ్ళాడుట.

ఈ మధ్య వెంకటేశ్వర్లుకు జానకి వాళ్ళు ఉంటున్న టౌన్లో పని ఎక్కువగా ఉంటున్నై. కనీసం నెలకోసారన్నా నరసన తప్పకుండా వెళ్ళొస్తున్నాడు!

* * *



మరమనిషి-మరోమనిషి

రామవరపు జగన్మోహనరావు


మరమనిషి-రాబర్ట్ ఎక్కడో ఆయిలింగ్ అవసర మొచ్చినట్టు - పెళుసుగా కిర్రని చప్పుడు చేస్తూ వొంగి సిల్వర్ ట్రేలో నిఖార్సయిన నిషా పదార్థాన్ని - అదే హై నార్డ్స్ విస్కీని మోహనాదేవికి అందించేడు. మార్ఫియస్ మత్తు విస్కీని మోహనాదేవి అంతకంతకు గమ్మత్తుగా తాగుతూ, ఓరగా దొంగగా రాబర్ట్ వైపు చూస్తూంటే — రాబర్ట్ ఏమొచ్చి తన పన్నెంటి స్టీలు మొహం మీద ఆరని తెల్లటి పింగాణీ చిన్నవ్వుని చిందిస్తూ సిల్వర్ ట్రే చేత బట్టుకుని నిల్చున్నాడు.

"డియర్ రాబర్ట్, విస్కీ రంజుగా, మా మజాగా వుందోయ్!.... థాంక్యూ సో మచ్ ...గానీ గాడ్డామిట్ ! ఆ వెధవ నవ్వేంది చూసేవూ; అదే నీ పెదాలమీద ఎప్పుడూ ఆరిపోని ఆ తెల్లటి పింగాణీ చిన్నవ్వ ..అదంటే నాకు మహా తోత !"

"అయామ్ సో సారీ, మేడం ! నేను మరోలా మారడానికి మరే మార్గమూ లేని మరమనిషిని గానీ— మామూలు మనిషిని కాదుగదా!" అని రాబర్ట్ నోతిలోంచి మాట్లాడుతున్నట్టు సవినయంగా విన్నవించుకున్నాడు.

మళ్ళీ యథాప్రకారం కార్నర్ సీట్లోకి పోయి ట్రేని పట్టుకుని స్తబ్ధుగా నిర్వేదంగా నిల్చున్నాడు రాబర్ట్. సిల్వర్ని సంపాయించి రాబర్ట్ సిల్వర్ ట్రేని తయారుచేసేడు. అలాగే మెత్తటి ఇసుకనికూడ దీసుకుని కాక్‌టెయిల్ గ్లాసునికూడా చేసేడు. ఈ అనంత విశాల విశ్వంలో దేవుడు సృష్టించిన రసాయన పదార్థాలో జిన్నూ-జున్నూలాటి రుచి పదార్థాల విశ్వామిత్ర సృష్టి జేసి త్రిశంకు స్వర్గాన్నే మరపింప జేసేడు.

"మోనా డియర్, అప్పుడప్పుడూ నాకేమనిపిస్తుందో తెల్సా?! పెద్ద కంప్యూటర్ మేషన్లో మరమనిషితో జీవచ్ఛవంలా బతికేకన్నా — పశువుల కొట్టంలో మామూలు మనిషితో జాకీ కెనెడీలాగ గడిపితే ఎంత బావున్ననిపిస్తుంది!" అని చెప్పి మిస్ మోహన తన ఈడేరని స్వప్నరమా



లోని చెక్కిళ్ళల సారాంశాన్ని వెలిబుచ్చింది.

ఆ నలుగురు మిస్సమ్మలూ భూమికి బహుదూరంగా రోదసీనౌక డ్రాయింగ్ రూంలో తుళ్ళుతూ తేలుతూ కేరింతలు కొడుతూ అతి విలాసంగా కాలక్షేపం చేస్తున్నారు.

వాళ్ళ కప్పుకునే రగ్గులో మామూలు పది రగ్గుల దళసరీ, పది పెగ్గుల వేడి కూడా వున్నాయి; అధునాతనమైన ఫర్నిచరు అట్టహాసంగా వుంది; గోడ మీద పెయింటింగులు ఉత్ప్రేరకంగానూ-ఈస్థటిగ్గానూ వున్నాయి; పుస్తకాలూ-మ్యూజిక్ టేపుల్తోనూ నిండి వున్న రోజ్‌వుడ్ బీర్వాలన్నీ - బిరాన కాన్ఫరెన్సులో విప్స్‌లా కన్పిస్తూ తెగ రేస్తా చూస్తున్నాయి. ఇవన్నీ మర మనిషి - రోబట్ కృషిఫలితాలే!

రోబట్ తయారీ అందంలో తన్ను చూస్కుంటూ — పౌడరాటి వేళ్ళ మొనల్తో రెండు జెళ్ళ పాయలూ విప్పుకుంటూ మళ్ళీ అల్లుకుంటోన్న బీనా దేవి — "ఔనుగానీ, మన మెప్పుడైనా ఈ మానవరాహిత్య ప్రపంచాన్నుండి పలాయనమంత్రం పఠించగలమంటావా ?!" అని ఉన్నట్టుండి హైడ్రోజన్ బాంబులాటి ప్రశ్నొదిలింది.


అప్పుడే మొచ్చిన మోనా దేవి గ్లూమీగా అతి గ్లూమీగా — "అదేవో

బాబూ! నాకు తలా తోకా ఏమీ అందటం లెదు. ఈ వాతావరణం ఉచ్చు (ఎట్మాస్ఫియరిక్ ట్రాప్) అనేదుంది చూసేవూ—అదెలాటి రోదసీనౌకనైనా తుక్కు తుక్కు చేసి పారేస్తుంది. మొన్ననేగా ఉక్కు ముక్కలాటి మన మరో రోదసీనౌకని నుగ్గునుగ్గు నూచంనూచం చేసి పారేసింది. మళ్ళీ అదే మాగ్నటిక్ లేయర్ రేడియో మెసేజిక్కూడా ఇనుపతెరలా అడ్డి సౌండ్-ప్రూఫ్ చేసి పారేస్తుంది. లేదు, లేదు — మనమో 'కాలనీ' కేయాస్‌లో ఇరుక్కున్నామేమోనని గొప్పగా భయపడి పోతున్నాను...." అన్చెప్పింది.

"కాలనీ" అయితే దానిమట్టు కది మళ్ళీ పునరావృతమౌతుంది. గానీ, నరపురుగన్న వాసన లేని మనది 'కాలనీ' అన్పించుకోదు!" అని ఏదో మర్చిపోయిన విషయాన్ని జ్ఞాపకం చేస్తున్నట్టు పెద్ద ప్రొసిక్యూటర్లా కన్బొమ లెగరేస్తూ అంది ఎంకామె లెల్బీ చదువుకున్న మిస్ సుమన.

ఆ నలుగురు మిస్సమ్మలూ ఈ విశాల విశ్వాని కంతటికీ సౌందర్య ప్రతినిధులూ కారు—చిదిమితే పాలుగారే లేబ్రాయములో వున్నవారంత కంటె కాదు! ముప్పై వసంతాల్ని చూసినవాళ్ళూ, -అరవై హేమంతాల అనుభవాల్ని రుచి చూసినవాళ్ళున్నా గానీ మామూలు ఆడవాళ్ళు కారు!? అసలా మాటకొస్తే వయసులో చిన్నదీ——రూపులో బాపుబొమ్మదీ—— రోదసీపయనానికే ఒప్పుకోదు! బ్యూటీ కంటెస్ట్‌కి బ్యూనస్సైరిస్సే పోవొచ్చు; బాయ్‌ఫ్రెండ్‌తో బుహారీ హోటెల్‌కే పోవొచ్చు: లేదా బొచ్చుకుక్క-బ్యూక్కారుతో మెరీనా బీచికే పోవొచ్చు; మరింకెక్కడికేనా పోవొచ్చు గానీ రోదసీ ప్రయాణానికి మాత్రం పనిగట్టుకు పోదు. ఏ వాలెంతినా తెరెష్కోవా లాటి వాళ్ళో 'ముందుచూపు'తో పోవొచ్చు — ఏ 'మెర్మెటిటోవ్'నో తమ స్పుత్నిక్ ప్రేమపాశంతో (ఆ) కట్టుకోవడానికి! చెప్పొచ్చేదేమిటంటే వాళ్ళు నల్గురూ చెప్పుకోదగ్గ నడివయసులో - అనాస పనసలాటి ఎర్రని, తియ్యని ఆరోగ్యంతో పకడ్బందీగా వున్నారు. లేకపోతే, వాళ్ళు రోదసీ ప్రయాణం ఊసెత్తేవారు కాదేమో!

వాళ్ళు నలుగురూ ఏణ్నర్ధంనించీ- ఒక ఎస్త్రియురూ మకోఆర్నెల్లూ పసుప్పుద్దలాటి చిన్నారి సూర్యుడిచుట్టూ ప్రదక్షిణ చేసే అతి చిన్నారి గ్రహంలోనూ వుంటున్నారు. వాళ్ళు నల్గురూ ఎప్పటికేది కోరితే దాన్ని మన రాబట్ అతి వైదుష్యంగా—మూల ధాతువుల్నించీ, వాయుజలాలనించీ విశ్వామిత్ర సృష్టి చేస్తూ వారి కోరిక లీడేరుస్తున్నాడు, గానీ ఇంతగా అపరసృష్టి చేసిన రాబట్ — వాళ్ళ నలుగురికీ తోడుగా ప్రయాణించిన పురుషపుంగవుల మృతశరీరాల్ని మాత్రం బూజు



పాలే చేసేడు. ఏ పరకాయ ప్రవేశ మంత్రమూ పారలేదు.

ఇంత విశ్వామిత్ర సృష్టి జేసిన రాబట్ కిప్పు డొచ్చిన చిక్కల్లా ఏవిటంటే—ఇప్పుడా 'ఆడ' నలుసులు నలుగురూ ఓ 'నర'పురుగుని సృష్టించమని కోరితే పెదవి విరచాల్సిన పరిస్థితొచ్చిపడింది. తను రోటీన్ పన్లు షెడ్యూల్ టయిమ్‌లో చేసి పారేగల్డు; సూర్యుడిచుట్టూ తిరిగే గ్రహాన్ని జేబులో బొమ్మలాగ తేగల్డుగానీ— మరో మానవమాత్రుణ్ణి సృష్టించటమంటే మాటలతో పనా?! రాబట్‌కి ముఖాముఖీ అర్థింపుల్తో పన్లేదు. ఆ మిస్సమ్మలు నలుగురూ ఏమైనా మాటాడుకుంటున్నప్పుడు.—ఆ మాటల్ని 'టేప్' చేసుకుని ఆటోమేటిగ్గా కామధేనువులా వాళ్ళ కోరికల్ని నెరవేరుస్తుంటాడు.

అలాగే ఓసారి—

"మన 'కంపెనీ'కోసం మరమనిషి (రాబట్) కాకుండా మరో మనిషుంటే బావుణ్ణు!" అని వాళ్ళనుకోగా విని— మన రాబట్ ఒకసారి 'మనిషి'ని సృష్టించడానికి యమ ప్రయత్నం చేసేడుకూడా! ఆ ఆటోమేటిక్ మనిషి అచ్చ మనిషిలాగే పోలివున్నాడు గానీ ఒక్కటే లోపించింది. 'అతన్లో', 'జీవం' అన్నది ఏ కోశానా లేకుండా-త్రీ డైమెన్షనల్గా—చిత్రకారుడు గీసిన

అమూర్త కళా చిత్రంలా వున్నాడు.... వెంటనే ఓ శుభముహూర్తాన ఆ 'మని షి'కి అంత్యక్రియలు కూడా జరిపేసేరు వాళ్ళు నలుగురూ!.

• • •

"అబ్బ, చెడ్డ ఉక్కపోతగా వుంది ....మూడొంతులు వానొస్తుందేమో!" ....అని కన్నొబ మల్నీ - నుదుటిని రుమాల్తో సుతారంగా తుడుచుకుంటూ అంది మోనాదేవి.

పిల్లిలాగ మెల్లిగా చప్పుడు చెయ్యకుండా తన కార్నర్ సీట్నించి కదిలి ద్వారంపైటికి దారితీసేడు రాబట్! ...

రాబట్ని గురించి బీనా వేళా కోళంగా నవ్వుతో — "ఆ ఎమూర్తైనా మూడాపైనా ఇవాళ సాయంకాలం వాన తప్పదు! . వాన రాకుండా చెయ్యడాని కప్పెప్పు మన రాబట్ ఏంజేస్తాడో మనకి సరిగ్గా తెలీదనుకోండి మూడొంతులు సిల్వర్ అయోడైడ్ ప్రయోగిస్తాడేమో?- గానీ ఏదేమైనా సరే, వానమాత్రం గేరంటీ ష్యూర్!!!" అన్చెప్పి ఉద్ఘాటించింది.

ఆ ఉద్ఘాటనకి అనుబంధంగా మిస్ మోహా — "అంతపాటి బాధపడేకన్నా ఈ గదిని ఎయిర్ కండిషన్చేసే పనిడం రాబట్ చేతిలో పనికదా, ఏమంటావ్ మోనీ?!" అని అయాచిత సలహాని అందించింది.

"బౌనౌ. దట్స్ ఎ గుడ్డైడియా, ఇండీడ్!" అంది దీర్ఘాలోచనలోంచి తేరుకున్న సిస్టర్ నివేదితలా మోనాదేవి — "మన మింతకుముందే ఏనాడో రాబట్చేత ఆ పని చేయించాల్సింది సుమీ!"

• • •


మోనాదేవి వాళ్ళుండే హౌసునింకా ఎయిర్ కండిషన్జేయకముందే మరో రోదసీనౌక క్రేష్ అయ్యింది. రగులొక్కన్న రాక్షసి బొగ్గులా పొగలు విరజిమ్మే ఆ చోటికి పరిగెత్తే - ఆ నలుగురు మిస్సమ్మలూ-రాబట్న్నూ.

అదో చిన్న స్పేస్షిప్. దాంట్లో వుండే ఒకే ప్రాణికింకా నూకలు నిండి పోలేదు. ప్రాణాలు నిండుగానే ఉన్నాయి.

"అతను" నిస్పృహలో నిద్ర పోతున్నా బతికేవున్నాడు. అయితే అతను మరమనిషి మాత్రం కాదు; నూటికి నూరుపాళ్ళు నిజమైన మనిషి!

అతన్ని వాళ్ళు నలుగురూ సున్నితంగా అతి సుతారంగా వాళ్ళ హౌసులోకి తీసికెళ్ళి పక్కమీద పడుకో బెట్టేరు. అప్పుడే బైటి ప్రపంచంలోకి ఊడిపడ్డ కోడిపిల్లచుట్టూ తొంగిచూసే కోడిపెట్టల్లా వాళ్ళు నలుగురూ అతని చుట్టూ వొంగొని చూస్తున్నారు.

ఈలోగా "అతని"కి సరిపడే మందుల తయారీలో సతమతమౌతున్నాడు రాబట్.



"అతనెప్పకుండా బతుకుతాడు. రెండు మూడు వారాల్లో బలాన్ని పుంజుకుని ప్రపంచాన్నంతా రింగు రంగామని చుట్టి తిరిగి రాగలడు!" అన్చెప్పి ఆశాభావం వ్యక్తీకరించింది వీనాదేవి. టీనా స్పేస్ నర్స్.

"నిజంగా "మనిషే"నా ఇతను?!" సుమన గొంతు ఉల్లిపొర కాగితంలా గరగర లాడింది భీతాహంతో - కంపనతో! - " మనందరి మొరల్ని విని రాబట్ -, ఇతన్నిక్కడికి తీసుకొని వచ్చుంటాడు!"

"ఇదిగోఅమ్మాయిలూ, మరిప్పుడు నేను చెప్పేది కాస్త చెవులుపెట్టి వింటారా?! ఇప్పు "డితను" -మనకి స్నేహ సౌజన్యాల్ని ప్రసాదించటమే కాకుండా- మరికొన్ని సమస్యలుకూడా తెచ్చిపెడతాడని గ్రహిస్తారనుకుంటాను." అని సైలెంట్ రివాల్వర్లా పేల్చింది మాటల్ని మోనా. ఆ కంఠస్వరంలో పక్కా వ్యాపార దీక్షతనే ముసుగుతో - ఆమె గొంతులో ప్రాణ కుని చాలా మట్టుకు దాచుకుంది. ఆ చిన్నారి గ్రహంలో అంతకు ముందు కనీ వినని "పోటీ" అనే వింత పదార్థం అక్కడ చోటు చేసుకుంది.

"అసలు నీ ఉద్దేశ్యం ఏమిటి కదా!!" నొసలు చిట్లించింది బీనా.

"మోనా భాష్యం కర్థం నాకు బాగా తెల్సు! నే చెప్పనా - మల్లో ఎవర తన్ని కొంగుముడి వేస్కుంటారా అనీ-" మోహన గొంతులో అనుకోకుండానే జెలసీ ప్రతిధ్వనించింది.

వాళ్ళందరికన్నా వయసులో చిన్నదైనా సుమన నోటిని సుతారంగా సున్నాలా చుట్టి భీతహరిణేక్షణలా బెదురు చూపులు చూడసాగింది.

బీనా దేహప్పుడే డెలిరియంలోంచి బైటపడ్డట్టు— "ఆల్రైట్, అయితే బొమ్మా బొరుసా వేసి చూద్దామా? లేక పోతే అతని 'స్వయంవరణ ప్రకారం మనలో ఎవరో ఒకర్ని ఎంచుకోనిద్దామా!! హెడ్ ఎండ్' టెయిల్సా! స్వయంవరమా!! "అన్చెప్పి మిగతా ముగ్గురి మిస్సమ్మల్ని డైలమాలో పడేసింది మోనా.

-"'అతను' ఊపిరి తీసుకునేదాక నైనా మనం నోర్మూసుకుని ఊరుకోలేమా!!-"మీ ఛాటర్ బాక్సుకి కాస్సేపు గాడ్రెజ్ తాళం బిగించండన్నట్టు సలహా ఇచ్చింది చిన్నారి సుమన.

రాబర్ట్ అప్పుడే తయారు చేసిన థర్మామీటర్ని నిస్పృహగా పడివున్న 'అతని' నోట్లోకి దూర్చేడు. పేషంట్ పక్కనే నిశ్చలంగా నిల్చుని పేషంట్‌గా నిరీక్షించసాగేడు రాబర్ట్.

"డియర్ యంగ్‌గాల్ సుమనా, నీ ఉచిత సలహాని పాటించలేక పోతున్నందుకు....ఐ యాం సారీ.... 'అతను, స్పృహలోకి రాకముందే మనం అమీ - తుమీ తేల్చుకుని ఆ విషయాన్ని ఖరారు చేసుకోవాలి! ఎందుకంటే - అందు గురించి ఇక ముందు వాగ్యుద్ధాలు జరగకూడదనీ.." అని ప్రేమ మాగ్నాకార్టా చదివింది మోనా దేవి!

"ఎంచక్కా నే చెప్పినట్టు బొమ్మా - బొరుసా వెయ్యండర్రా-" అంది బీనా,

ఏదో చెప్పబోతున్న సుమన పెదాలికి బాదం ఖీర్లో స్ట్రాలాగ అడ్డు పడింది- మోహన.

"బొమ్మా బొరుసా ఆటలాడుకోడానికి మనమింకా భూప్రపంచమ్మీద వున్నా మనుకున్నారేంటి? మనం 'రోదసి'లో వున్నందుకు కొత్త పద్ధతుల్నే ప్రయోగించాలి. మనందరికీ నచ్చే పరిష్కారమంటూ ఒకటేవుంది. అది....మనందరం ప్లస్ 'అతనూ'—" అని 'వివిధ భారతి'తో ఆడ అనౌన్సర్లా సుతారంగా పలికింది మోహన.

"అంటే ...?" చొప్పదంటు ప్రశ్న వేసింది బీనా.

"అంటే లేదూ - గింటే లేదూ.... పాలిగమీ, ఆఫ్‌కోర్స్ —! మనందరికీ కూడా అతను చెందాలి!"

ఆమాటలకి సుమన తాటాకు పెళ్ళి కూతురి బొమ్మలా రెపరెపలాడినా నిభాయించుకుని గంగిరెద్దులా తలూపేసింది.

"యా, దట్స్ వెల్ ఎజ్, గుడ్. గానీ "సవతి" అనే ఎలిమెంట్ రానీయకూడదు. మొదట్నించి ఆ సంగతతను అర్థం చేసుక్నేట్టు ప్రవర్తించాలి మనం!" అని ప్రతిపాదించింది మోనా దేవి.

పెదాల్ని సుతారంగా వొంకర్లు పోనిస్తూ "యస్. దట్స్ ఫెయిర్! టోనా అయిడియా చాలా బావుంది. నేను మోనాతో ఎగ్రీ ఔతాను. మన నలుగురిచేతా - మన మధ్యే - అతను సమాన ప్రాయాగా విభజింపబడాలి. ఫేవర్ - గీవర్ నై జాంతా!!" అని ధృవపర్చింది బీనా దేవి.

అలా అలా "అతని" గురించి వివరంగా చర్చించుకున్నాక - పోటీ అనే జ్వరమీద ప్రెషర్ కుక్కర్ని దించుకుని - వేడెక్కిన ఎయిర్ కండిషన్డ్, గదుల్లోంచి బైటపడ్డారు - "సప్పర్" కోసం వాళ్ళు నలుగురూ!

• • •

సప్పర తర్వాత మళ్ళీ ఛాంబర్లోకి వచ్చేరు నలుగురూ!.... రాబట్ 'అతని' బెడ్ పక్కనే నిల్చున్నాడు. రాబట్ నున్నని స్టీల్ మొహమ్మీద తెల్లని, ఆరని పింగాణీ చిర్నవ్వు మెరిసిపోతోంది. వాళ్ళ కష్టాలు, కోరికలు తీర్చుకోడానికన్నెప్పి ఆ మిస్సమ్మలు రాబట్కి ప్రత్యేకంగా ఆర్డర్ చెయ్యనఖ్లేదు. ఆ కార్నర్ సీట్లో నిల్చునే సీక్రెట్ ఏజంట్లా వాళ్ళ మాటల్ని 'టేప్' చేసి అతి సైలంట్గా వాటిని నెరవేరుస్తుంటాడు.

ఆ మిస్సమ్మలు నలుగురికీ సమానా ప్రాయాగా — 'అతన్ని' నాలుగు పావు ముక్కలుగా విభజించేడు రాబట్!

నిజానికది రాబట్ అనబడే మర - మనిషి—మరో మనిషికి చేసిన నికార్సయిన సర్జరీ పనికి నిండునిదర్శనం!

•

[ప్రప్రథమ గగన విహారి లేటు యూరీ గగారిన్కీ—, తర్వాత ఆ మధ్య "మర మనిషి" అనే మంచి కథను వ్రాసిన శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావుకీ—కలిపి వొన్ బైటూగా సమర్పితమిది.

—రచయిత]

•••



ఆ పదంతస్తుల భవనం నించి క్రింద ఉన్న మనుష్యులు చిన్న చిన్న బొమ్మల్లా కనపడుతున్నారు వెంకటేశుకి. అందరూ తలలు పైకెత్తి ఏదో ప్రక్క వాళ్ళతో చెప్పుకుపోతున్నారు. రిక్షాలు కార్లు ఆపి కొత్త కొత్త వాళ్ళు తనవైపే చూస్తున్నా . ఆ సందు మొగలో ట్రాఫిక్ అంతా బంద్ అయిపోతోంది. ఆ మనుష్యులు, వాళ్ళ ఆత్రుతం చూస్తే వెంకటేశుకి ఏదో చెప్పరాని ఉత్సాహం కలిగింది.

వాళ్ళంతా తన గురించే మాట్లాడుకుంటున్నారు. తను ఎప్పుడు మేడ మీదనించి కిందికి గెంతుతాడా అని ఆత్రుతతో చూస్తున్నారు. అందులో చాలా మంది ఒక నిండు ప్రాణం తమ కళ్ళముందే పోతుందేమోనని బాధ పడుతూనే ఉంటా . కాని ఆ బాధ వెనకాల ఏదో చెప్పరాని సరదా ఉండడం వల్ల అందరూ కదలకుండా తెలియని ఉత్సాహంతో చూస్తున్నారు.

వెంకటేశుకి వాళ్ళని చూస్తుంటే ఒక కొత్త ప్రపంచంలో ఉన్నట్టుంది.

వాళ్ళంతా ప్రాణం ఉన్న మనుష్యులు కాని తను ఇప్పుడు ఆత్మహత్య చేసుకోడానికి సిద్ధంగా ఉన్నాడు. వాళ్ళు వేరు తను వేరు అని భావం కలిగి తనే వాళ్ళకంటె చాల గొప్పవాడినయ్యాను అని అనుకున్నాడు వెంకటేశు. ఆ భవనం ప్రక్కని పోలీసు ఠాణాలోంచి ఒక ఇన్‌స్పెక్టర్, నలుగురు పోలీసులు కంగారుగా పరిగెత్తుకుని మేడలోకి వస్తున్నారు.

వెంకటేశుకి సరదా వేసింది. ఇప్పుడు వాళ్ళు తన దగ్గరికి వస్తారు. తనని ఆదిస్తారు. బ్రతిమాలతారు. ఆత్మహత్య పాపం అంటారు. నేరం అంటారు. కాని తను మాత్రం తను ఇక్కడికి వచ్చినపని చెయ్యందే కదలకూడదని నిశ్చయించుకున్నాడు.

పోలీసు బలగం అంతా ఆఖరి అంతస్తు చేరింది. కిటికీలోంచి తను అందుతాడేమో అని చేతులు చాచి ప్రయత్నిస్తున్నారు పోలీసులు. కాని లాభంలేదు. సన్నటి చిన్న వరండాలో రెండు కిటికీలమధ్య తను నిల్చుందికి కాక ప్రయత్నిస్తే ఇంకొక మనిషికి మాత్రం చోటుంటుంది.

పాపం! ఆ ఆఫీసు మేనేజరు వెర్రి మొహం పెట్టుకుని ఇన్‌స్పెక్టర్‌కి సంజాయిషీ చెప్పుకుంటున్నాడు. ఆయన వెంకటేశుని ఎప్పుడూ చూడలేదుట వాళ్ళ ఆఫీసులో పనిచేయడట. ఎలా వచ్చాడో కూడా తెలియదట. ఎవరూ చూడకుండావచ్చి వాళ్ళపరువు, ప్రతిష్ఠ తీయడానికి ఇక్కడ చేరేడు అని గోల పెడుతున్నాడు. ఇన్‌స్పెక్టరని తోసుకుని ముందుకువచ్చి వెంకటేశుని బతిమాలుకున్నాడు. వెంకటేశుకి ఏం కష్టమున్నా తన చేతిలో ఉన్నదంతా చేస్తానన్నాడు. ఉద్యోగం ఇస్తానన్నాడు. డబ్బు ఇస్తానన్నాడు. ఏమి కావాలన్నా చేస్తానన్నాడు. ఇక్కడ అనవసరంగా చచ్చిపోవద్దు మొర్రో అని బతిమాలుకున్నాడు.


ఇంతలో ఒక పోలీసు తెగించి మెల్లిగా దిగి ఎలాగేనా వెంకటేశుని పట్టుకుని తీసుకువస్తానన్నాడు. కాని వెంకటేశుని ఖచ్చితంగా హెచ్చరించాడు. ఎవరేనా కిటికీలోంచి దిగే ప్రయత్నంచేస్తే, తక్షణం తను ఉరికేస్తానని.


ఎవరికీ ఏమీ తోచటంలేదు. కింద జనం ఎక్కువయిపోతున్నారు. పైన మేనేజరు జుట్టుపీక్కుంటున్నాడు, ఏంబ్యులెన్సు, ఫస్ట్‌ఎయిడు ఏర్పాట్లు జరుగుతున్నాయి,

అంతదాకా మాట్లాడకుండా ఉన్న ఇన్‌స్పెక్టర్ ముందుకు వచ్చాడు. "చూడు బ్రదర్, ఎందుకొచ్చిన గొడవ ఇదంతా"

"నాకు చావాలనిఉంది. చస్తున్నాను.

వై. లలితా విశ్వనాథ్
బి. ఏ.


ఇప్పుడు సఖులలో శ్రీమంత
శృంగార తిలకం లక్స్



నీకు ఎందుకు సంజాయిషీ చెప్పుకోవాలి."

"అదే! అంత చావాలనే అవసరం ఏం వచ్చింది? నీకు పెళ్ళాం, బిడ్డలు, సంసారం ఎవరూ లేరా?"

"ఈవేళ ఎవరూ లేరు."

ఆ మాట అంటుంటే వెంకటేశుకి పెదాలు వణికాయి. అవును. ఇప్పుడు ఎవరూలేరు. పదిరోజుల క్రితందాకా ఒకే ఒక చెల్లెలుండేది. ఆమెను చదివించాలని, పెద్ద కుటుంబంలో పెళ్ళి చేయాలని తను పది ఏళ్ళుగా ఈ పట్నంలో నానా అవస్థలుపడి సంపాదించి, హాస్టలులోఉన్న చెల్లెలుకి పంపించేవాడు. వారం రోజుల క్రితం ఆ చెల్లెలు దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

"అన్నయ్యా, నువ్వునామీద అనేక ఆశలు పెట్టుకున్నావు. కాని నేను నిర్భాగ్యురాలిని. నువ్వు రెక్కలకష్టం మీద సంపాదించి పంపిన డబ్బుతో జాగ్రత్తగా చదువుకుంటూ ఉంటే నాకెంతో హాయిగా ఉండేది. కాని నా ఖర్మ వశాత్తు ఒకరిచే వంచింపబడ్డాను. చిన్నతనం నించి నేను తల్లి దండ్రుల నెరుగను. నువ్వేనాకన్నీ అయినప్పుడు ఈ విషయం నీ దగ్గర చెప్పకుండా చావలేను. నన్ను ఎవరు మోసగించేరో ఆయన నెలరోజుల క్రితం నీవు ఉన్న ఊరికే బదిలీఅయి వచ్చారు. నేను

గర్భవతినై, ఆయన్ని వెతుక్కుంటూ మీ ఊరు చేరుకునే సరికి, ఆయన వివాహితుడు, ఇద్దరు పిల్లల తండ్రి అని తెలిసినది. ఇందులో ఎవరిని నిందించి ఏమి లాభం? ఈ ఉత్తరం నీకు అందేసరికి నేను ప్రాణాలతో ఉండను. ఆయన పేరు ………… ఉద్యోగము ……… ఎడ్రసు ……….."

ఇట్లు అభాగిని,
నీ చెల్లెలు శాంత."

ఈ ఆలోచనల్లో వెంకటేశుకి తల తిరిగినట్టయింది. ఆ ఇన్‌స్పెక్టర్ మెల్లగా సిగరెట్టు కాలుస్తూ వెంకటేశుని గమనిస్తున్నాడు.

"చూడు అబ్బాయి, నా మాటవిని ఒక పని చెయ్యి. ఈ క్రింది జనాన్ని చూడు. వాళ్ళంతా ఎందుకు నిలబడ్డారను కుంటున్నావు? నువ్వు కిందకి గెంతి చస్తే చూసి ఆనందిద్దామను కుంటున్నారు. ఆ వెధవ లందర్నీ సంతోషపెట్టడానికా నువ్వు ప్రాణం తీసుకునేది? నా మాట విని లోపలికొచ్చెయ్యి. ఇంతసేపూ సరదాగా కనిపెట్టుకున్న వీళ్ళంతా వెర్రి మొహాలేస్తారు. వీళ్ళని ఏడిపించడానికేనా ఈ మాటుకి లోపల కొచ్చెయ్యి. ఏమంటావు?"

"అంతేనంటారా? చూడండి! ఎంత మంది జనం పోగయ్యేరో. మీరు చెప్పింది నిజమే! అందర్నీ ప్రాణాలు తీసుకునేదాకా కష్టపెట్టే వాళ్ళు వీళ్ళే. ఆ మనిషి చస్తూంటే చూసి సంతోషించే వాళ్ళు వీళ్ళే. అందుకని నేను చావదలుచుకోలేదు."

"అది. అలా వుండాలి. మరి పైకిరా."

"కొద్దిగా కళ్ళు తిరుగుతున్నాయి. కొంచెం చెయ్యి అందించండి."

మెల్లగా ఇన్‌స్పెక్టర్ కిటికీలోంచి దిగాడు. ఇన్‌స్పెక్టర్ జాగ్రత్తగా మాట్లాడి, ఈ మనిషిని రక్షించాడని జనం చప్పట్లు కొడుతున్నారు. పేపరు వాళ్ళు కెమేరాలు నొక్కుతున్నారు. ధైర్యసాహసాలకి ప్రెసిడెంటు మెడల్ తనకి అప్పుడే వచ్చినట్టు ఇన్‌స్పెక్టర్ గర్వంగాపోజు పెడుతున్నాడు.

ఇన్‌స్పెక్టర్ వెంకటేశు చెయ్యి పట్టుకున్నాడు. వెంకటేశు గట్టిగా పిడికిలి బిగించాడు.

"ఇన్‌స్పెక్టర్ శేఖరంగారూ, నా పేరు వెంకటేశు. వారం రోజులక్రితం ఆత్మహత్య చేసుకున్న శాంత నా చెల్లెలు."

ఇన్‌స్పెక్టర్ నిర్ఘాంతపోయి చెయ్యి విదిలించుకోబోయాడు. కాని ఆ పది అంతస్థుల ఎత్తులో నించి కింద పడేదాకా అతనికి తెలిసినది తనతోపాటు ఉన్న వెంకటేశు ……. అతని గట్టి పిడికిలి.

(ఒక ఇంగ్లీషు కథ ఆధారంగా)

***

ఖరీదైన కల

'సుమన్'

ఇహ నిలబడ దలచుకోలేదు.

విసుగు కల్గసాగింది. కాని నిలబడక తప్పదు. ఎందుకంటే సోమసుందరం గారు యింకా రాలేదు.

గడియారం వంక చూశాను.

దుమ్ము కొట్టుకుపోయి గీతలుపడి పగిలిన అద్దంలోనుంచి వంకరలు తిరిగిన పెద్దముల్లు, చిన్నముల్లు నాలుగ యింద ఎల్లు చూపిస్తున్నాయి.

అంటే ఐదయిందన్నమాట.

కాలానికి నా గడియారం ఓగంట వెనుకబడే వుంటుంది.

నా గడియారంలో యింకో విశేషం వుంది. అప్పుడప్పుడు చిన్నముల్లు రెండు మూడు రోజులవరకు వీలుగా వుంటే యింకా ఎక్కువగాను ఒకేచోట ఆగిపోతుంది. పెద్దముల్లు మాత్రం గానుగ ఎద్దులా తాను ఒక్కటే ఆవర్తులాకార ప్రపంచానికి చక్రవర్తి అన్నట్లుగా తిరుగుతూ వుంటుంది.

ఒక్కొక్కసారి పెద్దముల్లు విశ్రాంతి తీసుకొంటూ వుంటే చిన్నముల్లు తిరుగుతూ వుంటుంది.

రోడ్డుమీదకు చూశాను. సోమసుందరం గారి కారుకూడా ఎక్కడా కనిపించుటలేదు.

రోజూ యిదే వేళలో ఆ పెద్ద హోటలుకు ఆయన కాఫీకి వస్తారు. యిక్కడ తప్ప ఆయన్ని యింకా ఎక్కడా కలుసుకోలేరని చాలామంది చెప్పారు.

చాలసార్లు ఆయన ఇంటికి వెళ్ళాను. గూర్ఖా అదిలింపులు, అల్సేషియన్ అరుపులు తప్ప నాకు ఆయనతో యింటర్వ్యూ దొరకలేదు.

పోనీ యిప్పుడైనా కారులోనుంచి దిగి హోటలులో పాలరాయిమీద కుడికాలు పెట్టేలోపల ఆయన వెంట నడుస్తూ నా నిరుద్యోగాన్ని గురించి, నా దరిద్రాన్ని గురించి చెప్పుకోవాలి. ఆయన నావంక చూడకుండానే, వినీ

వినకుండానే హోటల్‌లోకి బంగారపు సూటిలోకి వెళ్ళే గోరువంకలా వుంటాడు. ఆ హోటల్‌లోకి వెళ్ళా లంటే నా నియద్యోగం క్వాలిఫికేషన్ పనికిరాదు. ఎట్‌లీస్ట్ ఓ ఎంబాసిడర్, షెర్లిను సూట్స్ వుండాలి.

విసుగుతు అతి నేర్పుగా ఈ బక్క శరీరంలోకి త్రొక్కి ఏమీ తోచక ఆకాశంవంక చూశాను. నల్లటి మేఘాలు ఒకదాని కొకటి ఆకలితో కౌగలించు కొంటున్నాయి. మేఘాల లోని నలుపు నాకు కొందరి మనుషుల లోను, కొన్ని గుండెలలోను కనబడు తుంది.

కౌగలించుకున్న మేఘాలు అరవ టం ప్రారంభించాయి. సంతోషంగా వస్తున్న గాలి కెరటం రోడ్డుమీద దుమ్మును ఎత్తి నామీద, నా చుట్టూవున్న వాళ్ళమీద పోసింది. ఆ దుమ్మును దులు పుకొనే లోపలే వర్షం కురవటం ప్రారంభించింది.

అంతవరకు మనుషులు నన్ను తోసుకొంటూ బిలా బిలా హోటల్‌కి ఆనుకుని వ్రేలాడుతున్న రేకుల షెడ్డు క్రిందకు చేరారు. నేను నడిచి దాని క్రిందకు వెళ్ళలేదు. వాళ్ళే నన్ను తోసు కొని అక్కడ నిలబెట్టారు.

నా చుట్టూ చాలమంది వున్నారు. అడుక్కు తినేవాళ్ళు, బీదవాళ్ళు, ముసలివాళ్ళు, రిక్షాలు లాగేవాళ్ళు, టాక్సీడ్రైవర్లు.

నైలెక్స్ చీరలో ఒళ్ళు దాచుకున్న భారతదేశపు దరిద్ర దేవత అవయవాల వాళ్ళు.

వర్షం వేగంగా కురుస్తోంది. రోడ్డు మీద చినుకులు ఎగిరి మామీద పడ్తు న్నాయి. ఎవరికివాళ్ళే వాటినుంచి తప్పు కోవాలని చూస్తున్నారు.

మళ్ళా రోడ్డుమీదకు చూశాను. నీలి రంగు ప్లిమత్ నీళ్ళను చిమ్ముకుంటూ వస్తోంది. అది ఖచ్చితంగా సోమసుంద రంగారిదే. వాళ్ళందరినీ తోసుకొని ముందుకు వచ్చి నిలబడ్డాను. వాళ్ళను అలా తోసినందుకు కోపంగా నావంక చూశారు.

అలాగే చూస్తారు వెధవలు. ఇపుడు ఆ కారులో దిగే మనిషితో మాట్లాడితే అసూయతో ఏడుస్తారు కూడా.

కారు వచ్చి ఆగింది. డోర్ తెరుచుకుంది. నేను హోటలు మెట్ల మీదకు వెళ్ళి నిలబడ్డాను.

డోరు తెరుచుకొని ఓ అందమైన యువతి బయటకు వచ్చింది. తలమీద వానచినుకులు పడకుండా 'మేగజైన్' అడ్డుగా పెట్టుకుంది.

కాని సోమసుంధరంగారు ఏడి? నాలో ఉత్సాహం ఆవిరి అయిపోయింది. యిక రాడేమో....

మరొకసారి ఆమెను చూశాను. అంత చలిలోనూ నరాలు జివ్వు మన్నాయి. చక్కటి షిఫాన్ ఫాషన్‌గా ధరించింది. అదేరంగు స్లీవ్‌లెస్‌బ్లౌజు





వేసుకుంది. వెనుక నాలుగు బటన్సు తళుక్కున మెరుస్తున్నాయి. లోపల అరంగుళం వెడల్పు వున్న బ్రా అగు పించుతోంది. ముఖం గుండ్రంగా వుంది. కళ్ళు చేపకళ్ళులా మిలమిల మెరుస్తున్నాయి. ఎర్రటి పెదవులు....

మంచుతో తడిసిన ఎర్ర గులాబిలా వుంది.

ఈమె ఏ సినిమాస్టారో అయి వుంటుంది. లేదా ఈ మద్రాసులో నగ మైనా వెడల్పు గల్గిన యునప్పెట్టె వున్నవాడి ఏకైక పుత్రికా రత్నం అయి వుంటుంది.

ఆమె నడుస్తూవుంటే ఎగుడు దిగుడు లేని నున్నని నేనుము పచ్చి వెనుదు చుట్టలా వూగుతోంది.

నాతో అవాక వేడి ...అ దొక థ్రిల్ ....ఆమె నా ముందే ఇంకొంచెం సేపు వుంటే ఎంత బాగుండును? ఆమె చీరని, ఆమె బ్లౌజుని, ఆమె కళ్ళని, ఆమె పెదవుల్ని, ఆమె బుగ్గన్ని ఎక్సరే కళ్ళతో చూడవచ్చు.

నా చూపులు అకస్మాత్తుగా తివాచీ మీద పడ్డాయి. పసుపు పచ్చటి మనీ బేగ్ మెరుస్తోంది ఎర్రటి తివాచీమీద.

ఆమె చకచక నడచి వెళ్తోంది.

దూకినంత వేగంగా వెళ్ళి బేగ్‌ని తీశాను.

"మేడమ్"

ఆమె వెనక్కి తిరిగింది. తడిసిన కనురెప్పలను ఏమిటన్నట్లుగా ఆడిం చింది. అవి గులాబిరేకులలా కదిలాయి.

"మీ బేగ్" చేతి కందించాను.

"థాంక్సు" అంది అందుకుంటూ.

ఆమె కళ్ళల్లోకి చూడసాగాను. నా గుండెలలో ఏదో లావా పొంగు తోంది. ఆమె వెళ్ళిపోకుండా చాలాసేపు నాముందే నిలబడితే ఎంతబాగుండును.

"కాఫీ త్రాగుదాం రండి"

మొదట నా చెవులను నేను నమ్మ లేను. ఆమె మరోసారి పిలిచేసరికి ఆమెను వెంబడించాను.

బిస్కట్లను చూసి ఎంటబడే కుక్క పిల్లలా వెంటబడ్డాను. ఇంతకుముందు యింత ఖరీదైన హోటలులో అడుగు పెడతానని అనుకోలేదు. ఆ అర్హత నాకు లేదనుకున్నాను. కాని ...

ఇద్దరం స్పెషల్ రూంలో కూర్చున్నాం. అది ఎయిర్‌కండిషన్డ్. చాల వెచ్చగా వుంది. ఆడదాని ఒళ్ళు కంటె, నా ఆలోచన కంటె కూడ వెచ్చగా వుంది.

సోఫాసెట్, మధ్యలో రౌండ్ టీపాయ్. టీపాయ్ మీద ఫ్లవర్ వేజు. అందులో ప్లాస్టిక్ పూల గుత్తులు వున్నాయి.

ఆమె నా ఎదురుగా సోఫాలో శరీ రాన్ని నిర్లక్ష్యంగా వదిలి "మీది మద్రాసేనా?" అంది.

నేను తడుముకోక తప్పలేదు. ఇంత వెచ్చని గదిలో యింత అందమైన ఆడదాని ముందు నలిగిపోయి చెమట వాసన వచ్చే జీరైన పుటలను వ్ప దలచుకోలేదు. ఆ పుటలలో వున్న కుళ్ళును చూసి ఆమె ఏవగించుకొని

కాఫీ అవకాశంకూడా యివ్వకుండా బోయ్‌ని పిలచి బయటకు గెంటించ వచ్చు.

"కాదు. విజయవాడ నుంచి వచ్చాను." అన్నాను.

"ఎందుకు?" సూటిగా అడిగింది ప్రశ్న.

అద్దంవంటి ఆమె చెక్కిళ్ళకేసి చూస్తూ అన్నాను. "మా నాన్న కావలసినంత డబ్బు వదలి చెప్పకుండా చచ్చిపోయాడు. దానిని ఖర్చు పెట్టటానికి నానా యిబ్బందులు పడుతున్నాను. ఇక్కడ ఫిల్మ్‌నగరలుని ఓసారి చూసి పోదామని వచ్చాను."

ఆమె కళ్ళల్లో కొంచెం ఆశ్చర్యం చోటు చేసుకొంది. "ఏమైనా సినిమా తీస్తారా?" అంది కళ్ళు పెద్దవి చేసి.

"అబ్బే అటువంటి కళాసేవ చేయాలనే దురుద్దేశం లేదు. వూరికే కాలక్షేపం కోసం వచ్చాను."

"అయితే రెసిడెన్స్ ఎక్కడ?"

"కన్నెమరాలో"

ఈసారి ఆమె మాట్లాడటానికి నాలుగు నిమిషాలు పట్టింది. ఈ నాలుగు నిమిషాలలో ఆమె నన్ను బంగారు తేపుతో కొలుస్తోంది. నా ఆదాయం ఎట్‌లీస్ట్ రోజుకి ఓ వెయ్యి రూపాయలన్నా వుండి వుండాలని తూస్తూవుంది.

బోయ్ వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. ఆమె ఏవేవో చెప్పింది. అవి ముందు పెట్టి వాడు వెళ్ళి ఓ ప్రక్కన నిలబడ్డాడు.

ఆమె టిఫిన్ చాల వయ్యారంగా తింటోంది. తను అందంగా నైస్‌గా తినగలనని చూపటానికి ఎక్కువ ప్రయత్నం చేస్తుంది.

ఆమెలోకి చూస్తూ అన్నాను. "మీ పేరు?"

"నీలవేణి"

"ఏం చేస్తుంటారు?"

"జీవితాన్ని హాబీగా గడిపేస్తూ వుంటాను. డాడీకి కావలసినంత డబ్బు వుంది. నేను ఒక్కదాన్నే కూతుర్ని. మేము ఎప్పుడో యిక్కడకు వచ్చి స్థిరపడిపోయాము."

"ఐసీ" అన్నాను ఆమెవంక క్రీగంట చూస్తూ. ఆమె నా చూపులో చూపు కలిపి వ్రాతతల దించుకుంది.

చాలసేపటివరకు మా యిద్దరిమధ్యా మాటలు లేవు. కొంచెం సేపు గడచిన తర్వాత కాఫీ సిప్ చేస్తూ వుంది. "పోనీ, యిక్కడున్నన్నాళ్ళు మా గెస్ట్‌హౌస్‌లో వుండకూడదూ?"

నన్ను కొలటం పూర్తయి వుంటుంది. సరైన ఆన్సర్ సంపాదించటానికి గ్రాపు గిస్తోంది. ఆ గళ్ళ వెంట నేను వెళ్ళి. ...కాని.

"థాంక్స్ .కాని అంత యిబ్బంది పడలేను. హోటలు అంటే అత్తవారిల్లో సమానం."

ఆమె గలగల నవ్వింది. ఆనవ్వులో కూడా క్రొత్తదనం తీసుకురావటానికి నీలవేణి ఎంతో ప్రయత్నించింది.

ఆమె కాఫీ సిప్ చేస్తూ మా

మాటకి నావంక చూస్తోంది. క్రింది పెదవిని మాట మాటకి చప్పరించు తోంది. బహుశా క్రింద పెదవి మరింత ఎరుపుగా కనపడాలని ప్రయత్నం కాబోలు.

"ఈ వర్షం అంటే నాకు చాల చిరాకు. ఒక్కొక్కసారి ఏడుపుకూడ వస్తోంది" అంది నీలవేణి.

"నాకూ అంతే. వర్షం కురుస్తూ వుంటే ఏమీ సంతోషం వుండదు. మనిద్దరిది దగ్గర మెంటాలిటీ."

"అఫ్‌కోర్సు" కొంచెంసేపు ఆగి మళ్ళా అంది. "మొన్న అక్టోబరులో వాషింగ్టను వెళ్ళినపుడు యింతే. స్నోఫాల్ అయింది. యింత దూరం ఎందుకు వచ్చామా అని విసుగుగల్గింది. విసుగంటే డాడీ వూరుకోడు....సరేగాని మీరు ఫారెను వెళ్ళారా?"

రెండు చేతుల వ్రేళ్ళను ఒకచోట చేర్చి గడ్డంక్రింద పెట్టి కాళ్ళాడించు తోంది నావంక చూస్తూ. నేను ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాను." పాస్ పోర్టు కోసం అప్లయి చేశాను. ఓ నెల రోజులలో ఫారిన్ వెళ్ళాలను కుంటున్నాను. మీ డాడీ ఏం చేస్తాడు?"

"ఆయన ఓ పెద్ద కేపిటలిస్టు. బ్లాక్ అండ్ వైట్ మార్కెటులో వ్యాపారం" అంది నీలవేణి నవ్వుతూ.

"మా నాన్న అంతే. ఆయన చచ్చి పోయిన తర్వాత ఆస్తి, బిజినెస్ ఒక రూపానికి తీసుకువచ్చేసరికి బంగాళా ఖాతం ఈదినట్లయింది."

నీలవేణి చిరునవ్వు నవ్వుకుంది. ఈసారి నవ్వులో ఎక్కువ కాంతి లేదు.

నేను ఆలోచించ సాగాను.

కొంచెం సేపు నేనూ, నీలవేణి కూర్చున్న గదికి నా జీవితంలో ఓ చారిత్రాత్మక విలువ వుంటుంది. ఈ పాలరాయిలాంటి గోడలు-ఫోమ్ సోఫాలు క్రింద పరచిన కార్పెట్, ఎయిర్ కండిషనర్ వీటిని నేను జన్మలో మరువలేను. ఇవన్నీ నా జీవితానికి పెంటు పులిమాయి. కొంచెంసేపు నన్ను యిరుకుగావున్న ఆకాశంలో విహరించేట్లుగా చేశాయి.

"మీ రెప్పుడైనా తాజ్ మహల్ చూశారా?" అడిగింది నీలవేణి. ఆమె ఎందుకడిగిందో నాకు తెలుసు. తను యింకా దగ్గర కావటానికి నాకున్న అర్హత లేవో తెలుసుకొంటోంది.


"పున్నమి వెన్నెలలో చూశాను. కాని, విచారపడ్డాను."

"ఎందుకని?" కుతూహలంగా అడిదింది నీలవేణి.

"తాజ్‌మహల్ కట్టినవాళ్ళు ఎక్కడా కనపడలేదు."

"వాళ్ళెప్పుడో చచ్చి పోయారని డాడీ చెప్తూ వుంటాడు. అయితే మీరు శ్రీ శ్రీ పుస్తకాలు చదివారన్నమాట."

"నేనసలు తెలుగు పుస్తకాలు చదువను. తెలుగు సినిమాలు చూడనని ఒట్టు వేసుకున్నాను. వర్డ్స్‌వర్త్, కీట్సు, జాన్‌డాన్, మామ్, గార్డినర్, మొలా,



వియా, గోక్కలంటే నాకు చాల యిష్టం."

"పుస్తకాలు చదవటం మీ హాబీ అన్నమాట."

"బొమ్మలు గీయటం కూడ."

మీరు బొమ్మలు గీస్తారా ?

"ఆ....మిమ్మల్ని చూసిన తర్వాత అన్పించింది."

ఆమె సిగ్గుపడి అందంగా నవ్వి "యూ సిల్లీ"....అంది

నీలవేణి యిపుడు నావంక నిండుగా చూసి తర్వాత ఏమీ తెలియనట్లుగా సోఫాలవంక గోడలవంక చూడ సాగింది.

నీలవేణి కళ్ళలో ఒకరకమైన అసంతృప్తి, భయం కనబడుతున్నాయి నాకు.

నేను లేచాను. నా వెనుకే నీలవేణి వచ్చింది. తనే బలవంతంగా కౌంటర్‌లో బిల్లు చెల్లించింది.

బయట వర్షం యింకా తగ్గలేదు. జోరుగా కురుస్తోంది,

"ఈ వర్షంలో మీరు ఎలా వెళ్తారు. కారులో లిఫ్ట్ యిస్తానురండి."

"థాంక్సు. కాని చాల పనులున్నాయి. రేపు కలుసుకుందాము."

"ఎక్కడ?" చటుక్కున అడిగింది.

వర్షం తగ్గిపోతే మోనాలో"

"నో. రేపు మార్నింగ్ కన్నెమరాకు వస్తాను."

నేను అలూపాను. కారు స్టార్టు చేసుకొని వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ చాల దూరంవరకు చేయి వూపుతూనే వుంది.

తరువాత అటు ఇటు చూశాను. కొన్ని జతల కళ్ళు నావంక అసూయగా చూస్తున్నాయి. వాళ్ళవంక యిపుడు చూడదలచుకోలేదు.

కాని, సోమసుందరంగారు....ఛత్ ఆయన ఆలోచన కూడ యిపుడు అక్కరలేదు.

మెదడు చాల వేడిగా వుంది. శరీరం పువ్వులమీద పడుకొని లేచినంత హాయిగా వుంది. మనసు గువ్వలా ఆకాశంలో తేలిపోతోంది.

ఇక అక్కడ వుండాలనిపించలేదు. ఆ వర్షంలో తడుస్తూ నా అద్దె గదికి చేరాను.

* * *

టాక్సీ బాణంలా దూసుకుని వెళ్ళి గేటులో ఆగింది. మీటరు చూసి అద్దె యిచ్చి నడవసాగాను.

గూర్ఖా వంగి వంగి నమస్కారాలు పెట్టాడు. వాడిని చూసి చూడనట్టుగానే ముందుకు వెళ్ళసాగాను. ఆల్సేషియన్ పెంపుడిదిలా నా వెంట బడుతూ, ఎగురుతూ, నా చేతిని నాకుతూ వస్తోంది. దానిని విదలించి కొట్టాను. అది ఏడుస్తున్నట్లుగా కూస్తూ పారిపోయింది.

ఇంద్రభవనంలాంటి భవనం వైపు చూస్తూ ఆలోచిస్తున్నాను.

కారిడార్‌లో ఎదురయ్యారు సోమసుందరంగారు.

"హల్లో, హార్టిలీ వెల్‌కమ్ - నీలూ చెప్పింది నీ గురించి. రా కూర్చో."

ఆయన ఎదురుగా సోఫాలో కూర్చున్నాను. పనిమనిషికి కాఫీలు తెమ్మని చెప్పి సోమసుందరంగారు నా ఎదురుగా కూర్చున్నారు.

నా కళ్ళు నీలవేణి కోసం వెతకసాగాయి. నాతో రావటానికి ఏ చీర కట్టుకుంటే బాగుంటుందో ఆలోచించుతూ వుంటుంది. ఆమె రాక కోసం మెట్లవంక చూడసాగాను.

"నీలూ స్నానం చేస్తుంది. ఇపుడే వస్తుంది. ఆ-ఏమిటి కబుర్లు? కన్నెమరాలో బాగా వుంటోందా?"

"ఏమున్నాయి. మీరే చెప్పండి. చాల హాయిగా వుంటోంది."

"అమ్మాయి అన్ని విషయాలు నిన్ను గురించి చెప్పింది. అవన్నీ విన్న తర్వాత నిన్ను చూడకుండానే నాకు కొన్ని అభిప్రాయాలు ఏర్పడిపోయాయి. చూసిన తర్వాత అవి స్థిరపడిపోయాయి. కాని నీ విషయంలో ఒకటి నచ్చలేదోయ్."

"ఏమిటండీ?"

"మేము యిక్కడ వుండగా, నువ్వు హోటల్‌లో వుండటం. ఇక్కడ నీకు ఏ లోటూ రానియ్యము. సాయంత్రం వచ్చేయవోయ్."

"ఎందుకులెండి."

"అదే నాకు నచ్చదు. ఆ ఆన్నట్లు పొరుగుచోటునుంచి వచ్చావు. ఏమైనా డబ్బు కావాలి స్తే అడుగు. సిగ్గుపడకు."

"అలాగే."

నీలవేణి వచ్చింది. వస్తూనే కాఫీలు పట్టుకువచ్చి టీపాయ్ మీద పెట్టింది. సోమసుందరంగారు అన్నాడు. "నాకు చాల పనులున్నాయి. కంపెనీకి ఫోన్ చేయాలి. మీరు మాట్లాడు కొంటూ వుండండి."

ఆ మన వెళ్ళిపోయాడు.

నీలవేణి ఎదురుగా కూర్చుని కాఫీలో పంచదార కలువుతోంది. తెల్లగా పొడవుగా వ్రేళ్లు ఒణుకుతున్నాయి.

కాఫీ సిప్ చేస్తూ ఆమె కళ్ళల్లోకి చూశాను. సిగ్గు రంగు వేసుకున్న మొగ్గలా వున్నాయి. నిన్నటి గంభీరత చంచలత్వం యిపుడు ఆ కళ్ళల్లోలేవు. స్నిగ్ధత్వం కొట్టవచ్చినట్లు కనబడు తోంది.

"మాట్లాడవేం?" అడిగాను.

"ఏం మాట్లాడను?" సన్నగా అంది చిరునవ్వు నవ్వుతూ.

"ఇక్కడ మాట్లాడలేవు. ఎటైనా పోదాం పద."

"పదీ" అంది నీలవేణి.

కొన్ని క్షణాలలో నీలవేణి నడుపు తున్న కారులో నేను ఫ్రంట్ సీటులో వున్నాను. కారు రోడ్డుమీద వేగంగా వెళ్తోంది

సఫైరేలో ఇంగ్లీషు పిక్చరు చూసి బయటకు వచ్చాము. మౌంటురోడ్డు మీద కారులు చీమల మాదిరిగా పోతు న్నాయి. రెండున్నర గంటలు ఎయిర్ కూలర్లో వుండటంవలన చలి చలిగా వుంది బయటకు వచ్చిన తర్వాతకూడ. నా ఎడమ చేతిని తన కుడిచేతిలోకి తీసుకొని నొక్కుతూ "ఎక్కడికి పోదాం?" అంది నీలవేణి.

"ఎటైనా దూరంగా పోయి ఒంట రిగా కూర్చుందాం."

కారు స్టార్టు చేసింది నీలవేణి. నేను ఆమె ప్రక్కనే కూర్చున్నాను. రోడ్డు మీద మా కారు చీమలలో కలసి పోయింది. ఎత్తైన మేడలు కదలి పోతున్నాయి. యల్.ఐ.సి., స్పెన్సర్ అన్నీ దాటిపోతున్నాయి.

నాకు ఎంతో హాయిగా వుంది. ఎపుడూ యిలా వుంటే చాలు. నీలవేణి దయ నామీద వున్నంత కాలం నాకేమీ అక్కర్లేదు.

నా వంక చూసుకున్నాను. నా వేషా నికి నాకే ఆశ్చర్యం వేసింది. ఖరీదైన సూటూ, జేబునిండా డబ్బు, గాగుల్స్, బూటు....

మధ్య మధ్య నీలవేణి నా వంక, నా వేషం వంక దాహంతో చూస్తోంది. నాలుక తడుపుకొంటూ వుంది. ఆమె కారుని డ్రైవ్ చేస్తూనే కావాలని నామీద పడుతోంది.

ఇపుడు ఆమెకు నాకు ఎటువంటి దూరం లేదు.

కొన్ని నిమిషాలలో ప్రెసిడెన్సీ

మలుపు తిరిగి కారు మెరినాలో ఆగింది. లాక్‌చేసి చాల దూరం యిసుకలో నడుచుకొంటూ వెళ్ళాము. నీలవేణి చేయి పుచ్చుకొని యిసుకలో బూటు వేసుకొని నడవటంలో అదొక ఆనందం.

మనుషులకు చాల దూరంగా కూర్చున్నాము.

వెన్నెల ఒళ్ళు తెల్లబడింది. తెల్లబడిన ఒళ్ళుక్రింద అలలు నలిగి మెరుస్తున్నాయి. చిక్కటి నీలిసముద్రంమీద పలుచటి తెలుపు వెన్నెల వింత సమ్మేళనం.

కొంచెం సేపు యిద్దరం ఏమీ మాట్లాడలేదు. సముద్రంవంక చూస్తూ కూర్చున్నాము.

"ఏమైనా కబుర్లు చెప్పు" అడిగింది నీలవేణి.

"నువ్వు చెప్పు" అన్నాను.

"పిక్చర్ చాల బాగుంది."

ఎందుకందో నాకు తెలుసు. సినిమాలో హీరో హీరోయిన్‌లు ఒళ్ళు మరచిపోయి కౌగలించుకునే టపుడు నీలవేణి మత్తుగా నావంక చూసింది. నా మీద చేతులు వేసి నిమిరింది. తన ముఖాన్ని నా భుజానికేసి రుద్దింది.

యిప్పుడు ఆ విషయం గుర్తు చేస్తోంది.

"సినిమాకన్న థియేటర్‌లో నువ్వే బాగున్నావు."

"నువ్వు సినిమా చూడలేదా?"

"చూడలేదు. నీవంకే చూస్తూ కూర్చున్నాను."

నీలవేణి సిగ్గుపడింది. ముఖాన్ని చేతులలో కప్పుకొని వేళ్ళ సందుల్లోంచి నవ్వుతూ చూస్తోంది.

ఆ నవ్వులన్నీ చూశాను. అక్కడ కొన్ని వేల వసంతాల దృశ్యాలు కనబడుతున్నాయి. కొన్ని కోయిలలు అందంగా కూస్తున్నాయి. ఎన్నో అందమైన విరబూసిన పూలు సుగంధాలతో ఆడుకొంటున్నాయి. నేను చాల తేలికపడి అక్కడ విహరించసాగాను.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" నీలవేణి ప్రశ్నతో యీ లోకంలోకి వచ్చాను.


"నిన్ను గురించే. నువ్వు చాలా అందంగా వున్నావు.

"నీ కంటేనా? నా అదృష్టంవలన నీ పరిచయం కల్గింది." నా భుజాలకు అంటుకుపోయింది. వీపుమీద వేళ్ళతో గోముగా రాస్తోంది.

"నా అదృష్టం కాదా?" నేను గొణుక్కున్నాను.

ఇపుడు డబ్బు, అందంవున్న నీలవేణి నాది. నేను ఏమిచేయమంటే అది చేస్తుంది. సోమసుందరంగారు మా పెళ్ళికి ఒప్పుకోకపోతే కారు, కారునిండా డబ్బు తీసుకుని ఎక్కడికైనా ఎగిరి పోదామంటే 'వూ' అంటుంది.

"నీకు ఈ సంఘం అంటే భయమా?" అడిగాను.



"ఏం, ఎందుకు ?"

"ఊరికే అడుగుతున్నాను."

"నాకు భయంలేదు. నేను ఎవరిని అశ్యపెట్టను. మరి నీకో ?"

"నాకూ అంతే - ఈ సంఘాన్ని అశ్యపెట్టకుండా పగ తీర్చుకుంటూ వుంటాను.

కొంచెంసేపు మౌనం.

"కొన్ని రోజులు ఎటైనా పోదాం పద." అన్నాను కళ్ళల్లోకిచూస్తూ.

"ఏమిటీ, పారిపోవటమా వద్దు.... డాడీతోచెప్పి పెళ్ళి చేసుకుందాము."

"డాడీతో చెప్పి పిల్లల్ని కూడ కందాము." వ్యంగ్యంగా అన్నాను. కాని ఆ మాటకు ఆమె ఖరీదుగా సిగ్గు పడింది. తరువాత పక పకనవ్వి నన్ను చుట్టుకుపోయింది.

మోకాళ్ళమీద యిసుకలో నిలబడి నీలవేణిని హృదయానికి హత్తుకున్నాను.

కొంచెంసేపు అక్కడ ఏమీలేదు. అంతా వేడి - ఉద్రేకం - చల్లటి పిలి చీకటి....

కొంచెంసేపు అలాగే వుండి పోయాము.

"డాడీతో నిన్ను ప్రేమించుతున్నానని చెప్పాను. నిన్ను చేసుకోటానికి ఒప్పుకుంటాడు. కాబట్టి బెంగపడకు అంది బుగ్గమీద చిటికవేసి.

బుగ్గలు నిమురుకున్నాను.

పెరిగిన గడ్డం గుచ్చుకుంది.

ఉలిక్కిపడి లేచాను. బయటకుండ పోతగా వర్షం కురుస్తోంది. కిటికీలోంచి చలిగాలి రివ్వున కొడుతోంది.

ఇప్పటివరకు నేను ....

కల. పంచరంగుల కల .... ఏడ్వాలనిపించింది.

నేను లేను, మెరీనా లేదు. నీలవేణి లేదు. నీలవేణి మెరీనాలో తనలాంటి నిరుద్యోగితో వుంటుందా ?.

ఎయిర్ కండిషన్డ్ గదిలో పిల్లో మీద బోర్లాపడుకుని తియ్యటి కలలు కంటూ వెచ్చటి వూపిరి తీసుకుంటూ వుంటుంది.

కాని నేను ??

మరునాడు ఉదయం సెంట్రల్ స్టేషనులో బయలుదేరిన బండిలో థర్డ్ క్లాసు కంపార్టుమెంటులో టి. సి.వచ్చి టికెట్ అడుగుతాడేమోనని బెదురు చూపులు చూస్తూ కిటికీలోనుంచి వస్తున్న చలికి తట్టుకోలేక ముడుచుకొని కూర్చుని అనుకున్నాను -

ఇపుడు నీలవేణి నా కోసం కన్నెమరాకు వెళ్ళటానికి అలంకరించు కొంటూ వుంటుంది. తెల్లటి చీర కట్టుకుంటుంది. అదేరంగు బ్లౌజు వేస్తుంది. ముఖాన పౌడరు పులిమి నల్లటి కాటుక ఎర్రటి కళ్ళకు పులుముతుంది.

ఉలిపిరి కాగితంలో చుట్టబడిన గులాబిలా వుంటుంది అలంకరించుకొని.

"ఛత్ .... అలా జరగకూడదు" అనుకున్నాను.

కదలిపోతున్న చెట్ల వంక రాత్రి వర్షానికి నీళ్ళలో మునిగిన పొలాల వంక చూస్తూ కూర్చున్నాను. ఎటు వెళ్తున్నానో ఆలోచించకుండా.

***

మిలటరీ స్పెషలు ఆచిన్నపట్నంలో ఆగింది ఆ సిపాయి దిగేందుకు. సిపాయి దిగేడు - అందరికీ వీడ్కోలు చెప్పేడు. అందరూ కేకలేసేరు.

"గుడ్‌బై! మళ్ళా ఎన్నాళ్ళకో! ఈసారి కాశ్మీర్లో పడొచ్చు లడాయి!"

దిగేక, సిపాయి నాలుగు దిక్కులా తృప్తిగా చూసేడు.

పొగబండి అరిచి, టకటం చప్పుడు చేసుకుంటూ పోయింది. పెట్టెల కిటికీల గుండా, తలలు తొంగిచూసేయి - రుమాళ్ళతో చేతులు గాలిలో ఊగేయి.

పండు మీసాల ముసలి స్టేషన్‌మాష్టరు ఆఫీసులోకి పోయేడు. లోన టెలిఫోన్ గణ గణ. కుర్చీలాగిన చప్పుడు. టెలిగ్రాఫ్ డెమ్మీలు లయబద్ధంగా చప్పుడు చేస్తున్నాయి.

'కిట్' భుజంమీద వేలవేసి బయట పడ్డాడు అతడు.

గేటు దగ్గరున్న రైల్వే ఉద్యోగి చిరునవ్వు నవ్వి అన్నాడు - "ఒచ్చేసేవా అప్పారావ్! అదృష్టవంతుడివి... బతికి బయటపడ్డావ్. ఎట్టాగున్నావయ్యా ఆ మంచులో!"

హోమ్ కమింగ్

మంధా వెంకటరమణారావు

సిపాయి తనలో తాను నవ్వుకున్నాడు, తను ప్రేమించిన ఆడది, మరోడితో లేచిపోగా, ఆమెను క్షమిస్తూ, తనలో తాను నవ్వుకున్న హీరోలా. నవ్వులో చిన్న నిరసన భావం, కొద్దిగా విచారం.

కీచుమని శబ్దం. సిగ్నలు మీదికి పోయింది.

ఏదో మూల్గింది. ఒక గజ్జికుక్క, ఆఖరి దశలోని కుష్టువాడిలా.

రైలుకి పచ్చ జెండా చూపించేసేక, అప్పారావు అనబడే ఆ సిపాయి సగర్వంగా నవ్వి అన్నాడు. "బాగున్నారా సుబ్బారావ్! మన్ని చంపేవాడింకా పుట్టలేదయ్యా! పాతిక మందిని పిట్టల్ని కొట్టేసినట్టు కొట్టేసేనయ్యా. ఏంటనుకున్నావో అప్పారావంటే!"

బయటకొచ్చేక చుట్టూ కలియజూసేడు సిపాయి. దిబ్బయ్యరు టిన్‌రేకు హోటలు అలానే ఉంది. దాని పక్కనే ఉన్న కంపు చెరువు బాగా

ఎండిపోయింది. అందువల్ల కంపు ఎక్కువయింది దోమలు అసంఖ్యాకం. అవి చెట్లలోనూ, సాంబారులోనూ, మసాలా పొడిలా కలుస్తూ ఉంటాయి. ఆ పక్కనే ఉంది కిరస్తానం వాళ్ళ శవాలుపాతే సిమిట్రీ గోరీలతో. గోరీలకి ఆ ఏడే వెల్లవేసేరు. అందుకని వెండి పొడుం కాయలలా ఎండలో తళ తళా మెరుస్తున్నాయి.

రోడ్డుమీద ఉండుండి లారీలచప్పుడు - పాత బెంజి' లారీలు జనపనార మోసుకుపోతున్నాయి. చిట్టిపలసజూటు మిల్లుకి. దూరాన్న ఏవో గొంతులు కలలోలా - కొళాయి దగ్గర నీళ్ళకోసం పని మనుష్యుల యుద్ధం అది - "వీళ్ళనే చైనావాళ్ళమీదికి యుద్ధానికి పంపుతే ఎంత బావుణ్ణు! తుపాకులు అవసరం ఉండదు!" అనుకొని నవ్వుకున్నాడు సిపాయి.

అయినా అంతటా ప్రశాంతంగా ఉన్నట్టుంది. ఈ గోలంతా ఆ ప్రశాంతతలోని భాగాలే. - ఊరు నిద్రపోతున్నట్టే ఉంది. ఒకవేళ లేచినా, లేచి బద్ధకంగా ఆవలిస్తున్నట్టుంది. అక్కడ ఆ మంచులో అంతా నిశ్శబ్దంగా ఉన్నా, ఎక్కడ చీమ చిటుకుమన్నా' అగ్నిపర్వతం బ్రద్దలైనట్టే ఉండేది. ఏదన్నా కదలిక, ఏదన్నా శబ్దం పసిగట్టడానికి బుద్ధి, మనస్సు పెద్ద యంత్రంలా పని చేసేవి.

అతని పాలిష్‌లేని మిలటరీ బూట్లు భూమిలోకి చొచ్చుకుని, చిన్న ఇసుక తుఫాను లేవదీస్తున్నాయి. జోళ్ళతో నేలనికొట్టి, ధూళిరేపుతూ, రోడ్డుకొక ప్రక్కకు అతడు నడుస్తున్నాడు. ఉండుండి, లైలా మజ్నూలో ఘంటసాల పాడిన "ప్రియతమా" పాటకూని రాగం తీస్తున్నాడు.

స్టేషన్‌లో అతన్ని ప్రేమించిన కుష్టు కుక్కమాత్రం అతన్ని వదలలేదు. అతడి తోలు బూట్లమీదే దృష్టి నిలిపి వెంబడించింది. పాదాలకు దగ్గరగా, వెనుక పడుతూ, తిరిగి కలుసుకుంటూ - వెన్నెల రాత్రినాడు, ఆకాశంలో కనీ కనిపించనట్టు మెరిసే చుక్కల్లా, ఉండుండి మెరుస్తున్నాయి దాని కన్నులు, ఆఖరి దశలోనున్న జోళ్ళని చూసినప్పుడల్లా. ఒకసారి, దాని నాలుక మేజోడు చిరుగులవల్ల బయటకు కనిపిస్తున్నచోట కాలుని తాకింది. బూటుని రుచి చూడటంలో -

అతడు వెనుదిరిగి, కనురెప్పలు ముడిచి, అస్పష్టంగాతిట్టి నడక సాగించేడు -

మహాప్రస్థానంలో ధర్మరాజుని, కుక్క వెన్నంటినట్టు, శోకజాడించి ఆ కుక్క మరింత దగ్గరగా వెంబడించింది. ఆ ఆశాజనకమైన పాదాల్ని ఒక ఫర్లాంగు దూరం పోయేసరికి, లాలాజలంతో తడిపేయి మేజోళ్ళు.

చైనావాడే ఎదురుపడితే "ఎటాక్" చేసినట్టు సిపాయి, సుడిగాలిలా తిరిగి, కాలు పూర్తిగా వెనుకకులాగి, శక్తి అంతా ఉపయోగించి, కుక్కడొక్కలో



ఒక్క తాపు తన్నేడు. 'ఫుట్‌బాల్'లా కొన్ని అడుగుల దూరాన ఎగిరిపడింది కుక్క. కెవ్వున ఒకఅరుపు, మూల్గు. అప్పుడు ఆరిపోయింది దాని గొంతు. దెబ్బ తగిలినచోట, రక్తం జేగురు ముద్దలా బయటకొచ్చింది.

దూరంగా, మరో జవ్వనితో మాట్లాడుతున్న ఒక ఎర్ర రవికప్రౌఢ.

సిపాయి ప్రతాపం కళ్ళారాచూసి, ఇలానే మనుష్యుల్నికూడా యుద్ధంలో చంపేడు కామోసు అనుకుంటూ, కిల కిలా నవ్వింది. "సోగ్గాడు, దయిర్యం, బలం అంతా కుక్కమీద సూపుతున్నాడే ...ఇలాటోళ్ళే యింటికాడ, ఆడదాని కొంగెనకాల నక్కి దాగుంటారు. అదొక్క తాపుతంతే కుయ్యో మొర్రో అంటారు. సిపాయి కోపంగా వెనుదిరిగి చూసేడు. కిల కిల నవ్వు విన్నాడేకాని, ఆ ఆడమనిషన్నమాటలు వినలేదు. మనసులో అనుకున్నాడు - "పొగరు బోతుముండ! ఎవడో చచ్చు వెధవ మొగుడై ఉంటాడు. నాలాటి వాడి చేతుల్లో పడితే ఈ కుక్కలాగే అరుచును ... బజారు ముండ నన్ను చూసి నవ్వుతుందీ!?"

అతడి 'మూడ్' పాడయిపోయింది. జోగుతూ, దీర్ఘంగా ఆలోచిస్తూ నడవ సాగేడు.

ఒక పాత 'ఫోర్డు' కారు, దాని వెనకే ఒక కొత్త 'అంబాసిడరు' కారు దాటిపోయేయి. ఫోర్డుకారులో ఉన్నాడు పేషెంట్ల రక్తంపీల్చే డాక్టరు. అతడు పేషెంటుని బతికిస్తాడు. కాని, కొన ఊపిరితో. బిల్లు చెల్లించే వరకూ ఆ ప్రాణం ఉంటుంది. ఏమందయినా వాడేస్తాడు. ఎలోపతీ, హోమియోపతీ, డిషేన్, ఆయుర్వేద, సమయానుకూలంగా. రెండు మేడలు కొన్నాడు. రెండు మూడు లక్షల వరకు ఇన్‌కంటాక్సు ఎగవేసెడు. కూతుళ్ళకీ, కొడుకులకీ డాక్టర్లనీ, డాక్టరమ్మల్నీ ఇచ్చి పెళ్ళి చేసేడు. నర్సింగ్ హోమ్ స్టార్టు చేసింది చిన్నకోడలు. అక్కడికొచ్చే పన్నీ అబార్షన్లు, ఆడరోగాలు. డబ్బున్న కేసులే. ఈ ముసలాడు కట్టిన నర్సింగ్ హోమ్‌లోని ఒకగోడకి మదుపు ఒచ్చి ఉంటుంది. నా తల్లికి కాన్సరనిచెప్పి వైద్యంచేసి, ఆఖరికి చచ్చేక ట్రీట్‌మెంట్ కని వసూలుచేసిన మూడువేలూ- అని కసిగా అనుకున్నాడు సిపాయి.

వెనుక అంబాసిడర్‌లో, సామాన్యంగానే అయినా, అందంగా అలంకరించుకొని వెళ్ళిపోతోంది ఆడప్లీడరు. ముప్ఫయి ఏళ్ళు పైబడ్డాయి- కాని పెళ్ళి కాలేదు. పెళ్ళిచేసుకోలేదు. ఇరవై ఏళ్ళ పడుచులా కనిపిస్తుంది ఆమె క్లయింటు కళ్ళకి. ఆమెకున్న క్లయింట్లు ఆమె ప్రేమికులే. ఆమెను ప్రేమించే వాళ్ళుకాదు, ఆమె ప్రేమించే వాళ్ళు. ఆమె హస్తగతమైన మగాడు, పీల్చేసిన చెరకు పిప్పిలా బయటపడతాడు. ఆమెకి బోలెడు ఆస్తి. తండ్రికి గారాబు కూతురు. తండ్రి వకీలుచేసి, ఇప్పుడుకూతురుక్లయింట్లని 'అటెండ్' అవుతున్నాడు. తండ్రీ కూతుళ్ళది అదొక రకమైన మానసిక సంబంధం. మరెవ్వరూ సంతతిలేక పోవడంవల్ల కొడుకుని పెంచినట్టు పెంచేడు. మగాడి మనస్తత్వమే అలవడింది ఆమెకి. ఆమె మాటే వేదవాక్కు. "నాకు పెళ్ళొద్దు నాన్నా"- "అలాగే నమ్మా!"- "నేను ఫలానా అతన్ని-

ప్రేమిస్తున్నాను నాన్నా!"- "మంచి దమ్మా....ఘాటుగా ప్రేమించు!" ఒకటి రెండు సార్లు ఈమె ముసలి డాక్టర్ నర్సింగ్ హోమ్‌కి వెళ్ళడం జరిగేక, ఆపరేషను చేయించుకుని, శాశ్వ ంగా జాగ్రత్తపడింది. తరువాత ఆడపులిలా మదన రంగంలోకి ఉరికింది. సిపాయినవ్వుకున్నాడు కనకన్నా రెండేళ్ళు పెద్ద- కాని తనతోనే చదివింది. ఒక రోజు ఏవో నోట్సు రాసి పెట్టమని ఇంటికి పిలిచింది....స్కూల్ ఫైనలు పరీక్షలు దగ్గరపడుతున్నాయి. మేడమీది గదిలోకి తీసుకెళ్ళింది. "అమ్మాయికి సాయం చెయ్యి గా అప్పిగా!" అన్నాడు ముసలాడు. బాగానే సాయం చేసేడు....ఆడదంటే ఎంత భయంకరమైన మృగంగా మారగలదో, మొదటి సారం నేర్పింది ఆమె —సిగ్గూ, లజ్జా ఏమీ లేవు. అసహ్యం వేసింది....బతికించింది.... తనని చూడలేదు! చూసినా బహుశా పోల్చుకోదు. ఇప్పుడంతా పెద్దవనులే. "దేవుడింత అందం, ఇలా దుర్వినియోగ పరిచేవాళ్ళకే ఇస్తూ ఉంటాడు" అని ఎవరో అన్నట్టు జ్ఞాపకం. ఒక్కొక్కప్పుడు అనుమానం ఒస్తుంది .... ఆడవాళ్ళంతా ఒకటేనా అని...సిపాయి ముఖం ఎరబడింది....గుండె కొట్టుకుంది .. తన భార్య .... ఒంటరిగా రెండేళ్ళయి....ఆ యింట్లో ప్రక్కయింట్లోనే .. తన చిన్ననాటి స్నేహితుడు అప్పలరాజు .... వాడో పెద్ద కిలాడీ .... ఈ ఆడ లాయర్‌కి చిల్లర పద్దు....కాలక్షేపం బతానీలా .... కాని తన భార్యకి తనంటే ఎంత ప్రేమ— ఎటువంటి ఉత్తరాలు రాసేది — కాని సంవత్సరమే సరిగ్గా దాని ఉత్తరాలే అందటంలేదు.రాయటంలేదేమో. వాడు కాని —అయి ఉండొచ్చు—అడదాన్ని ఎవడు నమ్మమన్నాడు — కాని తన వంటి మొగాడితో ఒకసారి కాపురం చేసేక, ఏ ఆడదన్నా మరోడి మొహం చూస్తుందీ?— చూడదు —చూస్తే-— దాన్ని చంపి, కాకులకి గెద్దలకి వేస్తాడు—కీలుకి కీలూ ఊడదీసి -

ఈశ్వరుడి గుడిలో గంటలు మోగుతున్నాయి. చేనులు ఇంకా పూజారిగా వున్నాడేమో. నాలుగేళ్ళ క్రితం గుండె పోటొచ్చి చచ్చిపోవాల్సింది. ముసలి డాక్టరు నయం చేసేడు. ఆనక ఫీసు చెల్లించుకుందుకి పెళ్ళాం మంగళ సూత్రం అమ్మేసేడు. ఎప్పుడు వెళ్ళినా కొబ్బ కాయ ముక్కలిచ్చేవాడు. చిన్నప్పడ్నించీ-కూతురు, నల్లగా పీలగా ఉండేది. దాన్ని తనకిచ్చి పెళ్ళి చేద్దామని ఉండేదిట. కాని ఆ పిల్ల అకాలంగా మశూచికం ఒచ్చి చచ్చిపోయింది. చేనుల్ని ఒకసారి చూడాలి. కాని ఇపుడు కాదు. ఇప్పుడు వెళ్తే. ఏవో కబుర్లు ఆరంభించి మరి వదలడు.

వీధులన్నీ నీరసంగా వున్నాయే. దుకాణాలకి అట్టే బేరంలేదు. యుద్ధం ఒచ్చేక, ధరలన్నీ పెరిగిపోయి ఎవ

డికి కొనే తాహతు లేకుండా పోయింది కామోసు.

"అప్పారావ్—కప్పలుదొంగ—బజారుకెళ్తే మిరాయి దొంగ...."


అతడు విసురుగా తిరిగి చూసేడు. తన్ను సంబోధిస్తూ ఒక్కడూ లేడు. దూరంగా, స్కూలు పిల్లలు తమలో తాము అనుకుంటూ పోతున్నారు.

ఈరోజుల్లో, రోడ్డుమీద పోతున్న వాళ్ళమీద రాయివేస్తే, అది అప్పారావుకన్నా తగుల్తుంది, సుబ్బారావుకన్నా తగుల్తుంది.

వీధి దాటి సందులో పడ్డాడు.

ఏదో జువ్వలాటిది వచ్చి తలకు తగిలింది.

అది సగం కాల్చి న[illegible]చుట్టపీక. కన్నులు ముడిచి, పెదవులు బిగపట్టి, తల త్రిప్పాడు. నాలుగు దిక్కులా. ప్రతి మేడమీదికీ దృష్టి సారించాడు. తను నిల్చున్న చోటే వుంది నగల వర్తకుడు నరసింహశెట్టి మేడ. నరసింహశెట్టి ఈ ఊరు రావడం బాగా జ్ఞాపకం ఉంది. పెద్ద రొజ్జ, నల్లటి విగ్రహం. ఒంటిమీద తుండుగుడ్డ,



మాసిపోయిన పొట్టి పంచ, భార్య. నల్లగా పొట్టిగా ఉండేది. కాకి పిల్లలా చిన్న నల్లటి కొడుకు. శెట్టెమ్మ క్రితం రోజు రాత్రి చుప్పులు (చక్కిలాలు) చేగోడీలు, జంతికలు చేసేది. చేతిలో ఒక రింగుల చక్రంతో గల్లు గల్లుమని శబ్దం చేసుకుంటూ, ఊరల్లా తిరిగి అవి అమ్మేవాడు. ఉదయం ఇడ్లీ, ఉల్లిపచ్చడివేసి అమ్మేవాడు. మాసిన బట్టలు ఎప్పుడూ మార్చే వాడు కాదు. లక్ష్మి ఎవరు ప్రేమిస్తారో వాళ్ళ దగ్గరే ఉంటుంది. అన్యులకి తనని దాచిపోస్తే, వాళ్ళని నిరసిస్తుంది. క్రమేపీ, బంగారం నగలు తాకట్టుపెట్టి డబ్బు వడ్డీలకిచ్చి, విటమిన్లిచ్చి, పేషెంటుని దుక్కశన్నింపించినట్టు, లక్ష్మిని పెంచి పెద్ద చేసేడు. అదలా బంగారు నగల వ్యాపారంలోకి మారింది. బంగారం ధర ఒక్కసారి పెరిగిపోయేసరికి, ఇంట్లో నిలవవున్న బంగారం కమ్మిలు, కల్తీ బంగారు నగల క్రింద మారి, బంగారం కోసం ప్రాణాలన్నా ధారపోసే సుందరులని మరీ సుందరులుగా చేసి, నరసింహ శెట్టిని లక్షాధికారిగా చేసేయి. నరసింహ శెట్టి మంచి పసందైన ముండల్ని మేడమీదే ఉంచుకున్నాడు. కొడుకు, మరో మేడలో మరో ఇద్దరు స్త్రీ రత్నాలని తన కోసం ఉంచుకున్నాడు. వీళ్ళు అప్పుడప్పుడు మేడలు


మారడం కద్దు. ముండలూ, ముండలాధిపతీ, పై దేశపు పడవలు వచ్చినపుడు, వాళ్ళ దగ్గర సంపాదించిన విదేశీ సారాని, విశాఖపట్నం వెళ్ళినపుడు జాలర్ల దగ్గర కొనితెచ్చి, తాగుతారు, అయితే డబ్బు ఎలా ఒచ్చినది అలా ఎందుకు పోలేదు? ఎందుకు పోలేదంటే, ఒక మనిషి రెండుగందల పౌన్లు బలిసేక ఎంత సన్న పడదామని ప్రయత్నించినా, సన్నపడడం కష్టం. గాలి పీల్చినా్న బలమెక్కిపోతాడు. అలానే వ్యాపారమూనూ. ఈపాటి ఖర్చు, అందులో సాదరు క్రింద పోతుంది. "రాత్రల్లా త్రాగి తందనాలాడి, ఒళ్లు తెలీకుండా, ఇలా విసిరుంటాడు..." సిపాయి తిట్టుకున్నాడు.

మలుపు తిరుగుతూ ఉండగా కళ్ళు జిగేల్ మన్నాయి. గడ్డిమోపులు తల మీద పెట్టుకొని, యవ్వనంలో పిటపిటలాడుతున్న, వయసు పొంగుతో నల్లగా నిగనిగలాడుతున్న, అందమైన కళ్లతో లేళ్లలా ఉన్న, శ్రావ్యమైన కంఠంతో కిలకిల నవ్వుకుంటున్నా ఇద్దరు యువతులు! సిపాయి కళ్ళల్లోకి సూటిగా చూసి, కళ్ళతోనే నవ్వి, కన్నుకొట్టేరు. అతడు స్థంభించిపోయేడు. నోరు తెరుచుకొని ఉండిపోయేడు. "హారి దీని తల్లీసిగా.... ఈ ఊరు యింత అడ్వాన్సుడ్‌గా తయారైపోతుందని కలగన్నానా?" అనుకున్నాడు. నోరు వెళ్లబుచ్చుకొని నిల్చున్న, ఆ సిపాయిని, పల్లెటూరిబైతుని చూసినట్టు చూసిపకపకా నవ్వుకున్నారుమగువలు. ఒకామె అడిగింది... "ఎక్కడెయ్యమంటావు గడ్డిమోపు, సిట్టిబాబూ! నీకైతే మోపు ఐదు రూపాయిలకే యేస్తా.... మరోడికైతే పది రూపాయిలే.." సిపాయికి వుషారు పుట్టుకొచ్చింది. "మీ అందరి కోసం యుద్ధం చేసి, చైనావాళ్ని చంపివచ్చేనే. లేకపోతే యములాళ్లలా వాళ్లొచ్చి మిమ్మల్ని ఎగరేసుకు పోయుందురే. మోపు ఉత్తనే వెయ్యి..." అన్నాడు కన్నుగీటి. "నీకు కాబట్టి రూపాయికేస్తా...అంతకు తగ్గదు.." అంది, రెండోది. ఇంతలో పోలీసు ఒకడు అటువేపు రావడం పసిగట్టి ఇద్దరూ తుర్రుమన్నారు.

సిపాయి తన మగతనానికి గర్వంగా నవ్వుకున్నాడు. దూరంగా నిల్చున్న మరో కుర్రాడు, తనలో తాను "ఫిల్మానఫికర్" గా నవ్వుకున్నాడు. ఈ నాటకం గమనించినవాడై.

ఊరు ఇంచుమించు ఆఖరయింది. ఆ తరవాతున్నది ఒక చెరువు. చెరువు గట్టుమీద ఎన్నో పూరిళ్లు, పెంకుటిళ్లు–ఆ వెనుకనున్నాయి వరి పొలాలు. దక్షిణపు గట్టుమీద, తక్కిన ఇళ్లతో సంబంధం లేకుండా ఉన్నాయి దగ్గరగా కలిసి రెండు పాత పెంకుటిళ్లు–బయలు ప్రదేశంలో ఉన్న అవి, చచ్చిపోతున్న

[అలవాటు లేకపోయినా
113 వ పేజీలో చూడక తప్పదు]



(గత సంచిక తరువాయి)

67

చావు తధ్యమని తెల్సినా, తెలియక పోయినా పాపం ఎన్ని రెక్కలు రాల్చుకొంది; ఎన్నిసార్లు బల్బుతగిలి ఒళ్ళు కాల్చుకొంది. అయినా అది తప్పుకుపోలేదు. తన బాధని లెక్క చేయకుండా అది అలా ప్రదక్షిణాలు చేస్తున్నాదంటే ఆ ఆకర్షణలో ఎంతో బలం ఉండి ఉండాలి గోవిందూ! ఆ నాశనంలో కూడా అది ఏదో పరమైన తృప్తిని పొందుతున్నాదేమో?" అంది గోమతి నిదానంగా.

"నీ మాట నిజంలాగే ఉంది గోమతీ! లేకపోతే ఏ ప్రాణి నాశనాన్ని కోరి, కోరి తెచ్చుకోదు" అన్నాడు గోవిందు.

గోమతి రంగుటద్దాలలోంచి సుందర ప్రపంచాన్ని చూస్తుండగానే రెండేళ్ళు గడచిపోయేయి. గోవిందు తన పేరుకి వెనుకగా బి. ఎ. అనే రెండు అక్షరాలు తగుల్చుకొన్నాడు. క్రుంగి కృశించిపోతున్న తన శరీరాన్ని టి. బి. అనే వ్యాధితో అలంకరించుకొన్నాడు.

ఆ రెండు సంవత్సరాలలో గోమతి-గోవిందుల మధ్య దూరం మరికాస్త పెరిగింది. గోపాలం గోమతుల మధ్య ఎడం మరికాస్త తరిగింది. అతను చేసిన పని గురించి పగటి వేళల ఆలోచిస్తుండేది గోమతి. అతను చెప్పిన హితోక్తుల గురించి రాత్రి పూటల

మధనపడేది. నది మధ్యలో నిల్చి ఏ గట్టు దిక్కుగా పయనించనా అని ఆలోచించేది. ఎటుపోతే కాళ్ళకి ముళ్ళ దొంకలు, జారుడు బండలు తగులు తాయి? ఎటుపోతే పాదాలు వెచ్చని, మెత్తని ఇసుకలో కూరుకుపోతాయి. తన చేతిలోలేని కొలతలతో, తూకపు రాళ్ళతో జీవిత ఆనందానికి వెలకట్ట ప్రయత్నించేది. కాని ఆమె తులాభారం పూర్తికాకుండానే, ఆమె తన జీవితానికి విలువ నిర్ణయించుకోకుండానే నదిలో పొంగు రావచ్చు. తల మునకలు అయ్యేలా ఆమెని ముంచిపోవచ్చు.

జబ్బు మనిషి గోవిందుకి తగిన మందులు కావాలి. మంచి ఆహారం కావాలి. అన్నిటినీమించి శారీరకంగా, మానసికంగా విశ్రాంతి కావాలి. గోమతి అతడికి అన్నీ అమరేలా చూసింది ఒక్క శాంతి తప్ప. అదే ముఖ్యం అంటూ డాక్టరు పదే పదే చెప్పే వాడు.

"ఎన్ని ఏళ్ళకాలం ఒకే పక్క పడుకోను-గోమతీ! ఏదో నాటికి అదే వస్తుంది మార్పు. మనం కోరినా కోరక పోయినా కొన్ని అతిసహజంగా జరిగిపోతుంటాయి. అన్ని విధాలా నేను విశ్రాంతి తీసుకొనే రోజులు దగ్గరలోనే ఉన్నాయనిపిస్తున్నది. దానికోసం నువ్వేం కంగారు పడకు" అనే వాడు గోవిందు.

గోపాలం గోవిందుకోసం డాక్టరుని వంపుతాడు. కావలసిన మందులు కొంటాడు. క్షేమ సమాచారాలు శ్రద్ధగా సేకరిస్తాడు. కాని చిన్ననాటి నేస్తుడికి ముఖం మాత్రం చూపడు.

గోవిందు ఆవేశంగా కేకలువేస్తే, మిత్రద్రోహీ అని చీదరించుకొంటే, నా గుమ్మం తొక్కకు, నీ ముఖం చూపకు అని అవమానపరిస్తే గోపాలం సహించగలడు. అర్థం చేసుకోగలడు. గోవిందు మనిషిలా ప్రవర్తించేడు అని అనుకోగలడు. కాని అతడు నిర్మలంగా, ఆప్యాయంగా "గోపాలం" అని పిలుస్తుంటే ఆ సౌమనస్యాన్ని భరించలేడు. ఆ మంచితనాన్ని అర్థం చేసుకోలేడు. అందుకే ఆ ఇంట గోపాలం కాలు పెట్టటం మానుకొన్నాడు.

భూదేవికన్న ఓర్మికలది రంగమ్మ. మనుష్యులలో మంచినే ఎంచి చూడాలన్న తత్వంగల ఇల్లాలు. మూడు పువ్వులు, ఆరుకాయలుగా అభివృద్ధి పొందుతుందనుకొన్న కొడుకు బ్రతుకు మూడునాళ్ళకే ముగిసి పోతుంటే, కట్టని కన్నీటిని కొడుకు కంట పడకుండా తిరగడమే తన నియమంగా మసలుకొంటుందే తప్ప కోడల్ని ఒక్కమాట అని ఎరగదు.

"నువ్వు అందరి ఆ తల్లాటి అత్త వయితే నీ కోడలు ఆటలు ఇలా సాగేవా? మేము మొదటినుంచి



చెప్తునే ఉన్నాం" అనేవారు ఇంటిలోని వారు.

ఆమె అందరిఅత్తలాంటి అత్తకాదు, అతడు అందరి భర్తలాంటి భర్తకాడు. అందువల్లనే గోమతి ఆడింది ఆట, పాడిందిపాట అయింది. అదే ఆమె జీవిత రథాన్ని పక్కదారులు పట్టించింది.

8

ఆ రోజు ఆఫీసునుంచి గోమతి కాస్తముందుగా బయలు దేరింది.

గోపాలం ఇంటికి చేరేసరికి అతడు ఇంకా ఆఫీసునుంచి రాలేదు. ఒంటరిగా ముందు హాలులో కూర్చుని ఆలోచిస్తుంటే మొదటిరోజు తను అక్కడికి వచ్చినప్పటి సంగతులు గుర్తుకి వచ్చేయి. ఈ గోపాలం తన జీవితంలోకి రాకుండా ఉంటే ఎంత బాగుండేది. ఇంతగా ఈ స్నేహాన్ని పెంచుకోకుండా ఉంటే ఎంత హాయిగా ఉండేది అనుకొంది.

తను పొందే లబ్ధినాశనమే అని తెలిసికూడా దీపంచుట్టూ దాని ఆకర్షణకి లోనై తిరిగే దీపపు పురుగు గుర్తు వచ్చింది ఆమెకి. తను ఆనందం అనుకొని భ్రమిస్తూ నాశనాన్ని చేచేతులా తెచ్చుకొంటున్నదా? దీని నుండి తప్పుకుపోయే మార్గం లేదా? మళ్ళా తను ముందులా గోవిందుని ప్రేమిస్తూ ఎప్పటి గోమతిగా ఎన్నటికీ కాలేదా?

ఆలోచనలలో మునిగి తేలుతున్న గోమతి గోపాలం రావడం చూడలేదు. అతడు చనువుగావచ్చి సోఫాలో ఆమె పక్కగా కూర్చున్నాడు. గోమతి దూరంగా జరిగి కూర్చోలేదు. కాదని వారించలేదు. అంతవరకు తమ ఇద్దరి మధ్య నిలచిన ఆ కొద్ది ఎడంకూడా పూడిపోవాలని అతడు చూపిస్తున్న ఆత్రతకి సంకోచపడలేదు. అతడు వయసులో ఉన్నవాడు. తను అందమైన ఆడది. ఆ దూరం ఇద్దరి మధ్య ఎల్లకాలం నిలవడం కష్టం అనుకొంది.

ఆ మాటనే గోపాలంకూడా వ్యక్తపరిచేడు.

"నీ మట్టుకి ఎలా ఉందోకాని ఈ విధంగా పరిస్థితి కొనసాగడం నేను భరించలేను గోమతీ! ఈ రోజు ఏదో ఒకటి తేలిపోవాలి. నీ మనసులో ఏముందో వెలికి రావాలి" అన్నాడు.

"దేని గురించి గోపాలం నువ్వంటున్నది. నాకేం అర్థం కాలేదు" అంది గోమతి తడబడుతూ.

"నేను అంటున్నదేమిటో, కసిసం అనుకుంటున్నదేమిటో నీకు మహ చక్కగా తెలుసు గోమతీ! అమాయకంగా నటిస్తే నమ్మేందుకు నేను పిచ్చి గోవిందుని కాను. నన్నొక ఆట బొమ్మగాచేసి నువ్వు ఆడుకొంటుంటే ఓర్మితో సహించేశక్తి ఇంక నాలో అణుమాత్రంకూడా మిగిలి లేదు." అన్నాడు ఆవేశంతో.

గోమతి ముఖంలో కాంతి ఒక్కసారిగా పల్చబడింది. కన్నులలో నీరు తొంగి చూసింది. చావు దెబ్బతిన్న మనిషిలా పాలిపోయింది.

"క్షమించు గోమతీ! ఆవేశంలో కాస్త దురుసుగా అన్నాను. అంతకు మించి నిన్ను బాధించాలనికాదు. ఈ విషయం నీతో ఇదివరకు చాలాసార్లు ప్రస్తావించి వున్నాను. ఈ రోజు ఏదో ఒక నిర్ణయం చేసుకోవాలన్నదే నా కోరిక. గోవిందుని ఎదురుగా పెట్టుకొని మనిద్దరం ఇలా ఆటలాడడం

నాకు ఇష్టంలేదు. డైవోర్సు నీకు సులువుగానే లభ్యమవుతుంది. భర్త అవిటివాడు. పైగా క్షయరోగి...."

"గోపాలం" అంది గోమతి బాధగా.

"ఇప్పుడు మనం చేస్తున్న దానికంటే అది చాలా మంచిపని గోమతీ! మన స్నేహం స్నేహంగా నిలిచే మార్గంలేదని తెలుసుకొన్నప్పుడు, పరస్పర ఆకర్షణలనుంచి ఇద్దరం తప్పుకోలేమని గ్రహించినప్పుడు, అక్రమ సంబంధం ఏర్పరచుకొని అవినీతిగా బ్రతికేకంటే, ఇది అనేకరెట్లు మంచిది. స్నేహితుడికి అన్యాయం చేసేనన్నబాధ వున్నా, అవినీతిగా బ్రతికేనన్న ఆత్మక్షోభ ఉండదు.

"తెరవెనుక ఈ బొమ్మలాట ఎంత శీఘ్రంగా ముగిసిపోతే మన ముగ్గురికీ అంతమంచిది. మనసులో అశాంతి తగ్గితే గోవిందు ఆరోగ్యం బాగుపడుతుంది. మంచి శానిటోరియమ్‌లో వుంచి ట్రీట్‌మెంటు చేయిస్తే త్వరలో కోలుకొనే అవకాశం వుంటుంది.


"జీవితంలో ప్రణయం ఒకభాగం గోమతీ! అది నష్టపోయినంత మాత్రాన జీవితమంతా నాశనంకాదు. కాకపోతే మనిషి బ్రతుకులో పరిపూర్ణత సాధించలేకపోవచ్చు. కాని నిర్మలంగా బ్రతికేందుకు మాత్రం అది అడ్డంకాదు. గోవిందు తనకి నచ్చిన జీవితాన్ని ప్రశాంతంగా ఎక్కడో దగ్గర ఏర్పాటు చేసుకొంటాడు. ఇప్పటి ఈ పరిస్థితికన్న అది ఎంతో నయం.

"ఇంక రంగమ్మగారికి బ్రతికున్నంత కాలం ఏలోటూ రానివ్వనని నీకు మాట ఇస్తున్నాను. ఈ నిర్ణయాన్ని ఇప్పుడప్పుడే ఆమె ఆమోదించలేకపోవచ్చు. కాని, కాలం గడిచేక దీనిలో ఉన్న మంచిని ఆమె గ్రహిస్తుంది."

"ఒక్క విషయం మాత్రం నిజం గోమతీ! ఇది నీకు అంగీకారం కాకపోతే నిన్ను నిర్బంధించను. ఇద్దరం మిత్రులుగా విడిపోదాం. రేపే ఈఊరు నుంచి ట్రాన్స్‌ఫరుకి ప్రయత్నిస్తాను. వెంటనే శెలవు పెడ్తాను. తిరిగి ఈ జీవితంలో నీ కంట పడకుండా జాగ్రత్త పడతాను. మీ దంపతుల మధ్య మంచి తప్పుకొంటాను.

"బాగా ఆలోచించుకొని చెప్పు. ఈరోజు కాకుంటే... రేపు....ఎల్లుండి.... వారంనాడు .... పది రోజులనాడు, కాని నువ్వు ఎంత త్వరలో ఒక నిర్ణయానికివస్తే.. అంతమంచిది" అన్నాడు గోపాలం.

అవును, కాదు అని చెప్పకుండానే గోమతి ఇంటిదారి పట్టింది. ఏ నిర్ణయానికి రాకుండానే మూడు రోజులు గడిపింది. మంగలంలో పేలగింజలా ఆమె మనసు తల్లడిల్లిపోయింది. మాటిమాటికీ గోపాలంనిచూసి కళ్ళనీళ్ళు పెట్టుకొంది. వయసుమీరిన రంగమ్మని చూసి జాలిపడింది. చుట్టూవున్న సంఘాన్ని చూసి బెదిరిపోయింది. మనసులోని కాంక్షను తెలుసుకొని కదలిపోయింది. నన్నెందుకిలా పుట్టించేవు భగవంతుడా అని కుమిలిపోయింది.



DOL.327/1 TG

"మన స్నేహం స్నేహంగా నిలిచే మార్గంలేదని తెలుసుకొన్నప్పుడు, పరస్పర ఆకర్షణల నుంచి ఇద్దరం తప్పుకోలేమని గ్రహించినప్పుడు"

గోపాలం మాటలు దివారాత్రాలు దీపంచుట్టూ తిరిగే పురుగుల్లా గోమతి చుట్టూ ప్రదక్షిణాలు చేసేయి. కన్నెమనసులో అనిపట్ల పెంచుకొన్న ప్రేమ, అనురాగం కథలుగా, కలలుగా కళ్ళముందు తాండవించి కలతపెట్టేయి.

మూడేళ్ళుగా రోజు వెనుకరోజుగా, పేజీ వెనుక పేజీ తన మనస్సుని, ఇతరులతో చెప్పుకోలేని ఆలోచనల్ని, అనుభూతుల్ని వ్రాసి పదిలపర్చుకొన్న డైరీలను తిప్పి చదువుకొంది గోమతి. తన్ను తాను అర్థం చేసుకొనేందుకు; తానేం చెయ్యాలో నిర్ణయించుకొనేందుకు; తనకేం కావాలో నిశ్చింతగా తేల్చుకొనేందుకు.

ఆ అక్షరాలలో కన్పిస్తున్న తన రూపాన్నిచూసి బెదిరిపోయింది గోమతి. తానెంత స్వార్థపరురాలు? తానెంత కఠినాత్మురాలు? తానెంత చంచల హృదయురాలు? తానెంత చపల చిత్తురాలు?

ఈఅందంక్రింద దాగివున్న అసలు రూపం ఇదా? దీనిని చూసుకొనేనా తానింత గర్విస్తున్నది? దీని మీదనా గోపాలంకింత మమకారం? ఈ

గోమతి మీదనా గోపాలానికి అంత ప్రేమ?

ఆ రూపులో తన్ను చూసుకొని అసహ్యించుకొంది గోమతి. ఆబుద్ధిలో తన్ను పోల్చుకొని చీదరించుకొంది. అయినా అవి ఆమెకు లొంగిరాలేదు. కుక్కతోకలా పట్టుకున్నంత వరకు సాఫుగా ఉండి అంతలోనే వక్రంగా తయారయేవి. వాటిని ఎదుర్కొనే శక్తి ఆమెకి సమకూడలేదు. సరిదిద్దుకోవాలనే కోర్కె కలగలేదు.

విద్రాహకాలుమాని రోజుల తరబడి మనసుయొక్క మథనంలో సతమతమైన గోమతి, జీవితానికో అర్థం, పరమార్థం ఉంటుందని ఆలోచించ ఇష్టపడని గోమతి, కట్టెదుటి ఆనందమే జీవితం అని భ్రమపడిన గోమతి, మానసిక దౌర్బల్యానికి బానిసయ్యె, అత్తనీ, భర్తనీ ఇంటవదలి, తన బ్రతుకు తాను వెతుక్కొంటూ వీధిలో కాలుపెట్టింది.

వంట ఇంటిలోంచి "భోజనం చేసి వెళ్ళు" అని అత్త పిలుపుకాని, మన వైవాహిక అనుబంధానికి నువ్వు ఇచ్చే విలువ ఇంతేనా గోమతీ అన్నట్లు జాలిగా చూసే భర్త చూపుకాని ఆమెని ఆ ఇంట ఆపలేకపోయేయి.

కొండశిఖరం మీదనుంచి దొర్లి పడడం మొదలుపెట్టిన రాయి, అగాధంలో పతనం అయేవరకు ఆగేమార్గం లేదు. దాని వేగాన్ని మించిన బలంతో ఎదుర్కొని నిలిచే వస్తువు అడ్డుపడితేనే తప్ప అది నిలిచే అవకాశం రాదు.

69

"నేను వచ్చేను" గది గుమ్మం దగ్గర నిలచి నిశ్చలంగా అంది గోమతి.

"నాకు తెలుసు. నువ్వు వస్తావని నాకు తెలుసు గోమతీ! ఏదో సమయంలో, ఏదో రూపంలో నువ్వు నా జీవితంలోకి వస్తావని నేను ఎప్పుడో తెలుసుకొన్నాను. లేకపోతే ఈ ఆరాటానికి అర్థం లేదు. ఈ ప్రేమకి విలువ లేదు" ఆప్యాయంగా ఎదుర్కొన్నాడు గోపాలం.

గోమతి తనది కాబోతున్నది అన్న ఆలోచనకే అతడు ఆనందంతో వణికి పోయేడు. అంతకాలానికి తొంగిచూసిన తన అదృష్టానికి మేఘంలా పొంగిపోయేడు.

"ఈనాటితో గోపాలం మంచివాడు, మర్యాదస్థుడు అన్నమాట మట్టిలో కలిసిపోతుంది. గోవిందుతో స్నేహం కరగిపోతుంది. సంఘంలో

పరువు, ప్రతిష్టలు తరగిపోతాయి. అర్హత ఉన్నా లేకున్నా అంతా నావంక వేలెత్తి చూపుతారు. వీడే మిత్రద్రోహి. పచ్చని సంసారానికి పట్టిన చీడపురుగు లాంటివాడు. మగనాలి మనసుకోరిన ప్రేమాంధుడు అంటారు.

"కాని అవి నన్ను అణుమాత్రంగానైనా బాధించలేవు గోమతీ! నీ నుండి వేరుపడిన తరువాత నేను పొందిన యాతనలో శతాంశమైనా ఆ దూషణల వల్ల నాకు కలుగదు. నీకోసం ఏమైనా చేస్తాను. గోమతీ నువ్వు దగ్గర ఉంటే ఏమైనా సహిస్తాను" ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు గోపాలం.

గోమతి మాట్లాడలేదు. గోపాలం ఉత్సాహంలో పాలుపంచుకోలేదు. అతని ఆరాటాన్ని అర్థం చేసుకోలేదు. ప్రాణమున్న మట్టిబొమ్మ గోమతి. మనసు లేచిపోయిన మనిషి గోమతి. వ్యామోహానికి తల ఒగ్గిన వెర్రిపిల్ల గోమతి. దానిలోపడి సర్వనాశన

మరేందుకైనా వెరవని పిసనిత గోమతి.

గోపాలం గోటుగా, నీటుగా సూటూ, బూటూ వేసుకొని బైటికి వచ్చేడు. బ్లూ ఎంబాసిడర్ కారు పోర్టికోలో నిలచింది. డ్రైవరు తలుపుతీసి పట్టుకొన్నాడు. కీ ఇస్తే నడిచే ఆటబొమ్మలా గోమతివచ్చి కారులో కూర్చుంది.

ఆమె ఒళ్ళంతా భయంతో తిమ్మిరి ఎక్కి ఎటువంటి అనుభూతికి అర్థం చెప్పుకోలేనంత తమందావస్థలో పడిపోయింది. ఆమె మనసు గడచిన జీవితపు జ్ఞాపకాలకారుచిచ్చులో చిక్కుకొని మాడి మసి అయిపోయింది.

గోపాలానికి ఆప్తమిత్రుడు, పేరు మోసిన లాయరు అయిన జానకిరామ్ ఇంటిముందు కారు ఆగింది.

ఆఫీసులో రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చుని అవసరమైన కాగితాలని చూచుకొంటున్న జానకిరామ్ గోపాలాన్ని చూస్తూనే సాదరంగా ఆహ్వానించేడు.

"వచ్చేరా.... మీ విషయంగురించే చూస్తున్నాను. నిజానికి మీ ఫోన్‌కాల్ అందినప్పటినుండి ఆ పనిలోనే ఉన్నాను. మీకేం భయంలేదు. అవసరమైన విషయాలన్నీ నేను చూసుకొంటాను. ఆ రోజుకి మీరు హాజరుగా ఉంటేసరి.

"ఈ డైవోర్సుని ఆపేందుకు ఆ లోకంనుంచి దేవుడు దిగివచ్చినా సాధ్యంకాదు. ఆమె వైపు అంతేబలం ఉంది" అన్నాడు జానకిరామ్ ఉత్సాహంగా.

"ఇక్కడ బలాబలాల ప్రసక్తి అవసరంలేదు జానకిరామ్. ఆమె భర్త దీనికి అడ్డు తగులుతాడని అనుకోను. ఇది కేవలం లాంఛనమాత్రంగా జరిపే వ్యవహారమే. చట్టసమ్మతంగా ఆమె విడివడేందుకు కలుగజేసే అవకాశం మాత్రమే" అన్నాడు గోపాలం.

"రండి. కూర్చోండి" అంటూ ఎదురుగావున్న కుర్చీలు చూపించేడు జానకిరామ్.

చిత్తరువులా నిలిచిపోయింది గోమతి.

"కూర్చో గోమతీ" అన్నాడు గోపాలం.

పగటిపూట పచ్చికమైదానంలో తల్లిని విడచి ఒంటరిగా మిగిలిపోయిన లేడిపిల్ల, ఎటునుంచి ఏ ఆపద తరు

* ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ : తమ పిల్లని పెళ్ళి చేసుకుంటే-కాబోయే అల్లుడికి ఉద్యోగం వేయించే పూచీ తమదే అనే వియ్యంకుడి పరస్పర ఒడంబడిక.

ముకు వస్తుందో అని బెదురు చూపులు చూస్తున్నట్టు కుర్చీలో ఒక మూలగా ఒదిగి కూర్చుని ఇటు అటు చూసింది గోమతి.

లాయరు జానకిరామ్ తనముందున్న టేబిలుపై కుప్పలుగా పడివున్న కాగితాలని ఇటు అటు రెండుసార్లు తిరగవేసి అందులో కొన్నింటిని గోమతి ముందుకు నెట్టేడు.

"ఈ ఫారం పూర్తి చెయ్యండి" అన్నాడు.

గోమతి పెన్ను చేతిలోకి తీసుకొంది. ముందుగా నింపవలసింది తారీకు. కేలెండర్ కోసం ఇటు అటు చూసింది. గోపాలం ఆమె చూపుల్ని గ్రహించి "జూన్ నెల. పదవ తేదీ" అన్నాడు.

ఆమె చేయి మలేరియా జ్వరం వచ్చిన రోగిలా వణికిపోయింది. చేతిలోంచి పట్టుతప్పి పెన్ను టేబిలుమీదికి పడిపోయింది.

"నావల్ల కాదు గోపాలం. ఈ పని నేను చెయ్యలేను" అంటూ రెండు చేతులలో ముఖం కప్పుకొంది.

గోపాలం పెన్ను చేతిలోకి తీసుకొన్నాడు. ఇలాతే నేను నింపుతాను. నువ్వు సంతకం పెడితే సరిపోతుంది" అంటూ కాగితాన్ని తన ముందుకి లాక్కున్నాడు.

"వద్దు గోపాలం. నాకేదో భయంగా ఉంది. ఇప్పుడప్పుడే ఇటువంటి పనివద్దు. ఇంకొంత కాలంవేచి ఉందాం. ఇంకా ఆలోచిద్దాం" అంది గోమతి కళ్ళనీరుంచి చేతులు తియ్యకుండానే.

"ఇందులో గాభరా పడేందుకు ఏమీలేదండీ. మన జీవిత విధానానికి జీవిత విలువలకి ఇది కొత్త. అందుకే కంగారు పడుతుంటాం. శాసనరీత్యా ఇది అమలులోకి వచ్చినా, మనుష్యుల మనసుల్లో ఇంకా స్థానంలేదు.

"ఎక్కడో పుట్టిపెరిగిన ఇద్దరు వ్యక్తులు మనసులు ఏకం చేసుకొని కలసి జీవించాలని, సుఖించాలని వైవాహిక విధిద్వారా దగ్గరికిచేరి ఆ వ్రతులవడం ఎంత సహజమో, వారి అభిలాషలు, ఆశయాలు కలవని పరిస్థితుల్లో, ఒకరికొకరు తోడునీడగా నిలువలేనినాడు విడిపోవడం అంత సముచితమయినది.

"భార్యాభర్తలు ఒకరిపట్ల ఇంకొకరు ద్వేషాసూయల్ని పెంచుకొంటూ, కొట్టుకొంటూ, జీవిత పర్యంతం ఒక ఇంటిలో నివసించినంతమాత్రాన వైవాహిక జీవితం సఫలమయిందని భావించేందుకులేదు. అటువంటి సంసార జీవితంఅసలు వివాహంలోని ముఖ్యోద్దేశానికే అపహాసము వంటిది" లాయరు జానకిరామ్ విడాకుల అవసరాన్ని వివరంగా బోధించేడు.

గోమతికి ధైర్యం చెప్తూనే గోపాలం ఆ ఫారంలో నింపవలసిన వన్నీ నింపివేసేడు. గోమతి చెవుల్లో గోపాలం అన్న ఒక్కమాటకూడా

తొరబడలేదు. జూన్ పదవ తారీకు ఆమె మనసంతా ఆక్రమించు కొంది.

జూన్ నెలలో పదవతేది. ఆ రోజు రామనాధం కూతురుపెళ్ళి, అందాల గోమతి నుదుట కళ్యాణపు బొట్టు దిద్దుకొంది. కళ్ళకి కాటుక, కాళ్ళకి పసుపు పారాణి, జడలో మల్లెలు, కనులలో కలలు అలంకరించుకొంది.

సిరిసౌభాగ్యాలు కోరుతూ గౌరిదేవిని ప్రార్ధించింది. శుభముహూర్తం ఆసన్నమయింది. బాజాలు జోరుగా మ్రోగాయి. పురోహితుల వేదోక్త ఆశీర్వచనముల మధ్య పెళ్ళికొడుకు గోవిందు గోమతి మెడలో తాళికట్టేడు.

అంతరంగంలో ఎక్కడో రేగుతున్న అశాంతిని గోమతి వెలికినెట్టింది. కంటికొనని ముత్యంలా మెరిసోన్న ఒకే ఒక కన్నీటి బొట్టుని కొనగోట చిమ్మివేసింది. ఎదురుగాపున్న అగ్నిహోత్రుడి సాక్షిగామనసులో ప్రమాణం చేసింది. నమ్మకంగా దానిని ఇంకోసారి మననం చేసుకొంది.

"మనసులో ఏకాలుష్యం లేకుండా, నిర్మలంగా నీకు చెయ్యి అందిస్తున్నాను. గోవిందూ! బ్రతుకులో చావులో నీ సరసన నిలుస్తాను. కష్టంలో, సుఖంలో నీ చేయి విడవకుండా నడుస్తాను. నిండు మనసుతో నిన్ను ప్రేమిస్తాను."

గోమతి కళ్ళముందున్న పెళ్ళిపందిరి నేలబారుగా పడిపోయింది. కోటికంతా లతో ఆనాడు ఆమె చేసిన ప్రమాణాలు సుడిగాలిలా చుట్టుముట్టేయి. అప్పుడే నిద్రమేల్కొన్న దానిలా కళ్ళమీది నుంచి చేతులుతీసి తానున్న ఆ ప్రదేశాన్ని వింతగా చూసింది గోమతి. పిచ్చిదానిలా కళ్ళింతచేసుకొని గోపాలాన్ని, లాయరు జానకిరామ్‌ని మార్చి మార్చి చూసింది. తల తిరుగుతున్నట్లు కళ్ళు తేలవేసింది.

"ఏమయింది గోమతీ! ఎందుకంతగా భయపడుతున్నావు? నీకేం భయంలేదు గోమతీ!...నేనున్నాను.... బ్రతుకులో, చావులో నీసరసన నిల్చేందుకు నేనున్నాను గోమతీ!" గోపాలం ఆప్యాయంగా చేయిపట్టుకొన్నాడు.

గోమతి ఒక్కసారిగా అతడిచేతిని విదిలించి వేసింది. చేతులోవున్న కాగితాన్ని ఫ్రపన చించివేసింది. ఉన్నపళంగా లేచి వీధిలోకి పరుగు తీసింది.

ఆత్రంగా ఆమె రావడం చూసిన డ్రైవరు కారు తలుపు తెరచేడు. అతడికి ఆ రోజు జరుగుతున్న విషయం కొంతగా తెలుసు. అటు తరువాత జరగబోయేది క్షుణ్ణంగా తెలుసు. అందుకే కాబోయే యజమానురాలి కమ సన్నను ఆజ్ఞగాభావించికారుని ముందుకి నడిపించేడు.

వీధిమలుపు తిరుగుతూ ఎక్కడికి అన్నట్లు వెనక్కి తిరిగి చూసేడు. ఆమెని ఆ స్థితిలో చూసి ఏమయింది అన్నట్లు ఆశ్చర్యపోయేడు.

"ఇంటికి" చూపు తిప్పుకొంటూ జవాబు చెప్పింది గోమతి.

[సశేషం]

పనికిరాని పరిజ్ఞానం

కుక్క శరీరంలో స్వేద గ్రంధు లుండవు. దానికి చెమట పోయదు। మన శరీరంలో మాత్రం ముప్ఫయి లక్షల స్వేద గ్రంధులున్నాయ్.

* * *

మనసు బాగాలేకపోతే దాని ఫలితం శరీరంలో ఇతర భాగాలమీద ప్రభావం చూపించవచ్చు. నానాచింతనలలోమునిగి ఉన్నబుర్ర పరధ్యానంగా పనిచేస్తుంది. ఉదాహరణకి దిగులుగా వున్న వాళ్ళ మెదడు పరధ్యానంగా ఉండి జీర్ణరసాలను ఉత్పత్తి చేయించవచ్చు. తత్ఫలితంగాకడుపులో వ్రణాలుఏర్పడవచ్చు.

* * *

మనిషికి తప్ప మరే యితర జంతువుకూ ఎర్రరంగు కనిపించదు. ఎర్ర బల్బు కాంతిలో జంతువులకు చీకటి లాగే ఉంటుంది.

* * *

తల్లి దండ్రుల దస్తూరికీ, వారిబిడ్డల దస్తూరీ పోలిక ఎప్పుడూ ఉంటుంది. పెన్నుతోరాసినా, పెన్సిల్‌తో రాసినా, ఈకతో రాసినా దస్తూరీ మాత్రం మారదు. అయితే దస్తూరీచూసి సంతోషంగా రాసిందీ, విసుగ్గా రాసిందీ, ప్రేమగా రాసిందీ, దిగులుగా రాసిందీ, కోపంలో రాసిందీ చెప్పేయచ్చు। నిపుణులు దస్తూరీచూసి స్వభావాలే కని పెట్టేస్తారు।

* * *

10 - 12 సంవత్సరాల మధ్య వయసప్పుడుండే వ్యాధి నిరోధక శక్తి, ఆరోగ్యం జీవితమంతా ఉంటే పురుషులు సగటున 2000 సంవత్సరాల పాటు, స్త్రీలు 3000 సంవత్సరాలపాటు జీవించగలరు। అయితే, దురదృష్ట వశాత్తు వయసు పైబడ్డకొద్దీ వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది.

* * *

అమెరికాలో డాక్టర్లంతా సిగరెట్లు త్రాగడం మానేస్తున్నారు. సిగరెట్లవల్ల కాన్సర్ వస్తుందన్న భయంతో నూటికి డెబ్భైమంది డాక్టర్లు ధూమపానం మానేశారు.

మల్లా

* * *



శాస్త్రిగారి ఉపన్యాసాలు

3

రైల్లో దొంగతనాలు

"పంతులూ!"

"ఏం అక్కయ్యా పంతుల్లేడా ఏమిటి?

వాడు మాత్రం ఇంట్లో ఎంతకని గోళ్లు గిల్లుకుంటూ కూర్చోగలడు, చెప్పు. అలా తిరిగిరాని, ఏం పోయింది?

ఏమిటీ? మీ మేనల్లుడి తోటల్లుడి స్నేహితుడి పక్కింటాయన, పెళ్ళాం, పిల్లలతో ప్రయాణం చేస్తుంటే రైల్లో సామాన్లు పోయేయా? రైల్లో దొంగతనాల మాట మరి చెప్పుకోలేం, 'పబ్లిగ్గా' జరుగుతున్నాయి.

మొన్నీ మధ్య నే నూరి కెళ్ళేను కదా, అట్నుంచి తిరిగొస్తున్నప్పుడు, మధ్యదారిలో, ఓ చోట రైలాగి పోయింది. రైల్వే లైనుకి దగ్గిరిగానే ఏదో చిన్న పల్లెటూరుంది. అక్కడ చిన్న నాటకం వేస్తున్నారు. పోనీ టిక్కెట్టు లేకుండా 'ఫ్రీగా' చూడొచ్చు కదా నెప్పి, గుమ్మం దగ్గిరికొచ్చి, నిలబడి చూస్తుంటే, పెట్టెలాగిన చప్పుడైంది.

వెనుదిరిగి చూద్దును, నా పెట్టె ఎవడో పట్టుకున్నాడు. నే చూడ్డంతో వాడు చిన్నచిరునవ్వువిసిరి, "మేష్టారు,

మీదేంనేంటి యీ పెట్టె" అని అడిగేడు. అవునని చెప్పేను. "కొంచెం పను వుందామన్జెప్పి ఖాళీ చేస్తున్నాను. మీ పెట్టె, యిదుగో యీ సీటుకింద పెడుతున్నా" నన్నాడు. సర్లేనయ్యాన్జెప్పి, నాటకం చూడ్డం మొదలెట్టాను.

"మొత్తానికి దొంగాసేవుందినాటకం" అనుకోబోయేంతలో రైలు కదిలింది. అలా అనుకోవడం మానేసి, సీటు దగ్గరికి వచ్చేను.. పెట్లోవి రెండు మామిడి పళ్లు తిందాం కదాని సీటు కింద 'పెట్టె' వెదికేను. ఏదీ? ఇందాకటి మనిషీలేడు, నా పెట్టేలేదు!

ఆ పోయినది నా పెట్టే అయితే విచారించక పోదును. నాది కాదాయె. ఊరికెళ్తున్నానన్జెప్పి, మా ఎదురింటాయన్నడిగితే, పాపం ఆయనిచ్చేడు. అందులో రెండు పంచెలు, నాలుగు షర్టులు -కొత్తగా కుట్టించినవి. పాపం స్టేషనుకి తీసొక్కొచ్చి యిచ్చేడు కూడాను, ఆదర్జీవాడు. రెండు సంవత్సరాల క్రితం, వాడికి పెత్తాయించిన ఆ షర్టులు, మొన్నఅంటే మొన్న.... అంతవరకు ఏవో కారణాలు చెప్పేడులే!....ఓరోజు వెళితే "అర్జెంటుగా యీ బట్టలు కుట్టాలిసార్! వాళ్లు పెళ్లికెళ్తున్నారు ఎల్లుండికల్లా మీ బట్టలు తయారు చేస్తాను" అన్నాడు.

'పెళ్ళివారి బట్టలు ముందుకానీ, వాటు తొందర ఏంటన్జెప్పి వచ్చేసి, ఆ 'ఎల్లుండి' వెళ్ళేను.

పెళ్ళివారి బటలు యింకా అలానే వేళ్ళాడుతున్నాయి. సగం కుట్టినవి. "ఏంటి అప్పన్నా!" వాడిపేరు అప్పన్నలే జెంట్స్ అండ్ లేడీస్ టైలర్' "పెళ్ళివారి బట్టలు తొందరన్నావు. అసి జూస్తే యిక్కడే వున్నాయి. ...." అన్నా. "అది కాదుసార్! ఆ పెళ్ళికొడుక్కి యీ ఫ్యాషన్ నచ్చలేదుట. కొత్త ఫ్యాషన్‌తో కుట్టమన్నాడు. అందుకు అవన్నీ యిప్పాల్సొచ్చింది. తవరి బట్టలు ఏవుంది రేపు ఆదివారానికి తయారు" అన్నాడు.

ఆ ఆదివారం కూడా వెళ్ళేను.

"వెధవది చూసేరు .... యీగోడ" అంటూ నసిగేడు అప్పన్న, నన్ను చూసి. "బట్టలు కుట్టడానికు నీకిచ్చిన నేను వెధవని, తిప్పలు పెడుతున్న నువ్వు వెధవ్వి. .... గోడకేం ఖర్మ. వెధవదవడానికి...నిక్షేపంలాపునిస్త్రీదే" అని మనస్సులో అనుకుని, "ఏవైంది గోడకి.... జబ్బు చేసిందా? ఒళ్లు తిప్పుతోందా?" అన్నాన్నవ్వుతూ.

"భలే విట్టువేసేర్ సార్!" అని పగలబడి నవ్వేడనుకో ఓ గంట. అదంతా నాకింకో సాకు చెప్పడానికి వేస్తున్న ప్లానుకి ఆలోచిస్తున్న టైము అని నాకు తెలుసు.

"ఈ గోడవల్లే మీ బట్టలు కుట్టలేక పోయానన్నాడు" ఆఖరికి. "మిషన్ తొక్కడానికి వీల్లేదందేంటి గోడ?" అన్నాను ఆశ్చర్యంగా.

ఇంకోగంట విరగబడి నవ్వుతాడేమోనని, భయపడి, అసలు విషయం

ఏంటో చెప్పమని అడుగుతే అప్పుడు చెప్పేడు ఆ కథ. "పక్క సెలర్" కయ్యానికి కాలుదువ్వేట్ట. తన జాగా ఆక్రమించేడని. ఇద్దరికీ మధ్య వుండే 'తడిక' చిరిగిపోయింది. ఇహ కొత్త 'తడిక' వేయింపడం 'అప్పన్న' వంతు అని. దాంతో మాట, మాట అనుకుని కోపంగా మిషనులు తొక్కకొని, 'పెండింగ్'లో వున్న బట్టలు కొన్ని కుట్టేసి, ఇద్దమూ కల్సిఆఖరికి, మధ్యలో గోడకట్టిద్దా(మని నిర్ణయించుకుని, కట్టిస్తున్నారట ఆ గోడ. అదీ అసలు సంగతి. ఆ టెయిలర్ ఎలాటివాడంటే

ఒకళ్ళ బట్టలు యింకోళ్ళకి తారుమారు చేసేరకం. మరీ పొడవుకాని, పొట్టి కాని చేసేస్తాడు. తప్పిస్తే సరిగ్గా యిచ్చిన కొలతల ప్రకారం కుట్టిన పాపాన పోలేదు ఎప్పుడూ.

ఇవాల్టికి కూడా ఆ పెళ్ళి వారి బట్టలు అక్కడే వేళ్ళాడు తున్నాయనుకో. అది వేరే-సంగతి.

ఇంతకీ ఏ(మిటి చెప్తున్నాను. రైల్లో దొంగతనం గురించి కదూ. ఆ మధ్య మా మేనల్లుడు, నర్సింహారావులేడూ! వాళ్ళింట్లో దొంగలు పడ్డారులే.

పెళ్ళాం, పిల్లల్ని పుట్టింటికి పంపించేశాడు. ఇంట్లో తనుంటేగా, ఎప్పుడూ చీట్లపేక వెర్రికదూ. కొత్తగా ఒక మోటారు సైకిలు కొన్నాడులే. అది వేసుకొని వెళ్ళిపోతాడు బ్రహ్మ పురాణానికి. అది తనగలకి కూడా పుచ్చు కోడనుకో ఇతడి సామాన వాట్లు. అది వేరే సంగతి. దాన్ని నడిపిస్తూ, నడవ వడమే చూశానుగాని, వాడు దాని మీదుండగా అది కదల్డం చూళ్ళేదు.

చీట్లపేకలో కూచుంటే, చీకటి పడ్డది, తెల్లవారిందికూడా తెలీదనుకో. తిండీ, తిప్పలు, పెళ్ళాం, పిల్లలు, ఇల్లూ, వాకిలి జ్ఞాపకంరావు.

ఇది కనిపెట్టిన, తెల్సిన వాడే ఎవడో, అవకాశం చూసుకుని, తాళం పగులగొట్టి శుభ్రంగా యింట్లోవున్న వస్తువులన్నీ మోసుకెళిపోయేడు. ఖరీదైన రేడియో, టెరిన్ బట్టలు, స్టీలు సామాన్లు, అన్నీ కొట్టేశాడు.

"ఇన్నీ పోయినా, నాకు అభ్యంతరం లేదుగానీ, అది పోవడం మహాబాధగా వుందన్నాడు నర్సింహం.

"అది ఏది?" అనడిగేను.

"నిన్ననే కొన్న రెండు పేక దస్తాల పేకెట్టు." అన్నాడు లోకంలో వున్న విచారాన్నంతా మొహంలో చూపెడ్తూ.

"ఓరి అప్రాచ్యుడా! అసలుసిసలు ఖరీదైన సామానుపోతే ఏడవక వెధవ అణా పరక పేకపోతే అంత ఏడుపేంటిరా?" విని రెండు చివాట్లు తిన్పించి, వచ్చేను.

అయినా యీదొంగతనాలు చెప్పి చేస్తారా, ఎవరైనా. మన జాగ్రత్తలో మనం వుండాలిగాని...."

***

[96 వ పేజీ తరువాయి]

నల్లటి ఏనుగులలా ఉన్నాయి. ఏనాడో ఎవరో కట్టించినవి, ఈ నాటికి అస్థిపంజరాల్లా మిగిలేయి. తన యిల్లు అది. తన తాతో, ముత్తాతో, మరెవడి తాతో ముత్తాత దగ్గర కొన్నది. అది తనకి మిగిలింది. తన తండ్రి చిన్ననాడే పోయేడు. పెద్దయ్యేక తల్లి పోయింది. ఆర్మీలో చేరే ముందే పెళ్ళి చేసుకున్నాడు, తల్లి బలవంతం మీద. పెళ్ళి చేసుకున్నాక, నౌకరీ దొరక్క, ఆర్మీలో ఎస్. సి. ఓ. గా చేరాడు. ఐదేళ్ళయి రావడం, పోవడం-యుద్ధం ఆరంభమయ్యేక మరి రాకపోకలు లేవు. రెండేళ్ళయింది. ఆర్మీలోకి వెళ్ళిన మరుసటేడే తల్లి, మునసబు డాక్టర్ దగ్గర ట్రీట్మెంటు పొంది చచ్చిపోయింది. ప్రక్క ఇంట్లో అద్దెకుంటున్నాడు అప్పలరాజు. స్కూల్లో తనకన్న రెండేళ్ళు ఎక్కువ. వయస్సులో ఐదేళ్లు చిన్న-కాని అన్ని విధాలా తనకన్న పెద్ద జీవితానుభవంలో - ఇద్దరూ దగ్గర మిత్రులయ్యేరు .... పెళ్ళయి తను ఆర్మీకి పోవడానికి నిశ్చయించుకున్నాడు. అప్పలరాజు ఇన్సూరెన్సు ఏజెంటుగా, సిగరెట్ల ఏజెంటుగా ఏవో చిన్నచిన్న, నెల్లాళ్ళుకూడా కాకుండా ముస్తూ ఉద్యోగాలు చేస్తూ వుండిపోయేడు, పెళ్ళి చేసుకోడంట. అలా అని బ్రహ్మచారికాడు. ఆ సంగతి తనకి తెలుసు. అప్పలరాజు ప్రక్క పేటలో ఉంటున్నాడు. అదే వాడి ఆఫీసు, ఇల్లు అన్నీ-వాడి తల్లి, తండ్రీ పల్లెటూరులో భూములు చూసుకుంటున్నారు. వీడికి చిన్న పట్నం వదల బుద్ధికాలేదు.

అప్పలరాజు..ప్రాణస్నేహితుడు... తను లేనప్పుడు, తన భార్య బాగోగులు చూస్తానన్నాడు .... "చెల్లెమ్మ భారం నామీద వదిలీరా అప్పారావ్! ఏలోటూ లేకుండా చూస్తాను!" అన్నాడు. కాని తనకే కాస్త జంకువేసింది .... వీడి సంగతి తెలీందికాదు. సాని వీధిలో ఒకర్తెనుంచేడు. ఆడ లాయర్తో ఇప్పటికీ సంబంధముంది. ఇంకా ఎన్ని గ్రంథాలు నడిపేడో వాడికే తెలియాలి. వీడికి తల్లీ, చెల్లెలూ తప్ప ఆడదంటే ఆడదేనని అప్పారావు దృఢనమ్మకం. వీడికి అందమైన తన భార్యని, బాగోగులు చూడమని అప్పగించడం ఎలా? అప్పలరాజు అది గ్రహించకపోలేదు. వెంటనే అన్నాడు. "ఒరే అప్పారావ్! నా అవినీతిలో కూడా ఒక నియమం ఉంది. స్నేహితుల భార్యలనీ, అప్పచెల్లెళ్ళనీ చూస్తే నాకు సోదర భావం తప్ప మరేమీ ఉండదు .... నా తల్లిమీద ఒట్టువేసి చెబుతున్నాను నమ్ము!" అన్నాడు. మగాడు మంచివాడే కావచ్చు....కాని ఒంటిగా ఉన్న ఆడదాన్ని నమ్మడం ఎలా? దానికి తిక్క పుడితే అప్పల

రాజా కాదు. వాడి కొరకన్నా దిగి రావాల్సిందే....

అప్పలరాజా! .... ప్రాణ స్నేహితుడు కాడు!—ఆ ఉత్తరం ఎన్నో జాగాలు తిరిగి తిరిగి నలిగి, నలిగి నెలాళ్ళ క్రితం అందింది. ఎవడో ఆకాశ రామన్న రాసేడు. తన భార్య శీలం మంచిది కాదుట. అప్పలరాజుతో అవే తిరగడాలు, షికార్లుట .... "ఇందుకే నీకు పిల్లలు లేరు—నలుగురూ నడిచే చోట గడ్డెలా మొలుస్తుంది?" అంతా ఏదో పిచ్చి రాతలన్నీ రాసేడు. ఎవడో కిట్టనివాడై యుంటాడు. కాని ఏమో? ఒంటరిగా ఉన్న ఆడ, మగలని ఎవరు నమ్మమన్నారు—

వంటరి ఇళ్ళని సమీపించేడు సిపాయి....యివాళ ఏదో ఒకటి తేలి పోతుంది. నిజమే అని రుజువైతే, యిద్దరి మృతదేహాలు రేపు ఉదయానికి చెరువు అడుగున పడిఉంటాయి. "ఎంతకి తెగించింది ముండ! మొగుడ్ని మోసంచేసి, రంకుమొగుడితో కల్సి ఆత్మహత్య చేసుకుంది. మొగుడొచ్చేడు, ఇంక గ్రంథం నడవదని?" అని అందరూ ముక్కుమీద వేలువేసుకొని, తనపట్ల పూర్తి సానుభూతి చూపిస్తారు. వాడిని భోజనానికి పిలిచి, మత్తుమందు ఇద్దరికీ షర్బత్తులో కలిపి యిచ్చి, ఊపిరి ఆపి, చంపి, యిద్దర్నీ కట్టి చెరువులో, అర్ధరాత్రప్పుడు పడేవచ్చు. లేదా పెరట్లోని నూతిలో పడేవొచ్చు? తనుచంపేడంటే ఎవరూ నమ్మరు. అందరూ దద్దరిల్లేటట్టుగా తను ఏడవగలడు. యుద్ధంలో పీఠంది ని బిరుదు పొందిన తన సేవను అనుమానించగలరు? ఇంతకి—

ఇంటిముందు వెదురు దడి ఉంది. అది దాటి ఇంట్లోకి వెళ్తూ, ప్రక్క ఇంటిని సంబోధిస్తూ కేక పెట్టేడు సిపాయి—అంత గట్టిగా కాదు.... మామ్మూలుగా....పిలిచినట్టూ ఉండాలి, పిలవక పోయినట్టూ వుండాలి. "అప్పలరాజూ! ఒరేయ్ అప్పలరాజూ!"


ఇంటి కిటికీలు కాని, తలుపులుకాని తెరుచుకోలేదు .... ఎందుకు తెరుచుకుంటాయి? ఇద్దరూ మాంచి నిద్రలో ఉండి ఉంటారు .... జాముపొద్దెక్కిందనన్నా మరిచిపోయి....అయితే ఉత్తరంలో రాసింది నిజమేఅయిఉంటుంది.

అతడి ముఖం ఎర్రబారింది, అవమానంతో, కోపంతో, కసితో.

ఆవరణలోని తోట పువ్వులతో కళకళ లాడుతోంది.

తన ఇంటి సావిడిలో, ఒకమూలకి పసుపుచుట్ట పిసిరి, ఉస్సురుమంటూ చతికిలపడి, గోడకు చేరబడ్డాడు.

ఇంటి తలుపు వేసే ఉంది. రాకపోకలు అన్నీ పెరట్లోంచే అయినప్పుడు వీధి తలుపులు ఎందుకు తెరవడం! ఇంతకీ ఇది వాడి గదిలో ఉందా, వాడు దీని గదిలో ఉన్నాడా. బహుశా ఇదే అక్కడ ఉండి ఉంటుంది. ఉన్నట్లుండి లేచి, చప్పుడు చెయ్య



కుండా, తలుపు దగ్గరికి వెళ్ళి, చెవి తలుపుదగ్గర ఆన్చి, విన్నాడు శ్రద్ధగా.

లోపల నవ్వులు, కిలకిలలు; గుసగుసలు ఏవీలేవు — ఐతే ఈ ముండ, వాడింట్లోనే ఉండి ఉండాలి. ఛీ! తన మగతనం మండిపట్టే ఉంది — ఒక ఆడది ఎన్ని ఆటలాడించగలదు! నలుగురు పెటులని మంచంకింద దాచి, మొగుడితోకూడా ఉందిట ఒక చతురాలు ఒక పంచతంత్రం కథలో.

కోటుజేబులోనుండి సిగరెట్టు తీసి వెలిగించి ఒక దమ్ము లాగేడు.

అనుకోకుండా తలుపు తెరుచుకుంది.

ఉలికిపడి, కళ్ళు పైకెత్తాడతడు.

ఎదురుగా నిల్చుంది తన భార్య. విచ్చిన గులాబీలా తల వెంట్రుకలు విరబోసుకొని, ఒక రిబ్బనుతో ముడి వేసింది. లేతగులాబీ రంగు డిజైనున్న సరికొత్త వాయిల్ చీర రాత్రి కట్టుకోడం వల్ల నలిగి, ఆ చీరలో మరింత అందంగా కనపడేటట్టు చేస్తోంది. లేత కెంపురంగు ఛాయలో, పెద్ద అమాయకమైన అందమైన కళ్ళతో, మగడిని పిచ్చెత్తించే అంత అందంగా అతడికి కనిపించింది. క్షణకాలం అతడికామె మీద ఎనలేని ప్రేమ పెల్లుబికింది-కాని వెంటనే అసూయాపు జ్వాలలో అది దహించుక పోయింది.

అతడిని చూడగానే ఆశ్చర్యంతో క్షణకాలం మాటలు లేకుండా ఉండి పోయింది. మొదట గుర్తు పట్టలేదు. గుర్తు పట్టగానే ఆశ్చర్యం, ఆనందం ఆమె ముఖంలో ప్రతిబింబించాయి. ఉక్కిరి బిక్కిరిగా అరిచిందామె. "మీరా!"

అతడిలో ఆగ్రహం బుసలు కొట్టింది "మీరా" అనిఅడుగుతోంది- నేను కాకపోతే మరెవరనుకుంది. ఆ యుద్ధంలో, ఆ మంచులో చస్తాననుకుంది. చచ్చేక రంకు మొగుడితో ఇంక విచ్చలవిడిగా కులుకుదామనుకుంది. వాడ్ని ఇంట్లోంచే, వెంటబెట్టుకొచ్చి, ఇంట్లో దూరింది. లేకపోతే ఇంత అందంగా సింగారించుకొని, రాత్రి నిద్ర తియ్యాల్సిన అవసరం ఏముంది. తను ఇలా గాలిలోంచి దెయ్యంలా ఊడిపడతాడను కోలేదు. ఎంత ఆశాభంగం.

కోపం పెల్లుబికగా అరిచేడు — "ఔను! నేనే! ఏం, నేను రావడం నీకిష్టం లేదా? — ఎప్పుడూ అక్కడే ఉండి పోతాననుకున్నావా?"

భయంతల్ల వెనుకకు తగ్గింది.

"ఒచ్చాక తలుపు కొట్టీ, కొట్టీ చేతులు పడిపోయాయి! ఎక్కడ చస్తున్నావు?" ఈ మాట అన్నాక, వెంటనే ఆలోచించుకున్నాడు- తను బయట పడిపోకూడదు. బయట పడిపోతే అసలు నిజం బైటపడదు —

"ఏమండీ, మీరు ఒస్తున్నట్టు ఒక్క ఉత్తరం ముక్కైనా రాయలేక పోయారా? స్టేషనుకి వచ్చిఉందును..."

"స్టేషనుకి వచ్చి ఉందువేం! ఛీ... అబద్ధాలు!" ఉత్తరం రాస్తే స్టేషనుకి వచ్చి ఉండును. అప్పుడిలా పట్టుబడి పోడానికి అవకాశం ఉండదు. ప్రేమ ఒలకబోస్తూ తనని తియ్యగా మోసం చేసును —

ఆమె ఏమీ అర్థంకానట్టు బాధగా అంది — "ఏమిటండీ ఆ మాటలు — నా కెంత ఆనందంగా ఉందో మీరు రావడం —"

"నోర్ముయ్యి!"

పరుపుచుట్ట ఎత్తి గదిలోకి విసిరేడు.

పిచ్చివాడిని ఆశ్చర్యంగా చూసినట్టు చూసిందామె.


"ఇక్కడి నిలువుటద్దం ఏదీ?" అని బొబ్బలు పెట్టేడు —

తత్తరపాటుతో అంది — "క్రిందటి సారి అమ్మ ఒచ్చినప్పుడు ఇచ్చేను.. చెల్లి మారాం చేస్తోందిట. కాలేజీలో చేరింది కదా?..అన్నీ మీకు రాసేనే.. ఉత్తరాలు నావేవీ మీకందలేదా?"

ఇది ఏ ఉత్తరాలూ రాయలేదు.... ఈనిలువుటద్దం ప్రక్కవాడిపడకగదిలో ఉంటుంది ..సరే... చూద్దాం.

"అమ్మకిచ్చేవా?..ఎవడిమ్మన్నాడు?"

"ఏమండీ ఇలా మారిపోయేరు?... ఏమయింది మీకు?... మీరు తిరిగి



వచ్చేవరకూ ప్రాణాలు పిడికిట్లో పెట్టుకొని కాలక్షేపం చేస్తున్నాను ... వెంకటేశ్వరుడికి ముడుపు కట్టుకున్నాను..."

రక్తం నేర్పింది బొంక నేరుస్తుంది. ఎన్ని నీతులైనా చెప్తుంది.

"నోర్ముయ్యి!"

చిన్న గొంతుతో అన్నదామె. "అలిసిపోయేరు. స్నానం చెయ్యండి. కాఫీ చేసి తెస్తాను."

అతడు అరిచేడు..."ఒద్దు...నాకేమీ ఒద్దు ఈ ఇంట్లో...అక్కడికి పోయి, ఆ కొండల్లో, ఆ మంచులో గుళ్ళ దెబ్బలు తింటూ బతుకుతామో చస్తామో ఏ క్షణానికేదో తెలియక రోజులు గడుపుతాం....నువ్విక్కడ, నీ ఇష్టమొచ్చినట్టు జల్సా చేస్తూ...."

"ఏమండీ!" ఆమె కేక పెట్టింది.

అతడు తగ్గేడు ... ఆమె అతడిని వెనక నుండి సమీపించి, పెనవేసుకొని, ప్రేమగా అంది - "ఎందుకు నా మీద ఇంత కోపం?"

మోచేత్తో నెట్టేసాడామెని. బాధతో మూల్గిందామె.

"నోర్ముయ్యి!" ఆ మాటలంటూ, టేబిలు మీద పుస్తకాలు తణికీ చేస్తేడు. డ్రాయరు సొరుగు తెరిచి కాగితాలు చూడసాగేడు .... అందులో అతడికి కనిపించింది అప్పలరాజు ఫోటో.... ఉలికిపడి, కోపాన్ని అణచుకొని అన్నాడు....

"అప్పలరాజు ఫోటో కదూ?". కనురెప్పలెత్తి కన్నగిటి, ఎప్పుడూలేని శాంతాన్ని అలవరచుకొని ప్రశ్నించాడు.

దగ్గరిగా వెళ్ళి పిరికిగా ఆ బొమ్మను చూస్తూ అన్నదామె ...

"ఔను."

"ఇచ్చేడా?"

"మీకే ఉః చేరక్కూడ .... గుర్తు లేదా?"

ఉరిమినట్టుఅన్నాడు. "నోర్ముయ్యి! అబద్ధాలు! అబద్ధాలు! ...ఎప్పట్నించి మరిగేవు దీని! ఎంత మోసం చేసేవ్ నన్ను! ఉత్తరం వస్తే ఎవడో కిట్టని వెధవ రాసేడనుకొన్నాను. అందుకే నే పెట్టి పిచ్చివాడినిపడడు! మిత్ర ద్రోహి.... నమ్మక ద్రోహి మీ ఇద్దర్నీ ముక్కలు ముక్కలుగా నరుకుతాను." అతడి ప్లానంతా మారిపోయింది. చెయ్యదలచుకున్న పని అనేసేడు... దీన్ని మళ్ళా తెలివిగా మార్చాలి. కాని కోపం, ఆవేశం, ఆలోచనని అనుకున్నట్టు సాగనివ్వడం లేదు. తన అనుమానం అబద్ధం అవుతుందను కున్నాడు- కాని అది నిజమవ్వడంతో. ఎవరో తన పురుషత్వాన్ని వెన్నులో పొడిచినట్లయింది. ఛీ... వెధవబతుకు ...అతడిలోనిజీవం పోయినట్టయింది. శక్తి ఇంకిపోయింది. నైరాశ్యం ఆవహించింది.

నమ్మలేనట్టు అతడినిచూసి. కళ్ళు చేతులతో కప్పుకొని ఏడుస్తూ అందామె...."మీకు నా ఉత్తరాలే అంద లేదా? అప్పలరాజు ఏనాడయ్యో చచ్చిపోయేడు.... ఎమర్జన్సీలో ఆర్మిలో చేరేడు. నేఫాకి వేసేరు. ఏమయ్యేడో తెలీమట. చచ్చిపోయేడని టెలిగ్రాం వచ్చింది. అప్పలరాజు మీదా మీ అనుమానం! నన్ను నిజంగా చెల్లెలి మాదిరిగా చూసేడు. ఎంత జాలి లేకుండా తయారయ్యేరు!..."

స్థంభీభూతుడయ్యేడు అతడు. అప్పలరాజు యుద్ధంలోచేరి, నేఫాలో కనిపించకుండా పోయేడా? చచ్చిపోయేడా? రక్తాన్ని కరడు కట్టించే ఆ మంచులో, అప్పలరాజు ప్రాణం లేని దేహం, ఆ హిమాలయాలకే అంకితం అయిపోయిందా? లేదా, దారి తప్పి మంచులో సజీవ సమాధి పొందేడేమో. ఎక్కడున్నాడో... ఏమయిపోయేడో...

అప్పలరాజూ! అతడి మనసు ఏడ్చింది. ఆ మంచు ప్రాంతంలోకి వెళ్ళి గాలించింది. మరింకెక్కడి అప్పలరాజు. తప్పిపోయిన, చచ్చిపోయిన, వేలకొలది సిపాయిల్లో ఒకడయిపోయేడు.

దుఃఖం ఒక్క క్షణమే.

ఆ క్షణం గడిచిపోయేక, ఎందుకో మనస్సు తేలిక పడింది. సంతోష రేఖలు ముఖంలోకి తిరిగి వచ్చేయి. పోయిన పురుషత్వం తిరిగి వచ్చినట్టయింది.

శాంతంగా, తాపీగా, సిగరెట్టుతీసి ముట్టించి, తోటలో విడుతున్న ఒక ఎర్ర గులాబీని చూస్తూ అన్నాడతడు చల్లగా. "కాఫీచేసి పట్రా! ఓహ్! అలిసిపోయేను. వెధవ ప్రయాణం!"

కాని ఆమె కదలలేదు.

ఏడుస్తూనే వుంది. వెక్కి వెక్కి... అవమానభారంతో... ఏమీ చెయ్యలేని కోపంతో...!


***

ఎన్. టి. ఆర్. ద్విపాత్రాభినయంతో 'గండికోట రహస్యం'

సినిమా

ఏ యుగంలో నయినా ఏ దేశంలో నయినా నీతులు చెప్పేవారు, అధికారం చేజిక్కించుకోవాలని పన్నాగాలు పన్నేవారు, దాని కోసం అంతులేని వాగ్దానాలు చేసేవారు కానవస్తూనే వుంటారు. కాని, అలాంటి అధికారం లభించాక ఎందరు దాన్ని సద్వినియోగపరచుకొని, దేశక్షేమానికి రాచబాట వేయగలుగుతారు?

రాజా అతి విచిత్రమైన, అతి సామాన్యమైన యువకుడు, విద్యగల



వ్యక్తిగా దేశక్షేమాన్ని, ప్రజల సౌఖ్యాన్ని ఆశించాడు. ఏ రాజా యొక్క రాజపాలన ధిక్కరించి, సరిదిద్దాలని 'రాజా' సంకల్పించి రాజధానికి వెళ్ళాడో, సరిగ్గా అదే రాచకార్యాన్ని చేపట్టటం ఆ యువకుడికి తప్పనిసరి అయింది. దానితోపాటు అంతులేని బాధ్యతలు తరుముకొచ్చాయి. అయినా, అతను వాటిని చూచి చెదరలేదు, బెదరలేదు. ప్రజలసమస్యలను సావధానంగా విని వాటికి ప్రతిభావంతమైన పరిష్కారాలను చేయించాడు. తత్ఫలితంగా ఆ రాజ్యం రామరాజ్యం అవుతుంది. అదే సమయంలో రాజా సింహాసనం తనకు వలదని క్రిందకుదిగివచ్చాడు. అందుకు కారణం యేమిటి? — అదే "గండికోట రహస్యం" లోని ఒక ముఖ్యకీలకం.

ఆంధ్రుల అభిమాననటుడు, శ్రీ ఎన్. టి. రామారావు ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ సరికొత్త జానపదం "గండికోట రహస్యం" అతిత్వరలోనే విడుదల అవుతుంది. శ్రీ డి. వి. యస్. రాజు నిర్మించే

ఈ చిత్రానికి శ్రీ తలాచార్య దర్శకత్వం వహిస్తున్నారు. ఫొటోగ్రఫీ నిర్వహిస్తున్న శ్రీ ఎస్. ఎస్. లాల్ అత్యాధునిక పద్ధతులలో చక్కని పనితనాన్ని, మెళకువలు చూపుతున్నారు.



చిత్రకల్పనా వారి తొలి చిత్రంలో
విజయనిర్మల

కళ : కళాధర్, నాగరాజ్; నిర్మాణం : డి. వి. యస్. ప్రొడక్షన్స్.

శ్రీ ఎన్. టి. రామారావుతోపాటు జయలలిత, దేవిక, రాజనాల, రాజబాబు, మిక్కిలినేని, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, రావి కొండలరావు, రమాప్రభ, హేమలత, ప్రభృతులు ముఖ్య భూమికలు వహిస్తున్నారు.

తారాశశాంకం

రామకృష్ణ పిక్చర్స్ వారి "తారాశశాంకం" పూర్తయ్యింది. ఏప్రిల్ నెలాఖరులో పూర్ణా ద్వారా విడుదల చేయుటకు సిద్ధపడుతున్నారు. శోభన్ బాబు, దేవిక, గుమ్మడి, అల్లు రామలింగయ్య, బాలకృష్ణ, వాణిశ్రీ, రామయ్య, ధూళిపాళ, మొదలైన తారాగణంతో నిండిన ఈ చిత్రానికి టెక్నీషియన్స్. దర్శకుడు : మానాపురం, రచన : కీ॥ శే॥ సముద్రాల, కళ : టి. వి. రాజేంద్రకుమార్ బి. ఏ., నిర్మాత: కె. సత్యనారాయణ బి. ఎస్‌సి. కూర్పు : బి. హరినారాయణ నిర్మాణ, నిర్వహణ: పం. సుబ్బరామాల్ల బి. ఎ.

అజంతా మూవీస్

ప్రొడక్షన్ నెం. 1

కాంతారావు ద్విపాత్రాభినయంతో రాజశ్రీ, విజయలలిత, రాజబాబు, ప్రభాకరరెడ్డి మొదలైన తారాగణంతో భరణీ స్టుడియోలో షూటింగ్ జోరుగా సాగుతోంది.



"కన్నెల పండుగ"లో కె. ఆర్. విజయ

ఈ చిత్రం ద్వారా మరో దర్శకుడు శ్రీ వి. హనుమంతరావు ఆంధ్ర ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నారు. రచన : వి. కె. మూర్తి, సంగీతం : ఘంటసాల, నిర్మాతలు : బి. కృష్ణమూర్తి, మహేంద్ర.

సంఘాన్ని ఎదుర్కొన్న సాహసవతి

ఆడదాని జీవితం అరటాకు లాంటిది. సున్నితమైన ఆ జీవిత గమనంలో తెలిసిగానీ, తెలియకగానీ కాలు

జారితే ఫలితం అనుభవించ వలసింది స్త్రీ మాత్రమే.

అనాదిగా బలమైన పురుషులతో నిర్మితమైన సంఘపు కట్టుబాట్లను ఎదిరించి ధైర్యంగా నిలుచుంది మధ్య తరగతి కుటుంబానికి చెందిన లలిత. కారణం ధనవంతులింటిబిడ్డ ప్రసాద్‌కు మనసిచ్చింది. ఆమెను తప్పక వివాహమాడతానని ప్రమాణం చేశాడతను. ఆ ఆనందంలో పరస్పరం తనువులు మరిచి సుఖించారు ఆనాటి ఆనంద కలయిక లలిత అవివాహితగా గర్భవతి అయింది. లోకం కోడై కూసింది. కనుచూపవలసిన ప్రసాద్ తండ్రి గర్భస్రావం చేయించుకోమని ఐదు వేల రూపాయలివ్వబోయాడు చుట్టుప్రక్కల వారికంతా ఆమె పరిస్థితి ఆనందదాయకమైంది. లోకోపవాదు లను వినలేక ఆమెతండ్రి చంద్రశేఖర్ ను లలితను గడప దాటొద్దన్నాడు. కానీ సంఘమంటే చీదరించుకునే లలిత ఆయన మాటలను పెడచెవిని పెట్టింది. ప్రసాద్ అమెరికా నుంచి తిరిగి వచ్చేంత వరకూ ఎటువంటి అవాంతరాన్నయినా ఎదుర్కొనేందుకు సిద్ధపడింది. నెస్‌కేఫ్ టిన్ కొనేందుకు దగ్గరలో వున్న స్టోర్సుకు వచ్చింది.

ఆమె స్టోర్సులో అడుగుపెడుతూనే గుమస్తాల మధ్య గుసగుసలు బయలు దేరాయి. అది గమనించిన లలిత ధైర్యంగానే లోపలకు ప్రవేశించింది.

"నెస్‌కేఫ్ యిస్తారా?" ఒక గుమస్తాను అడిగింది.

"ఆఁ. ఏం కావాలి?" పరిహాస ధోరణిలో వినిపించనట్టు అన్నాడు గుమాస్తా.

"నెస్‌కేఫ్" బిగ్గరగా అంది.

"ఓఁ...." అంటూ యిప్పుడు విని పించినట్లు వరుసగా వెళ్ళి, తిరిగి వచ్చాడు. "యస్ మే డమ్...." అంటూ అందించాడు పాలబుక్కిని.


లలిత అదిరిపడింది. తేరిచూసిం దతన్ని. "మీరు చాలా బుద్ధిమంతుల్లా కనిపిస్తున్నారు. నాకు ముందురాబోయే అవసరాన్ని యిప్పుడే కనిపెట్టాడు. ఆ సమయం వచ్చినప్పుడు మీ దగ్గరే కొంటాను" అంటూ అతనిముఖంమీదికి విసిరింది.

"ఇంతకీ మీ స్టోర్స్‌లో కాఫీపొడుం వుందా లేదా?" గద్దించింది.

ఇదంతా దూరాన్నుంచి గమనిస్తున్న మేనేజరు పరుగున వచ్చాడు. "పూర్సె గెట్ బాక్. సారీ మేడమ్" అంటూ నెస్‌కేఫ్ టిన్ ను అందించాడు. అతని ఆదరాభిమానాలకు కృతజ్ఞతతో చూపి, వెనుతిరిగింది లలిత.

ఆమె కృతజ్ఞతకు మరింత ఉంగి పోయిన మేనేజరు వెళ్ళిపోతున్న లలితను చూసి బయటుగా నిట్టూరుస్తూ, "ఆహాఁ....ఎంత అభిమానంగల పిల్ల" అన్నాడు.

నేటి సామాజిక వ్యవస్థలో అవ



"గండికోట రహస్యం" లో రామారావు, జయలలిత

వాదులు గురైన ఆడదంటే ఎంతో నీచంగా ప్రవర్తించే పురానా వ్యక్తుల మనస్తత్వాలను ప్రతి స్త్రీ, పురుషుడు తెలుసుకొనే రీతిలో చిత్రీకరిస్తున్న దిగ్విజయావారి ప్రబోధాత్మక సాంఘిక చిత్రంలోనిదీ సన్నివేశం.

నట వర్గం : పద్మశ్రీ నాగయ్య, హరనాథ్, రామకృష్ణ, కె. వి. చలం, మిక్కిలినేని, రావికొండలరావు, విజయనిర్మల, రమాప్రభ, ఛాయాదేవి, జేబి బ్రహ్మాజీ (మూగనోము ఫేమ్) మొదలగువారు.

సాంకేతిక వర్గం : కథ, మాటలు : సముద్రాల జూనియర్, పాటలు : సి. నారాయణరెడ్డి, దాశరథి, కొసరాజు, సముద్రాల ; సంగీతం: టి. చలపతిరావు, ఛాయ : యం. కె. రాజు, కూర్పు : శ్రీహరిరావు, కళ : చలం,

ప్రొడక్షన్ కంట్రోలర్ : డి. కోటేశ్వర రావు, దర్శకత్వం : శోభనాద్రిరావు.

నిర్మాతలు : కె. జయశేఖర్, జి. వి. రత్తయ్య.

ఆంధ్ర : రాయల ఫిలింస్; సీడెడ్: జయలక్ష్మి పిక్చర్స్ విడుదల.

శ్రీమతిగా మారిన కుమారి

'కుమారి' కృష్ణకుమారి 'శ్రీమతి' కృష్ణకుమారిగా మారింది ఆశ్చర్యంగా లేదూ! ఎంత మాత్రం ఆశ్చర్యపడ నక్కరలేదు. ఇది 'గాకెటేజ్' అమర్త్య దేవిక చేసింది ఈ పనే. తాము ... తేదీన . . వారిని వివాహమాడబోదు న్నట్లు ముందుగా తెలియచేస్తే ఈ తారలకేమైనా ప్రమాదమేమో! (అభిమానుల ముంచీ సుమండీ) ఏదైతే నేం - కుమారి - శ్రీమతి అయ్యింది.



"భలే అమ్మాయిలు" లో గుమ్మడి

ఇక ముందు, ఇంతకు ముందు కంటె మరింత హుందాగా మెప్పిస్తుందని (చిత్రాల్లో) ఆశించటంలో తప్పేం లేదు.

కుమారి దంపతులకు ఇదే జ్యోతి శుభాకాంక్షలు.

విచిత్ర కుటుంబం

శ్రీరాజ్ ఆర్ట్ ఫిలిమ్స్ వారు నిర్మి స్తున్న చిత్రం "విచిత్ర కుటుంబం" చిత్ర విచిత్ర కథాగమనాలలో, హాస్య లాస్య సన్నివేశాలతో అడుగడుగునా గిలిగింతలు పెట్టే ప్రేక్షక ఆకర్షణీ యాల వెనుక గంభీరమయిన కార్య దీక్ష, వాత్సల్యాలు దాగివున్నాయి.

ఈ చిత్రంలో సరస, హాస్య, గంభీర, రసగర్భితమైన రాజశేఖరం పాత్ర నటరత్న ఎన్. టి. రామారావు పోషి స్తున్నారు. ఆయన ఆదర్శ సతీమణి కమల పాత్ర శ్రీమతి సావిత్రి ధరిస్తు న్నది. వీరుగాక కృష్ణ, నాగభూషణం, రాజబాబు, మిక్కిలినేని, ప్రభాకరరెడ్డి, గణేశ్-విజయనిర్మల, ఛాయా, సంధ్యా రాణి, మీనాకుమారి, పుష్పకుమారి మరియు శోభన్‌బాబు నటిస్తున్నారు.

ఈ విచిత్ర చిత్రానికి దర్శకుడు : శ్రీ కె. ఎస్. ప్రకాశరావు, రచన : భమిడిపాటి రాధాకృష్ణ, సంగీతం : టి. వి. రాజు, పాటలు : డా. సి. నారా



"విచిత్ర కుటుంబం"లో శోభన్‌బాబు, షీలా

• • •

"శభాష్ సత్యం" లో సత్యనారాయణ, సత్యం



యణరెడ్డి, నిర్మాత : వి. కె. పి. సుంకవల్లి.

ఈ చిత్రం విజయా పిక్చర్సుద్వారా మేనెలలో విశాలాంధ్ర అంతటా విడుదల అవుతుంది. ఉషా ఫిలిమ్స్‌ద్వారా నైజాంలో విడుదల అవుతుంది.

ఆత్మీయులు

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి కథ నాధారంగా, పినిశెట్టి మాటలతో, రాజేశ్వరరావు స్వరలహరితో, వి. మధుసూదనరావు దర్శకత్వంలో తయారయ్యే యీ చిత్రానికి నిర్మాణ వ్యవహర్తయే గాకుండా, స్క్రీన్‌ప్లే బాధ్యత కూడా గ్రహించారు దుక్కిపాటి మధుసూదనరావు.

నాగేశ్వరరావు, నాగభూషణం, వాణిశ్రీ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

చిత్రసీమలో

నాటకాలరాయుడు

హరిహర ఫిలిమ్స్ అనే నూతన సంస్థ తమ పై చిత్రాన్ని పూర్ణాపిక్చర్స్ ద్వారా ఆంధ్రులకు పంచడం చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుని గత నెల 14వ తేదీన 2 పాటలుకూడా రికార్డింగ్ జరిపారు.

తారాగణం : కాంచన, అనిత, హేమలత మొ॥

చంద్రబలం : నాగభూషణం, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, నాగయ్య, పద్మనాభం,

టెక్నికల్ ఫోర్స్ : ఎ. చిరంజీవి (దర్శకత్వం) జి. కె. వెంకటేష్ (మ్యూజిక్)

ప్రొడ్యూసర్ : శ్రీదిడ్డి శ్రీహరిరావు.

మహాబలుడు

మాంత్రిక ఛాయాగ్రాహకుడు శ్రీ రవికాంత్ నగాయిచ్ దర్శకత్వం వహించి, ఛాయాగ్రహణం నెరపిన భారతీ పిక్చర్స్‌వారి "మహాబలుడు" సర్వాంగ సింగారమై విడుదలకు ఎదురు చూస్తోంది. నిర్మాత పి. మల్లిఖార్జునరావు, దర్శకుడు నగాయిచ్, మ్యూజిక్ డైరెక్టరు కోదండపాణి చిత్రంలోని అసాధారణమైన సన్నివేశానికి మ్యూజిక్ (రీ-రికార్డింగ్‌సందర్భంలో) గూర్చి సమాలోచనలు జరిపారు.

ఈ చిత్రంలో కృష్ణ, వాణిశ్రీ, గీతాంజలి, రావి కొండలరావు, రాజబాబు, నాగయ్య, త్యాగరాజు ప్రధాన పాత్రలు పోషించారు.

కథ, మాటలు : అప్పలాచార్య. పాటలు: సి.నా.రె, దాశరధి, ఆత్రేయ. ఆర్టు : యస్. కృష్ణారావు, రిలీజ్ : శ్రీ ఫిలిమ్స్.

భలేరంగడు

శ్రీ విజయభట్ (ప్రొడక్షన్స్) సమర్పించు పై చిత్రం శరవేగంతో పూర్తి దిద్దుకొంటూంది ఈ చిత్రంలో నాగేశ్వరరావు ధరించే పాత్ర రూపకల్పన విచిత్రంగా ఉంటుందంటున్నారు. యువ దర్శకుడు తాతినేని రామారావు దర్శకత్వం వహిస్తున్నాడు.



చైత్రమాసం

సినిమా పాటల పోటీ

రూ 350-00 ల విలువచేయు

బహుమతులను గెలవండి !

ప్రవేశరుసుము లేదు !   అతిసులభము !

మీ అభిప్రాయాలు నిర్మాతల దృష్టిలోకి
తీసుకురావటానికి మంచి అవకాశం

1. శ్రీ దేవి కంబైన్స్ "భలే అబ్బాయిలు"
2. విజయ గిరిధ్వజ వారి "భలే మాస్టారు"
3. సురేష్ మూవీస్ "బొమ్మలుచెప్పిన కథ"
4. ఎమ్. వి. ఆర్ పిక్చర్స్ "ముహూర్తబలం"

(క్రిందటి పోటీలో పేర్కొన బడిన 'మహాబలుడు' 'ఆస్తులు అంతస్తులు' చిత్రాలకు యీ నియమాలూ గడువే వర్తిస్తాయి)

మూడే నిబంధనలు

1. పాటలను ప్రత్యేకంగా గమనిస్తూ పై చిత్రాలను చూడండి. సంగీత, సాహిత్య, సన్నివేశాలదృష్ట్యా పాటలు ఉత్తమంగా

వున్నవనిపించే ఒక చిత్రాన్ని ఎన్నుకోండి. ఆ ఒక్క చిత్రంలో అత్యుత్తమమనిపించే ఒక పాట గురించి, మీ కెందుకు నచ్చిందో సకారణంగా 15 పంక్తులకు మించకుండా వ్రాయండి.

2. అదే చిత్రంలో మీకు నచ్చని పాట ఏదో కూడ ఆ కాగితంపైనే వ్రాయండి. దీనికి కారణాలు వ్రాయకూడదు.

3. కాగితానికి ఒక వైపునే వ్రాయండి. దిగువ మీ పేరు, పూర్తివిలాసం వ్రాయండి.

* పై వాటిలో ఏ ఒక్క నిబంధనా ఏ మాత్రం అతిక్రమించ కూడదు.

* సంపాదకునిదే తుది నిర్ణయం.

*ఏప్రిల్ నెలాఖరులోగా మీ సమాధాన పత్రాలు "జ్యోతి" కార్యాలయం చేరాలి. కవరుపై "జ్యోతి పాటల పోటీ" అని వ్రాయాలి.

* ఏ కారణం చేతనైనా ఏప్రిల్ 20 వ తేదీ లోగా పై చిత్రాలలో ఏదయినా విడుదల కాకపోతే ఆ చిత్రం గురించి పోటీ పై నెలకు వాయిదా వేయబడుతుంది, మిగిలినదంతా మామూలే.

ఎనిమిది బహుమతులు

ఒకో చిత్రం గురించి వ్రాసిన వాటిలో ఉత్తమమైన రెండింటికీ (మొత్తం ఎనిమిది) బహుమతులు నలభై రూపాయలు పైగా విలువ చేయు గ్రామఫోను రికార్డులు, ప్రకృతికీ, మతికీ ఆహ్లాదం కలిగిస్తే పోటీ ఎన్నిక సుప్రసిద్ధ చిత్ర సంగీత వ్యాఖ్యాత శ్రీ వి.ఎ.కె. రంగారావు చేశారు.

Edited and Published by A. V. Raghavaiah
and Printed by him at Jyothi Printers,
Machavaram, Vijayawada-2